www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 1-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 93 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: దశమి ఉ. 10.26 తదుపరి ఏకాదశి; నక్షత్రం: అశ్వని ఉ. 6.26, భరణి తె. 5.27 వరకు; వర్జ్యం: మ.3.38-5.10, దుర్ముహూర్తం: మ.12.45-1.37, మ.3.21-4.13; అమృతఘడియలు: రా.12.50-2.22; రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.49 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ప్రజల మనిషి వెంకయ్య

- భరతమాత సేవలో ఆయన జీవన ప్రస్థానం
- ప్రజాసేవ పట్ల తిరుగులేని నిబద్ధత గల నేత
- ఆటుపోట్లను తెలివిగా అధిగమించే సమర్థుడు
- మాజీ ఉపరాష్ట్రపతిపై ప్రధాని మోదీ వ్యాసం

వెంకయ్యనాయుడి వాక్పటిమ.. సాటిలేనిది

- జన్మదిన వేడుకల సందర్భంగా ప్రధాని ప్రశంస
- వెంకయ్యపై 3 పుస్తకాల ఆవిష్కరణ

3



వెంకయ్యపై పుస్తకాన్ని ఢిల్లీలో విడుదల చేస్తున్న మోదీ

స్వదేశీ న్యాయం

నేటి నుంచి అమలులోకి కొత్త నేరచట్టాలు

భారతీయ న్యాయ సంహిత, నాగరిక్ సురక్ష, సాక్ష్య అధినియమ్

ఐపీసీ ఇక బీఎన్ఎస్, సీఆర్‌పీసీ-బీఎన్ఎస్ఎస్, ఎవిడెన్స్ యాక్ట్- బీఎస్ఏగా మార్పు


పోలీసులకు మరిన్ని అధికారాలు

దేశద్రోహం.. రాజద్రోహంగా పరిగణన

నిందితుల చేతులకు బేడీల పునరుద్ధరణ

కొత్త చట్టాలపై పలు వర్గాల అభ్యంతరాలు

ఇవి మన కోసం చేసుకున్న చట్టాలు: అమిత్‌షా



న్యూఢిల్లీ, జూన్ 30: దేశ నేర న్యాయవ్యవస్థలో విస్తృతమైన మార్పులు తీసుకొచ్చే కొత్త నేర చట్టాలు సోమవారం నుంచి అమలులోకి రానున్నాయి. బ్రిటిష్ కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ) ఇక మీదట భారతీయ న్యాయ సంహితగా (బీఎన్ఎస్), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ) భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)గా, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ భారతీయ సాక్ష్య అధినియమ్ (బీఎస్ఏ)గా మారనున్నాయి. అయితే, వివిధ వర్గాల నుంచి నూతన చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వీటి అమలును నిలిపివేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఇప్పటికే ఓ పిటిషన్ దాఖలైంది. గత ఏడాది డిసెంబరులో సదరు

మిగతా 2వ పేజీలో...

'బెయిల్' కఠినం

- పోలీసు కస్టడీలో 55-75 రోజులు
- డిజిటల్ ఉపకరణాలను ట్యాంపర్ చేసి సాక్ష్యాధారంగా వాడే ముప్పు
- కొత్త చట్టాల్లో వివాదాంశాలు..
- అమలును వాయిదా కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్

2



మోదీతో ఫోన్‌లో మాట్లాడుతున్న కోహ్లి, రోహిత్

'ప్రపంచ' వీరులకు రూ. 125 కోట్లు

- టీమిండియాకు బీసీసీఐ భారీ నజరానా
- అంతర్జాతీయ టీ20లకు జడేజా గుడ్‌బై
- విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ బాటలో వీడ్కోలు
- ఒక్క రోజులో ముగ్గురు క్రికెటర్ల నిర్ణయం
- కోచ్‌గా ముగిసిన ద్రవిడ్ పదవీ కాలం..
- క్రికెటర్లకు మోదీ ఫోన్.. గెలుపుపై ప్రశంసలు

సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. వందకోట్ల మంది అభిమానుల ఆకాంక్షలను నెరవేరుస్తూ టీ20 ప్రపంచ కప్ గెలిచిన టీమిండియాకు బీసీసీఐ రూ.125 కోట్ల రివార్డు ప్రకటించింది. కింగ్ కోహ్లి, కెప్టెన్ రోహిత్ శనివారం పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పగా.. ఆల్‌రౌండర్ జడేజా ఆదివారం వారి బాటలోనే నడిచాడు. హెడ్ కోచ్ ద్రవిడ్ పదవీ కాలం జూన్‌తో ముగిసింది. ప్రపంచకప్ విజయం అనంతరం ప్రధాని మోదీ.. కోచ్, క్రికెటర్లకు ఫోన్ చేశారు. ద్రవిడ్, రోహిత్, కోహ్లి, పాండ్య, సూర్యను అభినందించారు.

11

బదిలీకి లెక్క

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు

10 మంది పిల్లలున్న పాఠశాలకు ఒక టీచర్

40 మంది ఉంటే ఇద్దరు.. 60 మందికి ముగ్గురు

బదిలీల్లో ఉపాధ్యాయుల కేటాయింపు విధానమిదే

విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి హేతుబద్ధీకరణ

విద్యా బోధనలో నాణ్యత ప్రమాణాల కోసమే..

ప్రవేశాల్లేని బడులకు ఉపాధ్యాయులను ఇవ్వరు

వీటిలో 8ఏళ్లు పూర్తయితే బదిలీ.. కోరుకున్నవారికీ!

ఆప్షన్లు చూపించకపోవడంపై సంఘాల అభ్యంతరం

బదిలీలు చేశాక సర్దుబాటు చేయాలని డిమాండ్



హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలల్లో ఇకపై విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే ఉపాధ్యాయులను కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా బోధన అందుతుందని భావిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయుల బదిలీల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను కూడా ఈ మేరకే చూపిస్తున్నారు. బదిలీల్లో భాగంగా ప్రస్తుతం.. ఉపాధ్యాయులు తాము కోరుకునే స్థానాలకు సంబంధించి వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకునే ప్రక్రియ కొనసాగుతోంది. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా.. కొన్ని పాఠశాలల్లో ఉన్న పోస్టుల కంటే తక్కువ పోస్టులను చూపిస్తున్నారని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ, ఆ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ పోస్టులు కేటాయించే క్రమంలో కొన్ని పాఠశాలలకు ఉన్న పోస్టుల కంటే తక్కువ మంది

మిగతా 13వ పేజీలో...

తెలంగాణ ఏర్పాటులో డీఎస్ పాత్ర కీలకం

- గాంధీ కుటుంబానికి ఆయన ఎంతో ఆత్మీయుడు
- నిజామాబాద్‌లో నివాళులర్పించిన సీఎం రేవంత్
- అధికార లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు

12

స్మార్ట్ సిటీల గడువు పొడిగింపు

- పనుల పూర్తికి వచ్చే మార్చి 31 దాకా అవకాశం
- జాబితాలో రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్
- కొత్త పనులు ఇవ్వరు.. పాతవే పూర్తి చేయాలి..
- మ్యాచింగ్ నిధులిచ్చి అభివృద్ధికి సహకరించాలి
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

13



14

వైద్య రిపోర్టులు ఆన్‌లైన్‌లో

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇకపై అమలుకు నిర్ణయం
- రోగుల ఫోన్లకు మెసేజ్‌లు.. 2 జిల్లాల్లో పైలెట్‌గా..
- తర్వాత దశలవారీగా రాష్ట్రమంతటా వర్తింపు

రేవంత్ ఇంటికి గోయల్

- హైదరాబాద్‌కు వచ్చిన కేంద్రమంత్రిని ఆహ్వానించిన సీఎం
- రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చ
- భేటీలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, వేం నరేందర్‌రెడ్డి

13

పశ్చిమబెంగాల్‌లో ఆటవిక శిక్షలు!

» లక్ష్మీపూర్‌లో టీఎంసీ మద్దతుదారు ఘాతుకం


మహిళను కొడుతున్న తేజేముల్

కోల్‌కతా, జూన్ 30: పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ మద్దతుదారు ఒకరు 'ఇన్సాఫ్ సభ' పేరుతో ఆటవిక శిక్షలు విధిస్తున్న ఉదంతమిది. తాజాగా ఓ మహిళ, మరో యువకుడిని నడిరోడ్డుపై కింద పారేసి.. విచక్షణా రహితంగా కర్రతో దాడి చేసి, కాళ్లతో తన్నిన ఘటన వెలుగులోకి వచ్చింది. సీపీఎం నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు మహమ్మద్ సలీమ్ స్వయంగా ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఆ వీడియో వైరల్ అవుతున్నా.. అటు ప్రభుత్వం గానీ, ఇటు పోలీసులు గానీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవడం గమనార్హం..! వివరాల్లోకి వెళ్తే.. చోప్రా నియోజకవర్గ పరిధిలోని దిఘల్‌గావ్ ప్రాంతం, లక్ష్మీపూర్ గ్రామంలో టీఎంసీ ఎమ్మెల్యే హమీద్-ఉర్-రెహ్మాన్ అనుచరుడు జేసీబీ అలియాస్ తేజేముల్ అనే వ్యక్తి తక్షణ న్యాయం పేరుతో స్థానికంగా 'ఇన్సాఫ్ సభ'లను ఏర్పాటు చేస్తూ.. ఆటవిక శిక్షలను విధిస్తుంటాడు. ఈ క్రమంలో వివాహేతర సంబంధం పేరుతో ఓ మహిళను, మరో యువకుడిని చితకబాదుతున్న వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అయ్యింది. బాధిత మహిళ దెబ్బలకు తాళలేక.. రోడ్డుపై పొర్లుతూ రోదిస్తున్నా.. కనికరం లేకుండా కర్రతో ఎడాపెడా దాడి చేశాడు. మరో యువకుడిని కూడా ఇదేవిధంగా హింసించాడు. చుట్టూ జనం గుమిగూడినా.. ఓ వృద్ధుడు మినహా.. ఎవరూ తేజేముల్‌ను ఆపేందుకు యత్నించలేదు. కొంతదూరంలోనే పోలీసు పెట్రోలింగ్ జీపు ఉన్నా.. ఒక్క పోలీసు కూడా కిందకు దిగి, అతణ్ని వారించే ప్రయత్నం చేయలేదు. దీనిపై సీపీఎం నేత సలీం సీరియస్ అయ్యారు. బెంగాల్‌లో మమత హయాంలో ఆటవిక శిక్షలను విధిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ సోషల్ మీడియా చీఫ్ మాలవీయ కూడా.. "తాలిబాన్ల తరహాలో శిక్షలు విధిస్తుంటే.. ప్రభుత్వం ఏం చేస్తోంది" అని ప్రశ్నించారు.

ఇక పట్టణాల్లోనూ భూరికార్డుల ఆధునికీకరణ!

న్యూఢిల్లీ, జూన్ 30: గ్రామీణ భారతంలో భూములు, ఆస్తుల రికార్డులను ఆధునికీకరించిన కేంద్రప్రభుత్వం ఇప్పుడు పట్టణాల్లోనూ ఈ ప్రక్రియ ప్రారంభించాలని యోచిస్తోంది. జియోగ్రాఫిక్ డేటా సేకరణను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టనుంది. ఎంపిక చేసిన 8-9 రాష్ట్రాల్లో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని భావిస్తోంది. డ్రోన్లు లేదా శాటిలైట్ ఇమేజ్‌ల ద్వారా ప్రతి ప్లాట్ సరిహద్దులను సర్వే ద్వారా గుర్తించి భౌగోళిక యాజమాన్య రికార్డులను రూపొందించాలన్నది తమ ఆలోచనగా గ్రామీణాభివృద్ధి శాఖ సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు. యజమానులు చూపించే పత్రాల ద్వారా వారిని గుర్తించేందుకు పట్టణ యంత్రాంగాలు క్షేత్ర స్థాయి సర్వే జరుపుతాయన్నారు. ప్రతి ప్రాపర్టీ యజమానికి ప్రాపర్టీ కార్డు ఇవ్వాలని కేంద్రం యోచిస్తోంది.

కుటుంబ పింఛనుదారుల సమస్యలపై ప్రత్యేక డ్రైవ్

న్యూఢిల్లీ, జూన్ 30: కేంద్ర ప్రభుత్వం కుటుంబ పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం నుంచి ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించనుంది. జూలై 31 వరకు కొనసాగే ఈ కార్యక్రమంలో 46 శాఖలు/విభాగాలు పాల్గొంటాయి. ఇప్పటి వరకు పింఛన్ సమస్యలపై దాదాపు 90 వేల అర్జీలు ఆన్‌లైన్‌లో అందాయని, వీటిలో కుటుంబ పింఛన్లవి 20-25% ఉన్నాయని కేంద్ర సిబ్బంది మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇందులో రక్షణ శాఖ, రైల్వే శాఖ, కేంద్ర సాయుధ పోలీసు దళానికి సంబంధించినవి ఎక్కువగా ఉన్నాయని వివరించింది. కుటుంబ పింఛన్లకు సంబంధించి సమస్యలుంటే నేరుగా కానీ www.pgportal.gov.in/PENSION పోర్టల్‌లో కానీ నమోదు చేసుకోవచ్చని తెలిపింది. టోల్ ఫ్రీ నంబర్ 1800-1101960లో సంప్రదించవచ్చని

అసెంబ్లీ ఎన్నికల్లో కూటమిగానే పోటీ: శరద్ పవార్

పుణె, జూన్ 30: మహారాష్ట్ర అసెంబ్లీకి అక్టోబరులో జరగనున్న ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి కలిసికట్టుగానే పోటీ చేస్తుందని సీనియర్ నాయకుడు, ఎన్‌ఎస్‌పీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ వెల్లడించారు. ఈ కూటమిలోని ఎన్‌సీపీ (శరద్ పవార్), శివసేన (ఠాక్రే), కాంగ్రెస్ పార్టీలు ఉమ్మడిగానే రంగంలో ఉంటాయని తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ తమ కూటమిలో చిన్న పార్టీలను కూడా చేర్చుకుంటామని చెప్పారు. గత లోక్‌సభ ఎన్నికల్లో వామపక్షాలు, పీజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీకి సీట్లు ఇవ్వలేకపోయామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం వాటికి సీట్లను సర్దుబాటు చేయాల్సిన నైతిక బాధ్యత తమపై ఉందని చెప్పారు.

ఆర్మీ చీఫ్‌గా ఉపేంద్ర ద్వివేది బాధ్యతల స్వీకరణ



న్యూఢిల్లీ, జూన్ 30: భారత 30వ సైన్యాధిపతిగా జనరల్ ఉపేంద్ర ద్వివేది బాధ్యతలు చేపట్టారు. ఆయనకు పాకిస్థాన్, చైనా సరిహద్దుల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం ఉంది. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంబడి సహా భద్రతకు సంబంధించిన అనేక సవాళ్లను దేశం ఎదుర్కొంటున్న వేళ 13 లక్షల సిబ్బందిని కలిగి ఉన్న బలమైన సైన్యానికి ఆయన అధిపతి అయ్యారు. ఇప్పటి వరకు ఆ పదవిలో కొనసాగిన జనరల్ మనోజ్ పాండే నుంచి ఆదివారం ఆయన ఆర్మీచీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాలుగు దశాబ్దాలకుపైగా సైన్యంలో సేవలందించిన జనరల్ మనోజ్ పాండే ఆదివారం పదవీ విరమణ పొందారు. జనరల్ పాండే 2022 నుంచి ఆర్మీ చీఫ్‌గా కొనసాగారు.

మెదక్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ సీజీఎంగా ఎస్‌ఎస్ ప్రసాద్



అల్వాల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా ఎస్‌ఎస్ ప్రసాద్ నియమితులయ్యారు. సోమవారం ఆయన ఈ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటివరకు ఆ పదవిలో ఉన్న కే సుధాకర్ పదవీ విరమణ చేశారు. ఎస్‌ఎస్ ప్రసాద్ 1992లో ఇండియన్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీలో చేరారు. శిక్షణ అనంతరం 1993లో తొలుత డెహ్రాడూన్‌లోని ఆప్టోఎలక్ట్రానిక్స్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ వర్క్స్ మేనేజర్‌గా విధులు నిర్వహించారు. తర్వాత కాన్పూర్‌లోని పారాచూట్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీకి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. 2016 జూన్‌లో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. తర్వాత, 2023 సెప్టెంబరులో మెదక్ ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్‌గా నియమితులయ్యారు.

నీట్-యూజీ ఇక ఆన్‌లైన్‌లో.. కేంద్రం పరిశీలన

న్యూఢిల్లీ, జూన్ 30: నీట్-యూజీని పెన్ను-పేపరు విధానానికి బదులు ఇక ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మే 5న ఈ పరీక్ష నిర్వహించగా.. ప్రశ్నపత్రం లీక్, అవకతవకలు వెలుగుచూడడంతో కేంద్రంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహణకు కేంద్రం మొగ్గు చూపుతోంది. ఇదిలా ఉండగా, నీట్ అక్రమాలకు సంబంధించి గోద్రాలో ఓ పాఠశాల యజమానిని సీబీఐ అరెస్టు చేసింది.

స్వదేశీ న్యాయం

(మొదటి పేజీ తరువాయి)

చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభల నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారని, చర్చ జరపకుండానే బిల్లులను ఆమోదించారని పిటిషనర్లు అంజలీ పటేల్, ఛాయామిశ్రా పేర్కొన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలను సేకరించలేదన్నారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నారని గుర్తు చేశారు. ఈ చట్టాల ప్రకారం నిందితులకు బెయిల్ ఇచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయని, పోలీసులకు విపరీతమైన అధికారాలు లభిస్తాయని పేర్కొన్నారు. మరోవైపు, కొత్త నేరచట్టాల అమలును వాయిదా వేయాలని కోరుతూ పౌరహక్కుల ప్రజాసంఘం (పీయూసీఎల్) కేంద్ర న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్‌కు లేఖ రాసింది. క్రిమినల్ లాయర్లు, దర్యాప్తు సంస్థలు, న్యాయమూర్తులు, సాధారణ పౌరుల నుంచి విస్తృత స్థాయిలో అభిప్రాయాలు సేకరించకుండానే ఈ చట్టాలను తీసుకొచ్చారని గుర్తు చేసింది. భారతదేశ ప్రజాస్వామ్యంపై దీర్ఘకాలికంగా తీవ్ర ప్రభావం చూపే ఈ చట్టాలపై ఇప్పటికైనా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చలు జరపాలని, అప్పటి వరకూ వాటి అమలును వాయిదా వేయాలని పీయూసీఎల్ కోరింది. వలస చట్టాల నుంచి బయటపడుతున్నామని చెబుతూనే.. నాటి బ్రిటీష్ చట్టాల్లోని అనేక అంశాలను యథాతథంగా తీసుకొచ్చారని(కట్ అండ్ పేస్ట్) పీయూసీఎల్ వెల్లడించింది. మరోవైపు నూతన నేర చట్టాలు పేరులోనేగాక సారంలోనూ భారతీయతను కలిగి ఉన్నాయని, వాటి ఆత్మ, శరీరం, స్ఫూర్తి భారతీయత అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. 'భారతీయుల కొరకు భారతీయుల చేత భారత పార్లమెంటు ద్వారా ఇవి రూపొందాయి. వలసకాలపు చట్టాలకు దీంతో తెరపడింది' అన్నారు.



నూతన చట్టాల్లోని వివాదాస్పద అంశాలు

- న్యాయసంహిత చట్టంలో గ్యాంగ్, వ్యవస్థీకృత నేరముఠాల వంటి పదాలున్నాయిగానీ వాటిని నిర్వచించలేదు. ఫలితంగా అమాయకులను కూడా కేసులతో ఇరికించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు అంటున్నారు.
- న్యాయసంహిత ప్రకారం మానసిక వికలాంగులకు విచారణ నుంచి రక్షణ లభిస్తుంది. అయితే, బుద్ధిమాంద్యం ఉన్న వారిని ఈ క్యాటగిరీలో చేర్చలేదు. దీంతో, బుద్ధిమాంద్యం ఉన్న వారిపై కేసు నమోదు చేయొచ్చు.
- నాగరిక్ సురక్ష సంహిత ప్రకారం.. పోలీసులు నిందితులను తమ కస్టడీలో 15 రోజులపాటు ఉంచుకోవచ్చు. అంతేకాదు, ఆ తర్వాత కూడా 40 నుంచి 60 రోజుల అదనపు కస్టడీని కోరవచ్చు. ఈ కస్టడీని ఒకేదఫాలో గానీ పలుదఫాల్లోగానీ అమలుపరచవచ్చు. తద్వారా నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా కూడా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.
- ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవిడెన్సు యాక్ట్ ద్వితీయ స్థాయి సాక్ష్యాధారాలుగా పరిగణిస్తే.. దానిస్థానంలో వచ్చిన భారతీయ సాక్ష్య అభినియమ్ వాటిని ప్రథమ స్థాయి సాక్ష్యాధారాలుగా పరిగణిస్తోంది. తద్వారా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటి సాధనాలతోపాటు సెమీకండక్టర్ మెమొరీలో నిక్షిప్తమై ఉన్న సమాచారాన్ని కూడా సాక్ష్యాధారంగా భావిస్తుంది. వీటిని సాక్ష్యంగా పరిగణించే కొత్త చట్టం.. పోలీసులు వీటిని నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నప్పుడు లేదా తనిఖీ నిర్వహించినప్పుడు వాటిల్లో లేని సమాచారాన్ని తామే స్వయంగా చొప్పిస్తే పరిస్థితి ఏమిటి? అన్నదానిని మాత్రం చర్చించలేదు. అటువంటి పరిస్థితి తలెత్తకుండా ఎటువంటి చర్యలనుగానీ, నిబంధనలనుగానీ పేర్కొనలేదు.

ఇతర ముఖ్యాంశాలు

క్రిమినల్ కేసుల్లో విచారణ ప్రారంభమైన తర్వాత 60 రోజుల్లోపు అభియోగాలు నమోదు చేయాలి. విచారణ పూర్తయిన 45 రోజుల్లోపు న్యాయమూర్తి తీర్పు వెలువరించాలి. గరిష్ఠంగా కేసును రెండుసార్లు మాత్రమే వాయిదా వేయాలి. రేప్ బాధితుల వాంగ్మూలాన్ని మహిళా పోలీసు అధికారి బాధితురాలి సంరక్షకుల సమక్షంలో నమోదు చేయాలి. ఘటన జరిగిన తర్వాత ఏడు రోజుల్లోపు వైద్య నివేదిక సిద్ధం కావాలి. సాక్షులకు రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలి. లింగసమానత్వంలో భాగంగా లింగం (జెండర్) అనే క్యాటగిరీ కింద ట్రాన్స్‌జెండర్లకు కూడా అవకాశం.

స్వాతంత్ర్యోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టటానికి బ్రిటీష్ ప్రభుత్వం ఉపయోగించిన దేశద్రోహ చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామని కేంద్రం నాడు సుప్రీంకోర్టులో తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి దేశద్రోహ చట్టాన్ని రాజద్రోహం పేరుతో తీసుకొచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించటానికి ప్రజలకు ఉన్న హక్కును అణచివేయటానికి ఈ చట్టం ఉపయోగపడుతుందన్న విమర్శలు ఎంతో కాలంగా ఉన్నాయి.

అరెస్టు సందర్భంగా నిందితుల చేతులకు బేడీలు వేయటాన్ని పునరుద్ధరించటం, తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ప్రస్తుత నిబంధనను తొలగించటం.. పాతకాలపు పోకడలకు దేశాన్ని మళ్లీ తీసుకెళ్లటంగా పలువురు భావిస్తున్నారు.

5 చట్టంలో కమ్మింది

భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)

- మహిళలు, పిల్లలపై జరిగే నేరాలపై విచారణకు ప్రాధాన్యం ఇచ్చారు. పెళ్లి చేసుకుంటాననో లేదా మరో విధంగానో యువతులను మోసగించి లైంగికంగా సంబంధం పెట్టుకోవటాన్ని సెక్షన్ 69 ప్రకారం నేరంగా పరిగణిస్తారు. మైనర్‌పై గ్యాంగ్‌రేప్‌నకు పాల్పడిన వారికి మరణశిక్ష లేదా జీవితఖైదు విధిస్తారు.
- బాధిత మహిళలను, పిల్లలను ఆస్పత్రిలో చేర్చగానే వారికి తొలుత ఉచితంగా వైద్యం అందించాల్సి ఉంటుంది.
- ఉగ్రవాదం, ఉగ్రవాద చర్యలను తొలిసారిగా నిర్వచించి నేర చట్టం కిందికి తీసుకొచ్చారు.
- ఇంతకుముందటి దేశద్రోహం నేరాన్ని రాజద్రోహంగా మార్పు చేశారు.
- నిర్లక్ష్యంతో వాహనం నడిపించి మరణానికి కారణమైన నేరస్థులకు (హిట్ అండ్ రన్ కేసుల్లో) ఇప్పుడున్న రెండేళ్ల జైలు శిక్షను ఐదేళ్లకు పెంచారు.
- మూకదాడిని హత్యతో సమానంగా పరిగణించి విచారిస్తారు.
- శిక్ష అమలులో భాగంగా నిందితులతో సామాజిక సేవ చేయించటం అనే కొత్త నిబంధనను ప్రవేశపెట్టారు.

భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్)

- ఇప్పటి వరకున్న సీఆర్‌పీసీ ప్రకారం.. పోలీసులు తొలుత ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన తర్వాతే విచారణ ప్రారంభించాలి. వివాహ సంబంధిత వివాదాలు, వ్యాపార గొడవలు వంటి కొన్నింట్లోనే తొలుత విచారణ జరిపి ఆ తర్వాత అవసరమైతే ఎఫ్ఐఆర్ దాఖలు చేస్తారు. కానీ, కొత్త చట్టం ప్రకారం పోలీసులు ఏ కేసులోనైనా తొలుత ప్రాథమిక విచారణ జరిపి, అవసరమైతేనే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలి.
- పోలీస్ స్టేషన్ పరిధితో సంబంధం లేకుండా ఘటన ఎక్కడ జరిగినా ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ఎఫ్ఐఆర్ దాఖలు చేయవచ్చు. దీనినే జీరో ఎఫ్ఐఆర్‌గా వ్యవహరిస్తున్నారు.
- పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఏదైనా ఘటనపై ఫోన్ తదితర సమాచార సాధనాల ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.
- అరెస్టు చేసిన వ్యక్తుల వివరాలను పోలీస్ స్టేషన్‌లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలి. తద్వారా సదరు వ్యక్తుల బంధుమిత్రులు తగు న్యాయపరమైన చర్యలు చేపట్టటానికి వీలవుతుంది.
- ప్రస్తుతం ఈడీకి నిందితుల ఆస్తులను జప్తు చేసే అధికారం ఉన్నట్లుగా నేరాలపై దర్యాప్తు జరిపే సంస్థలకు కూడా ఆస్తుల జప్తు అధికారాల్ని ఈ కొత్త చట్టం కట్టబెడుతోంది.
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిందితులు, బాధితులు, సాక్షులు విచారణకు హాజరు కావచ్చు. ఇదే పద్ధతిలో వాంగ్మూలాన్ని కూడా రికార్డు చేయవచ్చు.

లోకం తీరు



భారతీయ సాక్ష్య అధినియమ్

- ఇంతకుముందటి ఎవిడెన్స్ యాక్ట్‌లోని పలు అంశాలను దీంట్లో తిరిగి కొన్ని మార్పులతో పొందుపరిచారు. ఉదాహరణకు, ఎవిడెన్స్ యాక్టులో భారత భూభాగం అంతటికీ చట్టం వర్తిస్తుందని స్పష్టం చేయగా.. దాంట్లో ఉన్న 'ఇండియా' అనే పేరును బీఎస్ఏలో తొలగించారు. తద్వారా భారత భూభాగం వెలుపలి ప్రాంతాలకు చెందిన డిజిటల్ రికార్డులను కూడా సాక్ష్యంగా పరిగణించటానికి అవకాశం ఏర్పడింది.
- స్మార్ట్‌ఫోన్లు, ఇతర డిజిటల్ ఉపకరణాల్లోని వివరాలను కూడా సాక్ష్యాధారాలుగా పరిగణిస్తూ 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తృతపరిచారు. ఆడియో, వీడియో రికార్డులను కూడా ఎవిడెన్స్‌గా పరిగణిస్తారు.
- ఆర్థిక తదితర రంగాల నిపుణుల మౌఖిక అభిప్రాయాలనూ సాక్ష్యాధారంగా పరిగణిస్తారు.
- ఏదైనా కేసులో నిందితులు ఒకరి కంటే ఎక్కువ ఉంటే.. విచారణ దశలో వారిలో ఎవరైనా పరారైనా.. ఆ నిందితుడి గైర్హాజరులోనే విచారణ కొనసాగుతుంది.

సవాళ్లు

- కొత్త నేరచట్టాల అమలుకు ముందు (2024 జూలై 1వ తేదీకి ముందు) జరిగిన నేరాలను ఐపీసీ తదితర పాత చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి జరిగిన నేరాలను కొత్త చట్టాల ప్రకారం విచారించాలి. ఇది తీవ్ర గందరగోళానికి దారితీసి న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బందులను ఎదుర్కొనే అవకాశం ఉంది. కేసుల నమోదులో పోలీసులకూ ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతాయి.
- నిందితులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరపవచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయి. కానీ, దేశంలోని 80% కోర్టుల్లో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు.

డిప్యూటీ స్పీకర్ బరిలో అవధేశ్ ప్రసాద్!

అభ్యర్థిగా నిలపాలని విపక్ష కూటమి యోచన



న్యూఢిల్లీ, జూన్ 30: లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవికి సమాజ్‌వాదీపార్టీ ఎంపీ అవధేశ్ ప్రసాద్‌ను తమ అభ్యర్థిగా బరిలో నిలపాలని విపక్ష ఇండియా కూటమి భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు కూటమిలోని ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, తృణమూల్, ఎస్పీ సంప్రదింపులు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. యూపీకి చెందిన అవధేశ్ ప్రసాద్ తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య రామాలయం ఉన్న ఫైజాబాద్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి మీద తొలిసారిగా ఎంపీగా విజయం సాధించి సంచలనం సృష్టించారు. ఫైజాబాద్ నియోజకవర్గం జనరల్‌సీటు అయినప్పటికీ దళిత సామాజికవర్గానికి చెందిన అవధేశ్ ప్రసాద్ అక్కడి నుంచి విజయం సాధించటం విశేషం. ఎన్నికల్లో బీజేపీ హిందుత్వ అజెండా ఓడిపోయిందనటానికి అవధేశ్ గెలుపు ఓ నిదర్శనమని, జనరల్ స్థానం నుంచి ఆయన గెలవటం దేశ రాజకీయాల్లో ఓ ముఖ్యమైన పరిణామమని ఇండియా కూటమికి చెందిన ఒక సీనియర్ నేత వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలి 17వ లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ లేకుండానే ముగిసింది. ఈసారి కూడా ఎన్డీయే సర్కారు ఈ పదవిని ఖాళీగానే ఉంచుతుందా? లేక, ఆ పదవి భర్తీకి చర్యలు తీసుకుంటుందా అన్నదానిపై స్పష్టత లేదు. జూలై 3వ తేదీతో పార్లమెంటు తొలి దశ సమావేశాలు ముగుస్తాయి. ఆలోపు ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోతే స్పీకర్‌కు లేఖ రాయాలని ఇండియా కూటమి భావిస్తున్నట్లు సమాచారం. కాగా, సోమవారం పార్లమెంటు సమావేశాలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

అమ్మ కోసం ఓ మొక్క!

ప్రధాని నూతన కార్యక్రమం 'ఏక్ పేడ్ మా కే నామ్'

» మూడోసారి గద్దెనెక్కాక తొలి 'మన్ కీ బాత్'లో మోదీ ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 30: తల్లిని గౌరవించేందుకు దేశంలోని ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటాలని ప్రధాని మోదీ పిలుపిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం తన ప్రభుత్వం చేపట్టిన కొత్త కార్యక్రమం 'అమ్మ పేరుతో ఓ మొక్క (ఏక్ పేడ్ మా కే నామ్)' గురించి 'మన్ కీ బాత్'లో ప్రకటించారు. మూడోసారి ప్రధాని అయ్యాక.. ఆకాశవాణిలో ఆదివారం 'మన్ కీ బాత్' తొలి సంచికలో ఆయన ప్రసంగించారు. తాను కూడా తన తల్లి పేరిట ఓ మొక్క నాటానని ప్రధాని తెలిపారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామిక విలువలపై తమకున్న అచంచల విశ్వాసాన్ని ఓటుద్వారా వ్యక్తం చేసిన దేశ ప్రజలను ఆయన అభినందించారు. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో 65 కోట్ల మందికిపైగా తమ ఓటుహక్కు వినియోగించుకున్నారని గుర్తుచేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్‌ను, ఈ ప్రక్రియలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందించారు. ఎన్డీయేని తిరిగి ఎన్నుకున్నందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. వివిధ అంశాలను ప్రస్తావిస్తూ.. భారతీయ సంస్కృతి విశ్వవ్యాప్తంగా పరిఢవిల్లుతోందని చెప్పారు. మన కవులు, భాషలకు పలు దేశాల్లో ప్రాధాన్యం లభిస్తోందన్నారు. భారతీయ భాషలతో పాటు ఆచార సంప్రదాయాలను కూడా వివిధ దేశాల్లో పాటిస్తున్నారని తెలిపారు. 'కువైట్ ప్రభుత్వం అక్కడి నేషనల్ రేడియోలో ప్రతీ ఆదివారం హిందీలో ప్రత్యేక కార్యక్రమం ప్రసారం చేస్తోందన్నారు. తుర్కిమెనిస్థాన్‌లో ఇటీవల వారి జాతీయ కవి (మగ్తిమ్‌గులీ ఫైరగీ) 300వ జయంతి జరిగింది. ఆ సందర్భంగా ఆ దేశాధ్యక్షుడు ప్రపంచ ప్రసిద్ధి చెందిన 24 మంది కవుల విగ్రహాలను ఆవిష్కరించారు. వారిలో మన గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం కూడా ఉంది. జూన్ 21న 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సౌదీ అరేబియాలో అల్ హనౌఫ్ సాద్ అనే మహిళ ప్రధాన యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ దేశంలో ఓ మహిళ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం ఇదే ప్రథమం' అని వివరించారు. గిరిజన పోరాట యోధులు వీర్ సిద్ధూ, కాన్హూలకు ప్రధాని ఘనంగా నివాళులు అర్పించారు. 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే 1855లో బ్రిటీష్ పాలకులపై సంతాల్ తిరుగుబాటుకు వీరు సారథ్యం వహించారు. వీరి స్మారకార్థం గిరిజనులు జూన్ 30ని 'హూల్ దివస్'గా జరుపుతారు. ఆకాశవాణిలో సంస్కృత వార్తల బులెటిన్ 50 ఏళ్లు పూర్తిచేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తంచేశారు. వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్‌లో పాలుపంచుకోనున్న భారతీయ అథ్లెట్లకు ప్రధాని శుభాకాంక్షలు తెలిపారు.


2016లో మోదీ, చంద్రబాబు కాఫీ తాగుతున్న ఫొటో, ఆదివారం ప్రధాని ఈ ఫొటోను ఎక్స్‌లో పోస్టు చేశారు

నీట్ లీక్ ప్రస్తావన ఏది?

మోదీ 'మన్ కీ బాత్'లో ప్రజల సమస్యలను ప్రస్తావించలేదని కాంగ్రెస్ ఆక్షేపించింది. నీట్ పేపర్ లీకులు, రైలు ప్రమాదం, వంతెనలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పైకప్పు కూలడం వంటివాటి ఊసెత్తలేదని ఏఐసీసీ మీడియా-పబ్లిసిటీ అధిపతి పవన్ ఖేరా ధ్వజమెత్తారు. మోదీ మూడోసారి గెలిచినప్పటికీ స్వశక్తితో ప్రధాని కాలేదన్నారు.

అరకు కాఫీకి ఫిదా!

న్యూఢిల్లీ/అమరావతి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అరకు కాఫీ అద్భుతమని ప్రధాని మోదీ ప్రశంసించారు. 2016లో ఏపీ సీఎం చంద్రబాబుతో కలిసి ఈ కాఫీ రుచి చూశానన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో అరకు కాఫీ గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. గొప్ప రుచికి, సువాసనకు ఇది అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. 'ఒకసారి విశాఖపట్నంలో చంద్రబాబుతో కలిసి ఈ కాఫీని రుచి చూసే అవకాశం నాకు లభించింది. చాలా అద్భుతంగా ఉంది. ఢిల్లీలో జరిగిన జీ-20 సదస్సులోనూ దీని మాధుర్యాన్ని అతిథులు రుచి చూశారు. మీకూ అవకాశం దొరికినప్పుడల్లా అరకు కాఫీని ఆస్వాదించండి' అని మోదీ ప్రజలను కోరారు. 2016లో చంద్రబాబుతో కలిసి కాఫీ తాగిన ఫొటోలను ఎక్స్‌లో షేర్ చేశారు. మోదీ పోస్టుపై చంద్రబాబు స్పందించారు. 'అరకు కాఫీని మన గిరిజన సోదరీమణులు ప్రేమ, భక్తితో పండిస్తారు. అరకు కాఫీకి ప్రచారం కల్పిస్తున్నందుకు ప్రధాని మోదీకి ధన్యవాదాలు. మీతో మరో కప్పు అరకు కాఫీ తాగుతూ ఆనందించడానికి ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు.

బ్రిటన్ ఎన్నికల్లో హిందూ మ్యానిఫెస్టో!

» ఆ దేశంలో 10 లక్షల మందికిపైగా హిందువులు

» తన నేపథ్యాన్ని గుర్తు చేస్తూ సునాక్ ప్రయత్నం


ఆదివారం లండన్‌లోని స్వామినారాయణ్ మందిర్‌లో సునాక్ దంపతుల పూజలు

లండన్, జూన్ 30: ఎన్నడూ లేనివిధంగా బ్రిటన్ ఎన్నికల్లో హిందూ మ్యానిఫెస్టో ఈసారి ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఆలయాల సంరక్షణకు, అకారణ విద్వేషానికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు చొరవ చూపాలంటూ స్థానిక హిందూ సంస్థలు నిర్దేశించిన అంశాలు ప్రస్తుతం కీలకంగా మారాయి. బ్రిటన్‌లో జూలై 4న గురువారం బ్రిటన్‌లో పోలింగ్ జరగనుంది. ఈ దేశంలో పది లక్షల మందిపైగానే హిందువులున్నారు. దీంతో ఇద్దరు ప్రధాన అభ్యర్థులు వారి ఓట్లే లక్ష్యంగా ప్రయత్నాలు ప్రచారం సాగించారు. ఆలయాల సందర్శనతో పాటు భారత్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేస్తున్నారు. ప్రస్తుత ప్రధాని, కన్జర్వేటివ్ పార్టీని మరోసారి గెలిపించే బాధ్యతను భుజాన వేసుకున్న రిషి సునాక్ భార్య అక్షతా మూర్తితో కలిసి ఆదివారం స్వామి నారాయణ్ ఆలయాన్ని సందర్శించారు. హిందూ విశ్వాసాలు, విలువలు, సంస్కృతి గొప్పదనాన్ని కొనియాడారు. లేబర్ పార్టీ నాయకుడు, సునాక్ ప్రధాన ప్రత్యర్థి కీర్ స్టార్మర్ భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాన్ని పట్టాలెక్కిస్తానని ప్రకటించారు. ఈయన జై స్వామి నారాయణ్ అని నినదించారు. తమను గెలిపిస్తే సేవే లక్ష్యంగా ముందుకుసాగుతామని.. హిందూ ఫోబియాకు బ్రిటన్‌లో చోటు లేకుండా చేస్తానని వాగ్దానం చేశారు. కాగా, ఎన్నికలకు ముందు నిర్వహించిన అన్ని సర్వేల్లోనూ సునాక్ సారథ్యంలోని కన్జర్వేటివ్ పార్టీ వెనుకంజలో ఉన్నట్లు స్పష్టమైంది.ఈ నేపథ్యంలో ఎన్నికల్లో హిందువులతో పాటు భారతీయ మూలాలున్న ఓటర్లు ఎవరి వైపు మొగ్గుతారనేది కీలకంగా మారింది.


తాలిబాన్లకు భారత్ నిధులు

» కశ్మీరీ, ఖలిస్థానీ, పాక్ నేతలను చంపేందుకే

» సీఐఏ మాజీ అధికారి సారా ఆరోపణలు

న్యూఢిల్లీ, జూన్ 30: కశ్మీరీ, ఖలిస్థానీ, పాకిస్థాన్ వ్యాప్తంగా దేశ వ్యతిరేక నాయకులను చంపేందుకు అఫ్ఘానిస్థాన్ తాలిబాన్లకు భారత్ 10 మిలియన్ డాలర్ల (రూ.83.36 కోట్లు) నిధులు సమకూరుస్తోందంటూ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ-అమెరికా) మాజీ అధికారి సారా ఆడమ్స్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ నిధులను తాలిబాన్లు తెహ్రీక్-ఈ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ)కి చేరవేస్తూ హత్యలకు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అమెరికా మాజీ నేవీ సీల్ అధికారి, సీఐఏ కాంట్రాక్టర్ షాన్ ర్యాన్ నిర్వహించిన 'షాన్ ర్యాన్ షో'లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే పాక్‌కు చెందిన జమియత్ ఉలేమా-ఈ-ఇస్లాం (ఎఫ్) రాజకీయ పార్టీకి తాలిబాన్లు, అల్‌ఖైదా రెండింటితోనూ సంబంధాలున్నాయని.. వారు పాక్‌లోని ఫెడరల్లీ అడ్మినిస్టర్డ్ ట్రైబల్ ఏరియాస్ (ఎఫ్ఏటీఏ) ను స్వాధీనం చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని వెల్లడించారు. ఆడమ్స్ వ్యాఖ్యలను ఎవరూ ధ్రువీకరించనప్పటికీ.. ఆమె నేపథ్యాన్ని బట్టి లేవనెత్తిన అంశాలపై విచారణకు దారితీసే అవకాశం లేకపోలేదు.

బైడెన్ స్థానంలో మిషెల్ ఒబామా?



వాషింగ్టన్, జూన్ 30: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా జో బైడెన్ స్థానంలో మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ ఒబామాను బరిలో నిలుపుతారనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. గురువారం రాత్రి జరిగిన తొలి ప్రెసిడెన్షియల్ డిబేట్‌లో బైడెన్ పలుమార్లు తడబాటుగా మాట్లాడటంతో ఆ పార్టీలో ఆందోళన వ్యక్తమవుతోంది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో బైడెన్ తేలిపోయారనే విమర్శలు వస్తున్నాయి. అధ్యక్ష ఎన్నికల్లో పార్టీ విజయావకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని డెమోక్రాట్లు ఆందోళన చెందుతున్నారు. అధ్యక్ష రేసు నుంచి బైడెన్ తప్పుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మూడు నెలలు ముందు ఆగస్టులో జరిగే డెమోక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఆ పార్టీ అభ్యర్థిగా మిచెల్ ఒబామాను ప్రకటించే అవకాశాలున్నాయని డెమోక్రాట్లు అభిప్రాయపడుతున్నారు. 'తొలి డిబేట్‌లో బైడెన్ ఘోరంగా విఫలమయ్యారు. ఆయన తీరుతో దేశవ్యాప్తంగా డెమోక్రాట్లు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. డెమోక్రాటిక్ అభ్యర్థిగా బైడెన్‌ను తొలగించి మిచెల్ ఒబామాను బరిలో నిలపాలి. ఆగస్టులో జరిగే డెమోక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఈ మార్పు జరుగుతుంది' అని యూఎస్ సెనెటర్ టెడ్ క్రజ్ పేర్కొన్నారు. డెమోక్రాటిక్ అభ్యర్థిగా బైడెన్ ఉండబోరని రిపబ్లికన్ పార్టీకి చెందిన సౌత్ కరోలినా మాజీ గవర్నర్ నిక్కీ హేలీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. డిబేట్‌లో బైడెన్ మాట్లాడిన తీరు చూసినవారంతా షాకయ్యారని వివేక్ రామస్వామి అభిప్రాయపడ్డారు.

తప్పుడు ఆరోపణలు చేసిన భార్యపై కేసు పెట్టుకోవచ్చు

అనుమతి ఇచ్చిన కర్ణాటక హైకోర్టు

బెంగళూరు, జూన్ 30: తనపై తప్పుడు ఆరోపణలు చేసిన భార్యపై అవసరమైతే కేసు పెట్టుకోవచ్చని ఓ భర్తకు కర్ణాటక హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఐపీసీలోని సెక్షన్ 211 ప్రకారం కేసు పెట్టవచ్చని తెలిపింది. భర్త తనను వేధిస్తున్నాడంటూ ఓ మహిళ 2022లో బసవనగుడి పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టింది. ఈ కేసు హైకోర్టు జడ్జి జస్టిస్ నాగప్రసన్న ధర్మాసనం ముందుకు వచ్చింది. ఛార్జిషీటును, ఇతర వాంగ్మూలాలను పరిశీలించిన ఆమె ఈ కేసును కొట్టివేశారు. భార్యవి తప్పుడు ఆరోపణలని తెలిపారు. తప్పుడు ఆరోపణలు చేసినందున అవసరమైతే భర్త ఆమెపై కేసు పెట్టవచ్చన్నారు. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్ ద్వారా పరిచయమైన ఆ జంట 2020 మే 29న వివాహం చేసుకుంది. హెచ్1బీ వీసా నవీకరణ కోసం 2 నెలలకే భర్త 2 అమెరికా వెళ్లిపోయాడు. కొన్ని కారణాల వల్ల మరుసటి ఏడాదే 2021లో విడాకుల కోసం అతడు దరఖాస్తు చేశాడు. కానీ, అతనిపై భార్య వేధింపుల కేసు పెట్టింది.

శ్రీవారి దర్శనాల్లో వైసీపీ నేతల రికార్డ్ 'బ్రేక్'

- నాటి మంత్రులు, ఎమ్మెల్యేల లీలలు
- భారీగా సిఫారసు లేఖలు
- మందీమార్బలంతో రాక
- దర్జాగా స్వామి దర్శనం
- సాధారణ భక్తుల పడిగాపులు



తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గత ప్రభుత్వంలో సామాన్య భక్తులకు ఇబ్బందులు కలిగించేలా రోజుకు పదుల సంఖ్యలో వీఐపీ బ్రేక్ దర్శనాలు పొందిన మంత్రుల అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. వైసీపీ మంత్రులు తమ సిఫారసు లేఖలతో భారీగా వీఐపీ బ్రేక్ దర్శనాలు పొందిన ఉదంతాలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి. దర్శనానికి సామాన్య భక్తులు 30 నుంచి 48 గంటలు క్యూలైన్లలో పడిగాపులు పడుతుంటే.. వీరు మాత్రం ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లు పొంది.. వారిని ఇబ్బందులకు గురిచేశారు. తన సిఫారసులు చాలా తక్కువగా ఉంటాయని చెప్పుకొనే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇచ్చిన ఓ లేఖ ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరి 12న నాలుగు తోమాలసేవ, ఆరు ప్రొటోకాల్ దర్శనాలు, 12 మందికి కల్యాణోత్సవం, 52 మందికి వీఐపీ బ్రేక్ దర్శనాలు చొప్పున 74 మందికి ఆర్జితసేవ, బ్రేక్ దర్శనాలకు ఆయన సిఫారసు చేశారని దాని ద్వారా తేలింది. ఆర్కే రోజా ఏపీఐఐసీ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడు 2021 నవంబరు 30న కనీసం భక్తుల పేర్లు కూడా లేకుండా 20 మందికి బ్రేక్ దర్శనాలు కేటాయించాలని లేఖ రాశారు. వీరి తరహాలోనే జిల్లాకు చెందిన నాటి ఉపముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, నాటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితోపాటు పలువురు మంత్రులు రోజుకు పదుల సంఖ్యలో వీఐపీ బ్రేక్ దర్శనం, ఆర్జిత సేవా టికెట్లు పొంది.. సామాన్య భక్తులు క్యూలైన్‌లో అగచాట్లు పడేలా చేశారనే విమర్శలు ఉన్నాయి. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసులతో ఉదయం 8 గంటలకు మొదలయ్యే వీఐపీ బ్రేక్ మధ్యాహ్నం 1.30 వరకు కూడా కొనసాగిన సందర్భాలున్నాయి. ఫలితంగా సర్వదర్శన భక్తులతో క్యూలైన్లు 2-3 కి.మీ. మేరకు వ్యాపించేవి.

మందీమార్బలంతో..

సిఫారసులతోనే కాకుండా పదవులను అడ్డుపెట్టుకుని వైసీపీ మంత్రులు నెలలో 2-3 సార్లు శ్రీవారి దర్శనానికి వచ్చేవారు. రోజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నారాయణస్వామి, మేరుగ నాగార్జున, కారుమూరి నాగేశ్వరావు, నాటి ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, గోరంట్ల మాధవ్, బెల్లాన చంద్రశేఖర్ వంటి వారు తరచూ మందీమార్బలంతో ప్రత్యక్షమయ్యేవారు. 2022 ఆగస్టులో మంత్రి ఉషశ్రీ చరణ్ ఒకేసారి 50 మందితో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అదే నెల 18న మంత్రి రోజా 30 మందితో వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు. అదేరోజు దాడిశెట్టి రాజా 30 మందితో దర్శించుకున్నారు. అదే ఏడాది జూలైలో సీదిరి అప్పలరాజు ఏకంగా 150 మందితో వీఐపీ బ్రేక్‌లో హల్‌చల్ చేశారు. ఇవన్నీ ఉదాహరణలు మాత్రమే.

ప్రజల మనిషి.. వెంకయ్య!

ప్రజాసేవ పట్ల తిరుగులేని నిబద్ధత గల నాయకుడు.. మాజీ ఉప రాష్ట్రపతిపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యాసం

"వెంకయ్యనాయుడు.. రాజనీతిజ్ఞుడు. ఎలాంటి ఆటుపోట్లనైనా అవలీలగా అధిగమించగల సమర్థుడు" అని ప్రధాని నరేంద్రమోదీ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుణ్ని కొనియాడారు. వెంకయ్యతో తనది దశాబ్దాల అనుబంధమని.. తామిద్దరం కలిసి పనిచేసినప్పుడు ఆయన్నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని మోదీ పేర్కొన్నారు. సోమవారం (జూలై 1) వెంకయ్య నాయుడి పుట్టినరోజు సందర్భంగా.. 'భరతమాత సేవలో వెంకయ్య జీవితం' పేరిట ప్రధాని మోదీ ఒక వ్యాసం రాశారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..



వెంకయ్యనాయుడు పుట్టిన రోజు వేడుకల సందర్భంగా ఆన్‌లైన్ వేదికగా వెంకయ్య జీవితంపై ప్రచురితమైన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, హాజరైన వెంకయ్య దంపతులు, ప్రముఖులు

దేశ మాజీ ఉపరాష్ట్రపతి, రాజనీతిజ్ఞుడు వెంకయ్య నాయుడుకు ఇవాళ్టితో 75 ఏళ్లు పూర్తవుతాయి. ఈ సందర్భంగా ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆ దైవాన్ని ప్రార్థిస్తున్నాను. అలాగే ఆయన శ్రేయోభిలాషులు, అనుయాయులందరికీ నా శుభాకాంక్షలు. అంకితభావం, ఒదిగిపోయే తత్వం, ప్రజాసేవ పట్ల తిరుగులేని నిబద్ధత కలిగిన ఒక నాయకుడిని గౌరవించుకునే తరుణమిది. రాజకీయ రంగ ప్రవేశం నుంచి ఉపరాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు నిర్వర్తించే దాకా సాగిన వెంకయ్యనాయుడు కెరీర్.. భారత రాజకీయాల్లోని సంక్లిష్టతలను హుందాగా, సులువుగా అధిగమించడంలో ఆయనకుగల అరుదైన సామర్థ్యాన్ని మన ముందుంచుతుంది. వెంకయ్యనాయుడి వాగ్ధాటి, చతురత, ప్రగతి సంబంధిత అంశాలపై దృఢ వైఖరి వంటి సుగుణాలు.. పార్టీలకు అతీతంగాఆయనకు ఎనలేని గౌరవం తెచ్చిపెట్టాయి. ఆయన జీవితంలో అప్పటికీ ఇప్పటికీ మారనిది ఒక్కటే. అది.. ప్రజలపై ప్రేమ. ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థి రాజకీయాల్లో విద్యార్థి నాయకుడిగా ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైంది. ఆయన అపూర్వ ప్రతిభ, వాక్పటిమ, నిర్వహణ నైపుణ్యాల కారణంగా.. ఏ రాజకీయ పార్టీ అయినా ఆయనకు స్వాగతం పలకడానికి సిద్ధంగా ఉంటుంది. అయితే 'దేశమే ముందు (నేషన్ ఫస్ట్)' అనే దార్శనికత నుంచి స్ఫూర్తిపొందిన ఆయన సంఘ్ పరివార్‌తో కలిసి పనిచేయడానికి మొగ్గుచూపారు. ఆ విధంగా 'ఆర్‌ఎస్‌ఎస్', 'ఏబీవీపీ'తో ఆయనకు గల అనుబంధం.. తర్వాతి కాలంలో జనసంఘ్, బీజేపీ బలోపేతానికి ఎంతగానో దోహదం చేసింది. దేశంలో దాదాపు 50 ఏళ్ల కిందట ఎమర్జెన్సీ విధించిన వేళ, దాన్ని వ్యతిరేకిస్తూ మొదలైన ఉద్యమంలో.. చురుకైన పాతికేళ్ల యువకుడుగా వెంకయ్య ముందుకు దూకారు. ఆ క్రమంలో.. కేవలం లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్‌ను ఆంధ్రప్రదేశ్‌కి ఆహ్వానించినందుకే ప్రభుత్వం ఆయనను జైల్లో పెట్టింది. 1980ల మధ్యలో.. మహానేత ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అమర్యాదపూర్వకంగా బర్తరఫ్ చేసిన సందర్భంలోనూ ప్రజాస్వామ్య సిద్ధాంత పరిరక్షణ ఉద్యమంలో ఆయన మరోసారి ముందువరుసలో నిలిచారు. వెంకయ్యనాయుడు ఎలాంటి ఆటుపోట్లనైనా అవలీలగా అధిగమించగల సమర్థుడు. ఆంధ్రప్రదేశ్ శాసనసభకు 1978లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అఖండ విజయం కట్టబెట్టినా.. కాంగ్రెస్ జోరును తట్టుకుని యువ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఐదేళ్లకు జరిగిన ఎన్నికల్లో ఎన్టీఆర్ సునామీ రాష్ట్రాన్ని చుట్టబెట్టినపుడు కూడా బీజేపీ ఎమ్మెల్యేగా వెంకయ్యనాయుడు ఎన్నికై, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ (బీజేపీ) ఎదుగుదలకు బాటలు వేశారు.

కేంద్ర మంత్రిగా..

2000 సంవత్సరంలో.. నాటి ప్రధాని వాజపేయి వెంకయ్యను కేంద్ర మంత్రిమండలిలోకి తీసుకునేందుకు ఆసక్తి చూపారు. అప్పుడు వెంకయ్య వెంటనే.. గ్రామీణాభివృద్ధి శాఖ పట్ల తన ఆసక్తి గురించి ఆయనకు తెలియజేశారు. దీంతో అటల్జీ సహా అగ్ర నాయకులందరూ ఆశ్చర్యపోయారు. కానీ ఆ విషయంలో వెంకయ్యనాయుడు చాలా స్పష్టంగా ఉన్నారు. తానొక రైతు బిడ్డనని, తన బాల్యమంతా గ్రామాల్లోనే గడిచింది కాబట్టి మంత్రిగా తాను కోరుకునేది ఏదైనా ఉందంటే అది గ్రామీణాభివృద్ధేనని వివరించారు. ఆ శాఖ మంత్రిగా ఆయన.. 'ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన' వంటి పథకానికి రూపకర్తగా ప్రధాన పాత్ర పోషించారు. కొన్నేళ్ల తర్వాత 2014లో ఎన్డీయే అధికారంలోకి వచ్చినప్పుడు.. ఆ ప్రభుత్వంలో ఆయన పట్టణాభివృద్ధి, గృహనిర్మాణం, పట్టణ పేదరిక నిర్మూలన సంబంధిత కీలకశాఖల బాధ్యతలు నిర్వహించారు. ఆయనహయాంలోనే మేము కీలకమైన 'స్వచ్ఛ భారత్ మిషన్', పట్టణాభివృద్ధి సంబంధిత ప్రధాన పథకాలకు శ్రీకారం చుట్టాం. ఇంత సుదీర్ఘకాలంపాటు గ్రామీణ, పట్టణాభివృద్ధికి కృషి చేసిన ఏకైక నాయకుడు బహుశా ఆయనే కావచ్చు. దాదాపు 15 సంవత్సరాలు గుజరాత్ బాధ్యతలు చూసి.. 2014లో నేను ఢిల్లీకి వచ్చేటప్పటికి.. జాతీయ రాజధానికి నేనొక బయటి వ్యక్తిని మాత్రమే. అటువంటి సమయంలో వెంకయ్య నాయుడి సలహాలు, సూచనలు నాకెంతో ఉపయుక్తమయ్యాయి. ఆయనొక సమర్థుడైన సభా వ్యవహారాల మంత్రి. ఏకాభిప్రాయ సాధన ప్రాముఖ్యమేమిటో చక్కగా తెలిసినవారు.

ఉపరాష్ట్రపతిగా..

2017లో మా (ఎన్డీయే) కూటమి ఆయనను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపాదించింది. అయితే, ఆయనకు గల మహోన్నత స్థానాన్ని భర్తీ చేయడం ఎలాగన్న సందిగ్ధంలో పడ్డాం. అదే సమయంలో.. ఉప రాష్ట్రపతి పదవికి ఆయనను మించిన ఉత్తమ అభ్యర్థి మరొకరు లేరన్న వాస్తవం కూడా మాకు తెలుసు. ఈ నేపథ్యంలో ఎంపీగా, మంత్రిగా తన పదవులకు రాజీనామా చేస్తూ ఆయనిచ్చిన ఉపన్యాసాల్లో ఒక్క అక్షరం కూడా నేను మరువలేను. పార్టీతో తనకు గల అనుబంధాన్ని, దాని ఎదుగుదలకు తాను చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. పార్టీపై ఆయనకుగల లోతైన నిబద్ధత, అనురక్తిని ఆ ఉపన్యాసాలు ప్రతిబింబించాయి. ఆయన ఉప రాష్ట్రపతి అయ్యాక.. ఆ పదవికి మరింత విలువను ఆపాదించే అనేక చర్యలు తీసుకున్నారు. యువ ఎంపీలు, మహిళా ఎంపీలు, తొలిసారి ఎంపీ అయినవారికి మాట్లాడే అవకాశం కల్పించడంలో రాజ్యసభకు అత్యుత్తమ చైర్‌పర్సన్‌గా నిలిచారు. సభకు సభ్యుల హాజరుపై ఆయన ఎక్కువగా దృష్టిసారించారు. సభా సంఘాలను మరింత ప్రభావశీలం చేయడంతోపాటు సభలో చర్చస్థాయిని కూడా పెంచారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి ఆర్టికల్ 370, 35(ఎ)ను రద్దుచేస్తూ రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టినపుడు వెంకయ్యనాయుడే సభాపతిగా ఉన్నారు. అది ఆయనకు ఎంతో ఉద్విగ్నభరిత క్షణమని నా నిశ్చితాభిప్రాయం. ఎందుకంటే.. డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ కలలుగన్న అఖండ భారతంవైపు ఆకర్షితుడైన ఒకనాటి బాలుడు వెంకయ్య.. ఆ స్వప్నం సాకారమయ్యే వేళ సాక్షాత్తూ సభాధ్యక్ష స్థానంలో ఉన్నారు. పని, రాజకీయాలను పక్కన పెడితే.. వెంకయ్యనాయుడు విపరీతమైన పఠనాభిలాషి, రచయిత కూడా. ఉజ్వలమైన తెలుగు సంస్కృతిని దేశరాజధానికి పరిచయం చేసిన నేతగా ఢిల్లీ ప్రజల్లో ఆయనకు విశేషమైన గుర్తింపు ఉంది. ఏటా సంక్రాంతి, ఉగాది పర్వదినాల్లో ఆయన నిర్వహించే కార్యక్రమాలు ఢిల్లీలో చాలామందికి మధుర జ్ఞాపకాలు. ఉపరాష్ట్రపతి పదవీకాలం ముగిసిన తర్వాత కూడా వెంకయ్య ప్రజాజీవితంలో చురుగ్గా ఉంటున్నారు. తనకు ఆసక్తిగల అంశాలు లేదా దేశవ్యాప్తంగా వివిధ పరిణామాలపై ఆయన అప్పుడప్పుడూ ఫోన్ ద్వారా నన్ను వాకబు చేస్తుంటారు. మా ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇటీవలే నేను ఆయనను కలిస్తే.. ఆయన ఎంతో సంతోషంతో నాకు, నా బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఇలాంటి తీపి జ్ఞాపకాలతో 75 ఏళ్ల మైలురాయిని చేరిన వెంకయ్యనాయుడుకు మరోసారి శుభాకాంక్షలు తెలుపుతున్నాను. యువకార్యకర్తలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు, ప్రజాసేవాభిలాషులైన ప్రతి ఒక్కరూ ఆయన జీవితాను భావాల వెలుగులో విలువలను అందిపుచ్చుకోగలరని ఆశిస్తున్నాను. అలాంటి అరుదైన నాయకులే దేశాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతూ ఉత్తేజమిస్తున్నారు.



– నరేంద్ర మోదీ

మాటలే కాదు.. చేతలూ..

వెంకయ్యనాయుడు ప్రసంగం విన్నవారంతా సాధారణంగా ఆయన వాక్పటిమకు పెద్దపీట వేస్తారు. అయితే, ఆయన వాక్చతురుడు మాత్రమే కాదు... కార్యదక్షుడు కూడా! యువ ఎమ్మెల్యేగా శాసనసభకు ప్రాతినిధ్యం వహించి రోజుల నుంచీ సభా వ్యవహారాలను ఔపోసన పట్టిన ఆయనలోని కచ్చితత్వం.. నియోజకవర్గ ప్రజల గళాన్ని సభలో వినిపించడంలో చూపిన అంకితభావం.. వెంకయ్యనాయుడుకు అపార గౌరవాన్ని సముపార్జించిపెట్టాయి. ఆయన ప్రతిభను గుర్తించిన ఎన్టీఆర్ వంటి దిగ్గజనేత.. ఆయన్ను తన పార్టీలో చేర్చుకోవాలని అనుకున్నారు. కానీ, వెంకయ్యనాయుడు తన మౌలిక సిద్ధాంతాన్ని వీడబోనంటూ సున్నితంగా నిరాకరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామగ్రామానా పర్యటించి, అన్ని వర్గాల ప్రజలతో మమేకమవుతూ బీజేపీని రాష్ట్రంలో బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. సభాపక్ష నాయకుడుగా పార్టీని విజయవంతంగా నడిపిస్తూ ఆ తర్వాత బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడయ్యారు. బీజేపీ కేంద్ర నాయకత్వం 1990ల్లో ఆయన కృషిని గుర్తించింది. 1993లో ఆయన్ను పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శిగా నియమించింది. నాటి నుంచీ జాతీయ రాజకీయాల్లో ఆయన ప్రస్థానం ప్రారంభమైంది. యుక్తవయసులో అటల్జీ (అటల్ బిహారీ వాజపేయి), ఆడ్వాణీ వంటి అగ్రనేతల పర్యటనల గురించి ప్రకటించిన ఆయన.. అనంతరం కాలంలో వారితో ప్రత్యక్షంగా కలిసి పనిచేయడం నిజంగా అసాధారణమైన గౌరవం. బీజేపీని అధికారంలోకి తేవడంతోపాటు.. దేశానికి తొలి బీజేపీ ప్రధాన మంత్రి నాయకత్వం వహించేలా చేయడంపై ప్రధానకార్యదర్శి హోదాలో ఆయన నిశితంగా దృష్టిసారించారు. ఈ క్రమంలో, ఢిల్లీకి వెళ్లిన తర్వాత.. ఆయన ఏనాడూ వెనుదిరిగి చూసుకునే అవసరం లేకుండా ఎదిగి ఏకంగా పార్టీ జాతీయ అధ్యక్షుడయ్యారు.

వెంకయ్య వాక్పటిమ.. సాటిలేనిది

- మాజీ ఉప రాష్ట్రపతి జన్మదిన వేడుకల సందర్భంగా ఆన్‌లైన్ ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంస
- వెంకయ్యనాయుడిపై 3 పుస్తకాల ఆవిష్కరణ
- రాజీనామా చేశాకే పార్టీలు మారాలి: వెంకయ్య



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న వెంకయ్యనాయుడు

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "ముప్పవరపు వెంకయ్య నాయుడు వాక్పటిమ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన వాగ్ధాటి ముందు ఎవరూ నిలవలేరు. రాజ్యసభ ఛైర్మన్‌గా.. సభలో తలెత్తిన ఎన్నో వివాదాలను అత్యంత హుందాగా పరిష్కరించిన ఘనత ఆయన సొంతం. ఆర్టికల్ 370 రద్దు ప్రతిపాదనను ముందుగా రాజ్యసభలో ఉంచాం. ఆ సమయంలో ఎన్డీఏకి అక్కడ సంఖ్యా బలం తక్కువుంది. అయినా, అది కేవలం వెంకయ్యనాయుడు అనుభవం, చొరవ వల్లే ఆమోదం పొందింది. ఆయన సేవలను దేశం ఎన్నటికి మరవదు" అని ప్రధాని నరేంద్ర మోదీ శ్లాఘించారు. "వాజ్‌పేయీ ప్రభుత్వంలో ఆయనకు మరింత కీలక పదవిని చేపట్టే అవకాశం ఉన్నా, గ్రామీణాభివృద్ధి శాఖను ఎంచుకొని పల్లెసీమల ప్రగతి కోసం కృషి చేశారు. మా క్యాబినెట్‌లో పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా వెంకయ్య ఆధునిక నగరాల ఏర్పాటుకు మార్గనిర్దేశం చేశారు. స్వచ్ఛభారత్, అమృత్‌యోజన వంటి ఎన్నో పథకాలను సమర్థంగా అమలుచేశారు" అని కొనియాడారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పుట్టిన రోజు వేడుకలు ఆదివారం గచ్చిబౌలిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాలతో సీనియర్ జర్నలిస్టు నగేష్‌కుమార్ రాసిన 'వెంకయ్యనాయుడు - ఎ లైఫ్ ఇన్ సర్వీస్'(ఇంగ్లిష్), ఉపరాష్ట్రపతి మాజీ కార్యదర్శి ఐవీ సుబ్బారావు రచించిన 'సెలబ్రేటింగ్ భారత్'(ఇంగ్లిష్), సంజయ్‌కిషోర్ సంకలనం చేసిన 'మహానేత - జీవన చిత్రమాలిక'(తెలుగు) పుస్తకాలను ప్రధాని మోదీ ఆన్‌లైన్ ద్వారా ఆవిష్కరించారు. ఈ పుస్తకాలు ప్రజలకు ప్రేరణగా నిలుస్తాయన్నారు. సమాజంలో ఏదైనా చెడు ఘటన తలెత్తితే, అందరికన్నా ఎక్కువగా వెంకయ్య బాధపడతారు. పైకి గంభీరంగా కనిపించినా ఆయన సున్నితమనస్కుడు అంటూ అభివర్ణించారు. వెంకయ్యనాయుడు లాంటి నాయకుల సుదీర్ఘ సేవ వల్లే బీజేపీ ఇవాళ ఈ స్థాయిలో ఉందని పేర్కొన్నారు. మారుమూల గ్రామంలో ఓ సాధారణరైతు కుటుంబంలో పుట్టి, ఉప రాష్ట్రపతి స్థాయి వరకూ వెంకయ్యనాయుడు ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన జీవితం యువతకు మార్గదర్శకం అంటూ వెంకయ్య వ్యక్తిత్వం - ఔన్నత్యం గురించి 20నివిషాలకుపైగా ప్రధాని ప్రసంగించారు. ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన వెంకయ్య.. మోదీ ప్రభుత్వ విధానాలను కొనియాడారు. కాగా.. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్, ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఏపీ మంత్రి సత్య కుమార్, ఎంపీ భరత్, ఏపీ ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, రఘురామకృష్ణం రాజు, సుజనా చౌదరి, మాజీ మంత్రి మల్లారెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్త గ్రంధి మల్లికార్జునరావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, మాజీ ఐఏఎస్‌లు నిమ్మగడ్డ రమేశ్, కె.లక్ష్మీనారాయణ, డీఆర్డీవో సతీశ్ రెడ్డి, మాజీ డీజీపీలు ఆర్పీ ఠాకూర్, దినేశ్ రెడ్డి, సినీ ప్రముఖులు మురళీమోహన్, కీరవాణి, సాయికుమార్, రైతు నేస్తం వెంకటేశ్వరరావు, నందమూరి రామకృష్ణ తదితర ప్రముఖులు హాజరయ్యారు.

హుందాగా ప్రవర్తించాలి..

ప్రజలకు సేవ చేయాలని పరితపించేవారంతా రాజకీయాల్లోకి రావాలని.. సిద్ధాంతపరమైన రాజకీయాలను ప్రోత్సహించాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. చట్టసభలకు ఎన్నికైనవారు హుందాగా ప్రవర్తించాలని.. మానవీయ విలువలను పాటిస్తూ, మాతృభాషను ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. 'ఒక పార్టీ సిద్ధాంతాలు నచ్చకపోతే, మరొక పార్టీలోకి వెళ్లొచ్చు. కాకపోతే అంతకు ముందు.. ఆ పార్టీ ద్వారా వచ్చిన పదవికి రాజీనామా చేశాకే మారాలి' అని అన్నారు. ఇది కేవలం ఒక పార్టీనో, ఒక వ్యక్తినో ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్య కాదని వివరణ ఇచ్చారు. ఆచార్య ఎన్జీ రంగా స్ఫూర్తితో రాజకీయ ప్రవర్తనా నియమావళి రూపొందించడంతో పాటు రాజకీయ పాఠశాలలు నెలకొల్పాల్సిన అవసరం ఉందని పార్టీలకు సూచించారు. ఎన్నికల్లో కుల, ధన ప్రభావం తగ్గాలని.. నాయకుల గుణాన్ని చూసి ఎన్నుకోవడం ద్వారానే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని అభిలషించారు. తన వద్ద సుదీర్ఘ కాలం వ్యక్తిగత కార్యదర్శిగా సేవలందించిన ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ ఏపీలో మంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఆనందం కలిగించిందన్నారు.



భర్త పెళ్లికి ఇద్దరు భార్యల పేరిట రూపొందించిన ఫ్లెక్సీ

మా ఆయనకు మళ్లీ పెళ్లి!

- భర్తకు మూడో వివాహం చేసిన ఇద్దరు భార్యలు

పాడేరు/ జి.మాడుగుల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భర్త రెండో పెళ్లి చేసుకుంటేనే మొదటి భార్య క్షణం ఆలోచించకుండా కేసు పెట్టేసే ఈ రోజుల్లో.. ఇప్పటికే ఇద్దరిని వివాహం చేసుకున్న వ్యక్తికి అతడి భార్యలే మూడో వివాహం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గుల్లెలు పంచాయతీ కించూరు గ్రామంలో జూన్ 25న ఈ పెళ్లి జరిగింది. మారుమూల ప్రాంతం కావడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కించూరుకు చెందిన సాగెని పండన్నకు పార్వతమ్మతో మొదటి వివాహం జరిగింది. ఆమెకు పిల్లలు పుట్టకపోవడంతో కొన్నాళ్లకు అప్పలమ్మ అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఈమెకు ఓ కుమారుడు కలిగాడు. అయినా పండన్న జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ బందవీధి గ్రామానికి చెందిన లక్ష్మి అలియాస్ లావ్యపై మనసుపడ్డాడు. ఈ విషయాన్ని ఇద్దరు భార్యలతో చెప్పి ఆమెను మూడో వివాహం చేసుకునేందుకు ఒప్పించాడు. దీంతో ఇద్దరు భార్యలు.. భర్త మూడో వివాహానికి ఏర్పాట్లు చేశారు. పెళ్లి ఆహ్వాన పత్రికలు ముద్రించి పంచిపెట్టారు. జూన్ 25న ఘనంగా వివాహం జరిపించి, విందు ఏర్పాటు చేశారు.

ఇన్‌చార్జ్‌ల పాలనలో ఆర్ అండ్ బీ

- ఏఈఈ నుంచి సీఈ వరకు విభాగంలో ఇదే పరిస్థితి
- ఏళ్లుగా పెండింగ్‌లో సర్వీస్ రూల్స్, సీనియారిటీ జాబితా
- రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణపై ప్రభావం

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ఇన్‌చార్జ్‌ల పాలనలో నడుస్తోంది. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏఈఈ) స్థాయి నుంచి చీఫ్ ఇంజనీర్(సీఈ), ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఈఎన్సీ) స్థాయి పోస్టుల వరకు అంతా ఇదే పరిస్థితి నెలకొంది. శాఖలో సీనియారిటీ ప్రకారం పదోన్నతులు లేక ఏళ్లు గడుస్తున్నాయి. కొన్నేళ్లుగా సర్వీస్ రూల్స్ అంశం పెండింగ్‌లో ఉండటం, ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన సీనియారిటీ జాబితా రాకపోవడమే దీనికి కారణంగా కనబడుతోంది. మరోవైపు శాఖలో రిటైర్మెంట్ల పర్వం మొదలైంది. రిటైర్ అయిన వారి స్థానంలో కొత్త వారు వస్తుండగా, కింది స్థాయిలో ఖాళీ అయిన పోస్టులు మాత్రం భర్తీ కావడంలేదు. దీంతో రహదారుల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలపై పర్యవేక్షణ కొరవడుతోంది. ఇదిలా ఉండగా ఆర్ అండ్ బీ శాఖలోని ఏఈఈ పోస్టులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష నిర్వహించి, అభ్యర్థులను ఎంపిక చేసింది. కానీ ఇప్పటి వరకు వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. శాఖలో జరుగుతున్న పదవీ విరమణలు, క్షేత్రస్థాయిలో ఖాళీ అవుతున్న పోస్టులతో పాటు పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో ఏర్పడిన కొత్త పోస్టులన్నీ కలిపి వివిధ స్థాయిల్లో దాదాపు 200 వరకు ఖాళీలు ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం రాష్ట్రంలో 4వేల కి.మీ.కు పైగా రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉందని అధికారులు గుర్తించారు. ఈ పనులు చేపట్టాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది అవసరం.

సర్వీస్ రూల్స్ కోసం నిరీక్షణ..

శాఖలో సీనియారిటీ జాబితా లేకపోవడం, సర్వీస్ రూల్స్ ఫైలు కదలకపోవడంతో.. రెండింటి నడుమ ఉద్యోగులు నలిగిపోతున్నారు. శాఖలో భర్తీ చేయాల్సిన పలు పోస్టుల వ్యవహారం కూడా సీనియారిటీ, సర్వీస్ రూల్స్ అంశానికే ముడిపడి ఉంది. ఈ రెండు తేలితేనే.. ఎంత మందికి పదోన్నతులు లభిస్తాయి..? ఎన్ని పోస్టులు కొత్తగా భర్తీ చేయాల్సి ఉంటుంది..? అన్నది స్పష్టమవుతుంది. నిజానికి రోడ్లు, భవనాల శాఖలో దశాబ్దాల నుంచి సీనియారిటీ జాబితా లేకపోవడంతో ఉమ్మడి రాష్ట్రం నుంచీ సీనియర్, జూనియర్ విషయాల్లో వివాదాలు నడిచినట్టు తెలుస్తోంది. ఉమ్మడి ఏపీ హయాంలో 2011లో శివారెడ్డి కమిటీ రూపొందించిన సీనియారిటీ జాబితాను పలు కారణాలతో 2013లో హైకోర్టు కొట్టివేసింది. ఆ తర్వాత 2014లో రాష్ట్రం విడిపోయింది. అయితే 2014 వరకు ఉన్న ఉద్యోగుల పోస్టింగ్‌లు, సీనియర్, జూనియర్ అంశాలన్నిటినీ ఏపీ తేల్చితేనే.. తెలంగాణకు కేటాయించిన అధికారుల్లో సీనియర్, జూనియర్ ఎవరనేది తేలడంతో పాటు ఆమేరకు పదోన్నతులు దక్కనున్నాయి. రాష్ట్రం విడిపోయి పదేళ్లవుతున్నా.. ఏపీ సీనియారిటీ లిస్టును పూర్తి చేసి పంపకపోవడంతో ప్రస్తుతం శాఖ ఉద్యోగులంతా ఇన్‌చార్జ్‌లుగానే కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. చాలా ఏళ్ల నుంచి శాఖలో సీనియారిటీ లిస్ట్ లేకపోవడంతో.. పదోన్నతులు ఇవ్వాల్సి వచ్చినపుడు తాత్కాలిక జాబితాను సిద్ధం చేసి.. ప్రమోషన్లు కల్పించినట్టు తెలుస్తోంది. ఇప్పటికీ ఒక శాశ్వత సీనియారిటీ జాబితా మాత్రం రూపుదాల్చలేదు. మరోవైపు ఉద్యోగుల పదోన్నతులు, పోస్టింగ్‌ల విషయంలో 2018 నుంచి కొత్త సర్వీస్ రూల్స్ పాటించాలని గత సర్కారు నిర్ణయించింది. ఈ నేపథ్యంలో సర్వీస్ రూల్స్‌ను రూపొందించినా.. గత సీఎం పేషీలోనే పెండింగ్‌లో ఉండిపోయాయి. సర్వీస్ రూల్స్ విషయాన్ని పరిష్కరించడంతో పాటు, ఏపీ నుంచి రావాల్సిన సీనియారిటీ లిస్ట్‌పై దృష్టి సారించి తమ సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్, ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఉద్యోగులు కోరుతున్నారు. సర్వీస్ రూల్స్ ఫైలుపై సీఎం సంతకం చేస్తే దాదాపు 300-400 మంది ఉద్యోగులకు పదోన్నతులు వస్తాయని అంటున్నారు. కాగా, శాఖలో ఇప్పటికే వివిధ స్థాయిల్లో 19మంది పదవీ విరమణ పొందగా, త్వరలో మరో 19మంది రిటైర్ కానున్నారు. పదవీ విరమణ పొందిన వారి స్థానంలో బాధ్యతలు తీసుకుంటున్న వారు కూడా ఇన్‌చార్జ్‌లుగానే వస్తుండటం గమనార్హం.

వివిధ

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

చొక్కా పాతబడుతోంది



అప్పటికీ
మెలకువతోనే వున్నాను
కొన్నిచోట్ల వెన్నెముకను మడత పెట్టుకుని
కొన్నిచోట్ల తలను నేలలో పాతుకుని
చొక్కా చిరిగిపోకుండా కాపాడుకుంటూనే వున్నాను

కాలర్ దగ్గర పడ్డ మరకలు చెరిగేలా లేవు
పదేపదే జీవితంతో గొడవపడుతున్నానేమో
గుర్రాన్ని లొంగదీసుకున్నట్టు
కుక్కపిల్లను వెంట తిప్పుకున్నట్టు
పొయ్యిలో కాల్చి ఇనుపముక్కను ఇష్టానికి సర్దుకున్నట్టు
చొక్కాను సర్దుకోవడం నా వల్ల కావడం లేదు

అర్ధరాత్రి ఒంటరిగా చిక్కినప్పుడు
పది పది తలల నా చీకటి రూపం
చొక్కాను బద్దలుకొట్టుకునివచ్చి భయపెడుతోంది

ఇస్త్రీ చేసిన మడతల దగ్గర
దారాలు దారాలుగా తెగిపోతున్నాను
ఉడుకుడుకు గంజిలో నానబెట్టి ఎంతలా ఉతుక్కున్నా
చంకల లోతుల్లో దొరికిపోతున్నాను

బటన్ల దగ్గర దారం చిట్లిన చొక్కా
శరీరాన్ని దాచలేకపోతోంది
ఒకానొక కీలకఘట్టాన్ని చేరుకున్న సంకేతస్పర్శ
శీతాకాలపు మంచులా లోపలికి జొరబడుతోంది
ఉన్నదున్నట్టు
ప్రపంచం ముందు బయట పడిపోతున్నాను

నా చొక్కాకు ఏదో అయ్యింది
నటన మీద ఆకర్షణ మీద దృష్టి తగ్గినట్టుంది
పోనీ ఒకసారి
చొక్కా లేకుండా వేదిక మీదకు వెళ్ళిపోనా?
ఎపుడోసారికి నగ్నంగా మెరిసి మాయమయ్యే
మట్టిపాత్రలమేగా అందరం.

రాధ
83672 82012

విరసం ఆవిర్భావ సభ

విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ సభ జూలై 4 ఉ.10గం.ల నుంచి సా.6గం.ల వరకు హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. 'వికసిత భారత్ @ హిందూ రాష్ట్ర' అంశంపై ప్రసంగాలు ఉంటాయి. హెత్మామ్, వరలక్ష్మి, పాణి, రివేరా, అరసవిల్లి కృష్ణ, శివరాత్రి సుధాకర్, రాంకీ, రాము, సాగర్ మాట్లాడతారు.

రివేరా

'పండుటాకు' కథా సంపుటి

కాట్రగడ్డ దయానంద్ కథా సంపుటి 'పండుటాకు - గుండ్లకమ్మ తీరాన' ఆవిష్కరణ సభ జూలై 4 సా.6.30గం.లకు అన్నమయ్య కళావేదిక, శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, బృందావన గార్డెన్స్, గుంటూరులో జరుగుతుంది. ఆవిష్కర్త పాపినేని శివశంకర్, అధ్యక్షత కందిమళ్ళ శివప్రసాద్. సభలో డి.ఎస్.వి.ఆర్. మూర్తి, వాసిరెడ్డి నవీన్, వి. ప్రతిమ పాల్గొంటారు.

మోదుగుల రవికృష్ణ

'సముద్ర నానీలు'

కిన్నెర ఆర్ట్ థియేటర్స్ నిర్వహణలో కొక్కుల శివకృష్ణ 'సముద్ర నానీలు' పుస్తకావిష్కరణ జూలై 7 ఉ.10గం.లకు రవీంద్రభారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త ఎన్. గోపి; అధ్యక్షత సూర్యా ధనంజయ; విశిష్ట అతిథులు పోరెడ్డి రంగయ్య, కుడికాల వంశీధర్; గౌరవ అతిథులు సుంకరి కృష్ణ ప్రసాద్, చిత్తలూరి సత్యనారాయణ.

మద్దాళి రఘురాం

“రోజుకు పద్దెనిమిది గంటలు రాసేవాడిని”

పి. చంద్రశేఖర అజాద్

బాల సాహిత్యం రాయగలగటానికి మీ చుట్టూ పిల్లల బాల్యం, మీ బాల్యం ప్రభావం ఎంత?



నేను బాల సాహిత్యం రాయటానికి ప్రధానమైన సోర్స్ అప్పటి నుండి ఇప్పటి వరకు పిల్లలే. వారిని నిశితంగా గమనిస్తుంటాను. వారి మాటలు, అల్లర్లు, కోరికలు, కోపతాపాలు ఇవన్నీ దగ్గరగా చూస్తుంటాను. అవే అనేక కథలూ, నవలలుగా రూపొందాయి. పెద్దల కోసం రాసినవయినా, 'మంచుమైదానం', 'బాబూ ఓ బాబూ', 'మా తాత-గీత-మాప్రయాణం' ఇంకెన్నో నవలల్లో పిల్లలు ప్రధానపాత్రధారులు. నా మనవరాలు సాన్వి అజాద్ నాకు అయిదారు నవలలకు ప్రేరణ అయింది. నా పిల్లలు, వారితో స్నేహం చేసినవారు... ఇలా అనేకమంది. వారి భావాలు వింటున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. వారిని చిత్రించే ప్రయత్నం చేశాను.

ఇంక నా బాల్యం, నా కష్టాలు, కన్నీళ్లు నా ఆస్తి. మాది పెద్ద మైదానం. అక్కడ గట్టు మీద మూడు చింత చెట్లు- మా మైదానంలో అన్ని కులాలు, మతాల, వర్గాల ప్రజలు వున్నారు. ఓ రకంగా ఆర్.కె. నారాయణ్ 'మాల్గుడి డేస్' లాంటి జీవితం దగ్గరగా మా రేపల్లెలో చూశాను. నాన్న నా ఏడు సంవత్సరాల వయసులో చనిపోయారు. అప్పుడు మృత్యువు అంటే తెలియదు. నాన్నను ప్రకృతిలో వెతుక్కున్నాను. క్రీస్తులా పునరుత్థానం చెందుతాడని నమ్మకం. ఇదంతా 'మనోప్రస్థానం' నవలలో వుంటుంది. అలా మా మైదానంలో ఇప్పటి వరకు తవ్వుకుంది స్వల్పమే. ఇంకెన్నో అనుభవాలు వున్నాయి. నా జీవితం నాన్న కమ్యూనిస్టు నేపథ్యంలో నన్ను తీవ్రవాదంలోకి నెట్టలేదు. సమన్వయాన్ని నేర్పాయి. నాకు కాస్త గౌరవాన్ని ఇచ్చింది బాల్యం-పిల్లలు. అలాగే మా అమ్మ విజయలక్ష్మి లక్ష్మణరావు. నాతో పాటు రక్తం పంచుకు పుట్టిన సోదరులు-అక్కలూ, వీరందరి తర్వాత నా భార్య జానకి, నా పిల్లలు, మనవడూ, మనవరాళ్లు, స్నేహితులు, గురువులు వాళ్లందరూ లేకపోతే నేను ఏమైపోయేవాడినో తెలియదు.

మీరు చదివిన బాలసాహిత్య రచనల్లో మిమ్మల్ని ప్రభావితం చేసినవేమిటి?

చిన్నతనంలో 'చందమామ', 'బాలమిత్ర' లాంటి పత్రికలు అందుబాటులో వుండేవి. అలాగే ఆంధ్రపత్రికలో 'రామచరిత మానస్' అని సీరియల్‌గా వస్తుండేది. నెల రోజులు, వారం రోజులు ఎదురు చూసేవాళ్లం. మా రేపల్లె గ్రంథాలయానికి వెళ్లాక అక్కడ పిల్లల నవలలు దొరికాయి. ఎవరు రాశారో తెలియదు. రచయితల పేర్లు చూసేవాడ్ని కాదు. అందులో అద్భుత ప్రపంచమే ప్రధానం. అప్పట్లోనే కథలు రాయాలనిపించింది. పత్రికలకు ఎలా పంపాలో తెలియదు. పది సంవత్సరాల వయసులో కొన్ని రచనలు చేసినా అవన్నీ పోయాయి. తర్వాత కాలంలో సోవియట్ రచనలు. అవి పిల్లలవి కావచ్చు, పెద్దవారి కోసం కావచ్చు. తక్కువ ధరలో దొరికేవి. అవి చదవటం వలన నాకు సరళత్వం వచ్చింది. అలాగే సౌందర్య దృష్టి వచ్చింది. ఆ రచనలు ఎంత హాయిగా వుంటాయో- పోప్లార్ చెట్లు, తొలి ఉపాధ్యాయుడు, జమీల్యా లాంటివి. తర్వాత 'పిల్లలకే నా హృదయం అంకితం' లాంటి పుస్తకాలు. రవీంద్రుడి నుండి నాకు అందుబాటులోకి వచ్చిన వివిధ దేశాల మహా రచయితలు పిల్లల కోసం రచించిన సాహిత్యం. అలాగే రైలుబడి లాంటి పుస్తకాలు. ఇవన్నీ నా జీవితాన్ని మలుపు తిప్పాయి.

> **నేను బాల సాహిత్యం రాయటానికి ప్రధానమైన సోర్స్ పిల్లలే. వారి మాటలు, అల్లర్లు, కోరికలు, కోపతాపాలు ఇవన్నీ దగ్గరగా చూస్తుంటాను. అవే అనేక కథలూ, నవలలుగా రూపొందాయి. నా మనవరాలు సాన్వి అజాద్ నాకు అయిదారు నవలలకు ప్రేరణ అయింది. నా పిల్లలు, వారితో స్నేహం చేసినవారు... ఇలా అనేకమంది. వారి భావాలు వింటున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. వారిని చిత్రించే ప్రయత్నం చేశాను.**



మీరు వందకు పైగానే పుస్తకాలు రాశారు. ఇంత విరివిగా రాయటానికి రచయితకి ఎలాంటి శిక్షణ, క్రమశిక్షణ అవసరం?

నేను మన మహా రచయితల, రచయిత్రుల పుస్తకాలు చాలా కాలం చదవలేదు. దానికి కారణం నాకు అందుబాటులో లేకపోవటం. పందొమ్మిది సంవత్సరాల లోపు పెళ్లి అయింది. ఇద్దరు పిల్లలు. ఉద్యోగం లేదు. ఆస్తులు అమ్మి ఉద్యమాల్లో పాల్గొని, ఆరు సంవత్సరాలు జైలు జీవితం గడిపి, పార్టీ చీలక ముందు మా తండ్రి చనిపోయారు. అయిదుగురు పిల్లలం. కేవలం డెబ్బై అయిదు రూపాయలతో మా అమ్మ మమ్మల్ని పెంచింది. నాలుగు ముక్కలు కార్డులో రాయటానికి మా అమ్మ గంట తీసుకునేది. తను చదువుకుంది మూడో తరగతి. అందుకోసం నేను రాసే ప్రతి వాక్యం వెనుక మా అమ్మ వుంది. రోడ్డు మీద నిలబడిన నన్ను పెళ్లి చేసుకున్న నా భార్య జానకి వుంది. నేను అనేక రకాల ఉద్యోగాలు చేశాను. 1983 నుండి నా రచనలు వెలుగు చూడటం మొదలు పెట్టాయి. అక్కడ నుండి వెనక్కి తిరిగి చూసుకోలేదు. నవలను రెండు మూడు రోజుల్లో రాశాను. ఓ పని మొదలు పెడితే అది పూర్తి అయ్యేదాకా అశాంతి. టివీకి రాసినా సాహిత్యాన్ని వదలలేదు. రోజుకు పద్దెనిమిది గంటలు రాసేవాడిని.

మనం ఎంత కష్టపడ్డాం అనేది పాఠకులకు అనవసరం. మనం ఏ రంగాన్ని ప్రేమిస్తే ఆ రంగంలో మన ముద్ర వేయాలంటే వ్యక్తిగత ఆనందాల్ని పక్కన పెట్టాలి. నా ఆరోగ్యం దెబ్బతింది. అయినా నాకు దిగులు లేదు. అలాగే ఎప్పటికప్పుడు ప్రక్రియలు మార్చాలి. అప్పుడు ఫ్రెష్‌గా వుంటాం. మళ్లీ అక్కడ నేర్చుకుంటాం. ఆ రకంగా అన్ని ప్రక్రియల్లోనూ రచనలు చేశాను, చేస్తున్నాను. ఇంకా ఓపిక వుంది. అందుకే క్రమశిక్షణ అనేది ఎవరికి వారు పాటించాల్సింది. శిక్షణ అవసరమే. అప్పట్లో మాకు బతుకు సమస్య. పడుతూ లేస్తూ ముందుకు నడిచాను. పుస్తకాలు, సంభాషణలు, ప్రజలు వీరందరూ ఎవరికయినా అదృశ్య గురువులు. ప్రత్యక్షంగా కూడా. నాకు ఆంగ్లం రాదు. అది వచ్చి వుంటే బాగుంటుంది కదా అనిపిస్తుంది.

ముందుగా నన్ను ఆదరించిన పత్రికలకు, సంపాదకులకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి. అప్పట్లో రచయితగా గుర్తింపు పొందటానికి అవకాశాలు తక్కువ. కమర్షియల్ సాహిత్యం, మహిళా రచయిత్రుల కాలం అది. స్పేస్ లేదు. అప్పుడు ఖాళీగా బాలసాహిత్యం కనిపించింది. అప్పట్లో ఈ అవార్డులు లేవు. పిల్లల నవలలను ఆదరించి వుంటే మరో పది నవలలు రాసి వుండేవాడిని కదా అనిపిస్తుంది.

నేను ఏ సంస్థల్లోనూ సభ్యుడ్ని కాదు. అందుకు కారణం ఆ నియమాలకు తగ్గట్లు పనిచేసే అవకాశాలు లేకపోవటం. అలాంటి సంస్థల్లో కొన్ని పరిమితులు వుంటాయి. అందుకే స్వేచ్ఛగా, విస్తృతంగా రచనలు చేశాను. ప్రజలకు వ్యతిరేకంగా రచనలు వుండకుండా జాగ్రత్త పడుతుంటాను.

బాల సాహిత్య రచన చేసేటప్పుడు మీ తక్కిన రచన భాషశైలులు నుంచి ఏ విధంగా భిన్నంగా రాస్తారు?

బాలల కోసం రచన అనుకున్నప్పుడు ప్రధానంగా పది సంవత్సరాలు పైబడిన పిల్లల్ని దృష్టిలో వుంచుకుంటాను. సాధ్యమైనంత సరళంగా భాష వుండేలా జాగ్రత్తపడతాను. 'అందమైన పూలతోట' నవల రాసేటప్పుడు మా పిల్లల్ని పక్కన కూర్చోపెట్టుకుని స్థూలంగా కథ చెప్పి ఇప్పుడు మీరయితే ఏం చేస్తారు అని అడిగాను. వారు చెప్పిన సమాధానాలు విన్నాక నవల మొదలయింది. ఇది అప్పట్లో బాలజ్యోతి పత్రికలో మొదటి బహుమతి పొందిన నవల. అప్పటికీ, ఇప్పటికీ అది ప్రయోగాత్మక రచన. మరో ప్రయోగం 'మా హృదయం'. ఇది కూడా ఎనిమిది నుండి పన్నెండు సంవత్సరాలలోపు పిల్లల దృష్టి కోణం నుండి రాసింది. స్వాతి మాసపత్రికలో చివరి సీరియల్. అమ్మ నుండి మొదలై నాన్నతో ఇది ముగుస్తుంది. దాదాపు 48 అంశాలు. ముందు మా పిల్లలు సృజన్, స్పందన్‌లతో రెండు అంశాల మీద రాయించాను. ఆ భాషను అర్థం చేసుకున్నాను. నేను కూడా ఒకప్పటి పిల్లవాడిని కాబట్టి చిన్నప్పటి నా ఆలోచనలు, అనుభూతులు జోడించాను. అది కూడా బాల సాహిత్యంలో ప్రయోగాత్మక రచనగా నిలిచింది. ఇవన్నీ నాలుగు దశాబ్దాల క్రితం రచనలు.

పిల్లలు ఫ్యాంటసీని ఇష్టపడతారు. వాటితోపాటు నేను ఆధునిక పిల్లల జీవితాల గురించి రాశాను. 'జమీందారు కోట', 'దేవతా ఓ దేవతా', 'ఆట', 'పిల్లల పుస్తకం', 'దారితప్పిన పిల్లవాడు', 'మాయాలోకం' ఇలాంటివే. నా ప్రతి నవలలోనూ అణగారిన వర్గాల పిల్లల పాత్రలు వుంటాయి.

> **2024 కేంద్ర సాహిత్య అకాడమీ - బాల సాహిత్య పురస్కారానికి పి. చంద్ర శేఖర అజాద్ నవల 'మాయాలోకం', కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి రమేశ్ కార్తీక్ నాయక్ కథా సంపుటి 'ఢావ్లో - గోర్ బంజారా కథలు' ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా అవార్డులు పొందిన ఇద్దరినీ వివిధ ఇంటర్వ్యూ చేసింది.**



“రాసిన దాని కంటే, నేను ఎవరు అనేదే గ్లోరిఫై అవుతున్నది!”

రమేశ్ కార్తీక్ నాయక్

మీ 'ఢావ్లో' కథా సంపుటిలో గోర్ బంజారాల జీవితాన్ని చిత్రించేందుకు తెలుగు భాషను వాడాల్సి వచ్చినప్పుడు ఎలాంటి సవాళ్ళు ఎదుర్కొన్నారు? మీకంటే ముందు ఈ వర్గం రిప్రజెంటేషన్ ఈ భాషలో అతితక్కువ ఉండటం వల్ల కథలు రాయటంలో ఇబ్బందులేమైనా ఎదురయ్యాయా?

కథలు రాయడం మొదలు పెట్టినప్పుడు, మొదటి రెండు కథలు తెలుగు లోనే రాసాను. ఆ కథలను తోట అపర్ణ గారికి చూపిస్తే, 'ఇవి తెలుగు కథలా! బంజారా కథలా!' అని అడిగారు. అవి మావాళ్ళ కథలని చెప్పాను. 'మరి మీవాళ్ళు తెలుగు భాష అంత స్పష్టంగా మాట్లాడుతారా' అని ప్రశ్నించారు. అప్పుడు మా వాళ్ల మాట్లాడే తెలుగును కథలోని పాత్రలకు అనుగుణంగా వాడాలని నిశ్చయించుకున్నాను. అలా నిజామాబాద్‌లో బంజారాలు మాట్లాడే భాషని కథలో వాడుతూ వచ్చాను. బంజారా పదాలను పరిచయం చేయాలనుకుని కథల్లో చొప్పించిన కొన్ని పదాలను తర్వాత వద్దని తీసేస్తే, ఆచార్య సూర్యాధనంజయ్ గారు, ఉంచిన వాటికి కింద ఫుట్ నోట్ ఇస్తే బాగుంటుంద న్నారు. నేనేమో పూర్తిగా ఆంధ్ర తెలుగుకి అలవాటు పడిపోయాను, చుట్టూ ఉన్నవాళ్లు మాట్లాడేది కూడా అలాగే ఉండడంతో, ఒకరకంగా తెలుగంటే అదే అనేంత అలవాటు పడిపోయాను. తెలంగాణ జిల్లాల్లోని తండాల్లో మా వాళ్ళు మాట్లాడే భాష ప్రత్యేకంగా ఉంటుంది. కానీ అదే భాషని రాద్దాం అనుకున్నప్పుడు, నాకు తెలియకుండానే భాష షిఫ్ట్ అయిపోయేది.



సవాళ్ళు ఎదుర్కొన్నానని అనను కానీ, ఎడ్యుకేట్ అయ్యానని అనుకుంటున్నాను. రిప్రెజెంటేషన్ తక్కువ ఉండడం వల్ల ఇబ్బందేమీ కాలేదు. ఎందుకంటే ఆల్రెడీ ఒక వేళ ఉండి ఉంటే పాఠకులలో ఓ అభిప్రాయం ఏర్పడిపోయి ఉండేది. అప్పుడు కొత్తగా వస్తున్న సాహిత్యాన్ని వారు అక్కున చేర్చుకున్నా, బంజారాల మీద వారికి ముందు నుండి ఉన్న అభిప్రాయం మారుతుందా అన్నది కచ్చితంగా చెప్పలేము. అలాగని నాకంటే ముందు రాయబడిన సాహిత్యం మా జీవితం కాదని అనను. అలాగని నేను రాస్తున్నది పూర్తిగా బంజారా జీవితమనీ అనను. సగం మాత్రమే బంజారా, విగిలింది తెలుగు జీవితమే. వీలైనంత వరకు సంపూర్ణ బంజారా జీవితాన్ని అక్షరీకరించాలన్నదే నా ఆరాటం.

సాహిత్యం వైపు మీ తొలి అడుగుల గురించి చెప్పండి?

2009-10లో తెలంగాణ ఉద్యమం కొనసాగుతున్న కాలం. శ్రీ విజయ సాయి హై స్కూల్ (బోధన్) లో నేను హాస్టల్‌లో ఉంటూ చదుకుంటున్న రోజులవి. అప్పటికే బొమ్మలు స్కెచ్‌లు వేసే వాడిని. మొదట బొమ్మలే వేశాను, కానీ ఎందుకో తర్వాత వాటికి రెండు లైన్ల క్యాప్షన్స్ రాయాలని అనిపించి, రాయడం అలవాటు చేసుకున్నాను. తర్వాత తెలంగాణ ఉద్యమానికి సంబంధించి పంపా సాహితీ పీఠం (బోధన్) వారి కోసం 'తెలంగాణ ఔన్నత్యం' అనే కవితని రాస్తే మా తెలుగు టీచర్ శిరీష ఎడిట్ చేశారు. ఆ తర్వాత అలానే స్కూల్లో ఏ కార్యక్రమం జరిగినా, నా స్పీచ్ ఉండేది. ఎవరైనా గెస్ట్ వస్తే వాళ్ళకి నా పెయింటింగ్ గిఫ్ట్‌గా ఇవ్వడం ఇవి తప్పనిసరిగా ఉండేవి. ఆ రకంగా రచనల వైపు తొలి అడుగులు పడ్డాయని చెప్పొచ్చు.

ఈ పుస్తకానికి పెట్టిన 'ఢావ్లో' అనే శీర్షిక గురించి చెప్పండి?

మా వాళ్లలో ముఖ్యంగా స్త్రీలు ఢావ్లోను కచ్చితంగా నేర్చుకుంటారు. ఢావ్లో అంటే విషాద గీతమని అర్థం. దీనిని విషాద సమయాల్లోనే కాదు, ఆనంద సమయాల్లోనూ, ఎదురుపడినప్పుడల్లా కౌగిలించుకొని పాడుకుంటూ ఏడుస్తుంటారు/ ఏడుస్తూ పాడుకుంటారు. మా పూర్వీకులు పాడుకున్న పాటలు, లిఖితపూర్వకంగా లేకున్నా, మౌఖికంగానే కొత్త తరాన్ని చేరుతున్నాయి. ఇప్పటికీ కాలానికి అనుగుణంగా భిన్న సందర్భాలను, అనేక అనుభవాలను తమలోని ఉద్వేగంతో జోడించి ఢావ్లోను కొత్తగా పాడుకుంటున్నారు. ఈ మార్పు ద్వారా తమ పూర్తి బాధను వ్యక్తపరిచే ప్రయత్నం చేస్తున్నారని చెప్పొచ్చు. ఈ మౌఖిక సంప్రదాయం ఇంకా చెక్కుచెదరకుండా ఉన్నా, కూసింత మోడరన్‌గా కూడా మారింది. ముఖ్యంగా నా కథా సంపుటికి ఈ శీర్షిక పెట్టడానికి కారణం ఏంటంటే, చుట్టూ ఉన్న సాహితీ మిత్రులందరూ వాళ్ల బాల్యంలో వాళ్ళు చూసిన, విన్న ఈ ఢావ్లోను గురించి అడిగారు. నా మొదటి పుస్తకం బల్దేర్ బండితో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడో ఒక అక్కడ ప్రయాణాన్ని కొనసాగించాను. ఆ ప్రయాణం తర్వాత నా కథ చెప్పడం అవసరం కదా అనిపించింది. అందుకే ఢావ్లోను వినిపించాను.

ఈ కథల పట్ల వచ్చిన స్పందనల్లో మీరు మర్చిపోలేనివి? మీ కుటుంబం, తోటి గోర్ బంజారాల స్పందనలు?

నిజానికి నా ఇంగ్లీష్ పుస్తకం చక్కటికి వచ్చిన సమీక్షల్లో నా తెలుగు పుస్తకాలకు పావు వంతు సమీక్షలు కూడా రాలేదు. దీనికి గల కారణం తెలిసిందే, నేను బంజారా సంచార తెగకు సంబంధించిన వాడిని కావడం. నేను రాసిన దాని కంటే, నేను ఎవరు అనేదే గ్లోరిఫై అవుతున్నది. ఇది ఒక్క నా విషయమనే కాదు, బహుశా వేరే గిరిజన, ఆదివాసీ కొత్త గొంతుకలకు కూడా ఇలానే కావొచ్చు. చేసిన పని కంటే, మన బ్యాక్‌గ్రౌండ్ ఎక్కువగా ప్రచారమౌతుంది. కొన్నిసార్లు గ్లోరిఫికేషన్ అవసరమే కానీ, సాహిత్యం విషయంలో ఇది అనవసరం. మా ఇంట్లో వాళ్లకు ఇప్పుడే కాదు ఎప్పటికీ నేను ఇలా రాసుకుంటూ జీవితం పాడు చేసుకుంటున్నానేమో అనే బాధ, మా తండా వాళ్లకు నేనేదో గొప్పపని చేసినందుకే పత్రికలు నా గురించి రాసాయనే ఆనందం అలానే ఉంటాయి. బాగా రాశానని దానికి గల కారణాలు చెప్పిన వారు ఉన్నారు. బాలేవు అని అన్నారే తప్పించి, ఎందుకో కారణం ఇప్పటి దాకా వాళ్ళు చెప్పలేదు, నేనింకా ఎదురు చూస్తునే ఉన్నాను. కాస్తో కూస్తో చదుకున్న వాళ్ళు పుస్తకాన్ని అపురూపంగా మళ్ళీ మళ్ళీ చదువుకుంటూ 'ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌'లో నన్ను కాంటాక్ట్ అవుతున్నారు. మా నాన్న తరం వాళ్ళు నా పుస్తకాలను ఇంట్లో దాచుకుని, వాళ్ళ చుట్టాలకు మా తండా పిల్లాడు రాసాడు అని చూపించుకుంటున్నారని వాళ్ళూ వీళ్ళూ చెప్తుంటే భలే అనిపిస్తుంటుంది.

> **మా ఇంట్లో వాళ్లకు ఇప్పుడే కాదు ఎప్పటికీ నేను ఇలా రాసుకుంటూ జీవితం పాడు చేసుకుంటున్నానేమో అనే బాధ, మా తండా వాళ్లకు నేనేదో గొప్పపని చేసినందుకే పత్రికలు నా గురించి రాసాయనే ఆనందం అలానే ఉంటాయి. మా నాన్న తరం వాళ్ళు నా పుస్తకాలను ఇంట్లో దాచుకుని, వాళ్ళ చుట్టాలకు మా తండా పిల్లాడు రాసాడు అని చూపించుకుంటున్నారని వాళ్ళూ వీళ్ళూ చెప్తుంటే భలే అనిపిస్తుంటుంది.**



సాహిత్యంలో మున్ముందు మీరు ముఖ్యంగా చేయాలనుకుంటున్నవి, రాయాలనుకుంటున్నవి?

సాహిత్యంలో కొత్త కొత్త పోకడలు వస్తూనే ఉన్నాయి. సైన్స్ ఫిక్షన్, సర్రియలిజం, మ్యాజికల్ రియాలిజం ఇలాంటి వాటి గురించి వింటూ ఉంటాం. వీలైనంత వరకు వీటిని నా రచనల్లో సహజంగా తీసుకురావాలని అనుకుంటున్నాను. రాసే వాటిలో సహజత్వం ఎంతుంటుందో తెలీదు కానీ, ఇది నా ఆలోచన, నా రచనాభిలాష. ఇకపోతే రెండు తెలుగు రాష్ట్రాల్లో మనకు మొత్తం 35 గిరిజన, సంచార, ఆదివాసీ తెగలు ఉన్నాయి. నా అవగాహన మేరకు, వాటిలో కొన్ని తెగలకు సంబంధించి సాహిత్య సృజన చేసినా చాలనుకుంటున్నాను. రాయడం అనేది కచ్చితం, కానీ ఎంత కాలం రాస్తాను, ఏం రాస్తాను అనేది చుట్టూ వాతావరణమే డిసైడ్ చేస్తుందని నమ్ముతాను. ప్రస్తుతానికి సూర్యాధనంజయ్, ధనంజయ నాయక్, మంత్రి శ్రీనివాస్ గార్లతో కలిసి ఓ సంకలనానికి పని చేస్తున్నాను.

ఈమెయిల్: rameshkarthik225@gmail.com

ఆధునిక భావ కవిత్వానికి దీటైన మూడొందలేళ్ల కావ్యం

ఒకరిపై ఒకరికి అత్యంతంగా వలపు ఉన్న ఇద్దరు ప్రేమికులకు, ఏదో కారణం చేత, కొంతకాలం విడిగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడగా, ఒకనాటి సాయంత్రం వారిరువురు కలుసుకుని, విడిపోయే సన్నివేశాన్ని 'మలహణ చరిత్రము' అనే కావ్యం, ద్వితీయాశ్వాసంలోని ఈ క్రింది పద్యం ఇలా వర్ణించింది.

కం. అడుగిడుచు మగుడిచూచుచు
నడు గామడగాఁగ నలసి యటఁ దొట్రిలుచున్
వడినీళ్ళ కెదురు నడిచిన
వడువున నెడఁబాసి చనిరి వనితయుఁ బతియున్.

'భావుకత' అనే మాటకు సరిపోయే ఆధునిక అర్థంలో, సున్నితమైన ఆలోచనలను చేసి ఆ ఆలోచనలను అంతకంటే సున్నితమైన మాటలలో పాఠకుడికి అందించడం క్రీ.శ.20వ శతాబ్దపు భావకవులతో మాత్రమే మొదలైందనే అభిప్రాయాన్ని నొక్కివక్కాణించేవారి మాటలలో ఎంత తొందరపాటుతనమున్నదో తెలియజెప్పడానికి ఉదాహరణలుగా నిలిచే పద్యాలలో ఒకటి ఈ పద్యం; అందులోనూ ముఖ్యంగా మూడవపాదంలోని భావం!

అడుగడుక్కీ ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటూ ఒకర్ని వదిలి ఒకరు వెళ్ళిపోతున్నారు వాళ్ళు. ఆ ఇరువురి మధ్య పడుతున్న ఒక్కొక్క అడుగుకీ ఒక్కొక్క ఆమడ దూరం వారి మధ్య పెరుగుతూ ఉన్నట్లుగా ఉందట వాళ్ళకి. అనగా ప్రతి అడుగుకీ ఒక ఆమడ దూరం నడిచినంత భారంగా, అలసటగా ఉందని ఉత్ప్రేక్ష! అలా పెరిగిన అలసట, హృదయంలో భారాన్ని మరింత పెంచగా, అడుగులు తడబడుతూ పడసాగాయట! ఆ తడబాటు ఎంత భారమైనదంటే, 'వడినీళ్ళ కెదురు నడిచినట్లుగా' పడుతున్నాయట వాళ్ళ అడుగులు. ఏరు పొంగి, నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న స్థితిలో ఆ నీటికి ఎదురు నడిచి ఏరు దాటాల్సిన అనుభవం ఒక్కసారైనా అయినవాళ్ళకు, ఆ మాటలలో ఉద్దేశించిన భావం స్పష్టంగా అర్థమౌతుంది. వేగంగా ప్రవహిస్తున్న నీటిలో ఒక్క అడుగు కూడా ఎదురు నడవడం ఎంతో కష్టంగా ఉంటుంది. ముందుకు ఎంత బలంగా అడుగు వేయాలని చూసినా అంతకు రెట్టింపు బలంతో నీటి ఉధృతి పడే అడుగుని వెనక్కి నెడుతుంది. ఆ కష్టాన్ని గుర్తుకు తెచ్చి, వారిరువురు ఒకరి నుండి ఒకరు దూరంగా నడిచి వెళ్ళే ప్రక్రియ ఎంత బాధతో కూడినదై సాగిందో కళ్ళకు కట్టినట్లు చూపబడింది ఆ మాటలలో. ఏ ఆధునిక భావకవి వర్ణనకైనా తీసిపోని వర్ణన మూడు శతాబ్దాల క్రితం నాటి ఈ పద్యకవి మాటలలో మనకు కనపడుతుంది.

పేరునుబట్టి కాశ్మీర దేశస్థుడుగా భావింపబడిన గొప్ప శివభక్తుడు మల్హణుడి జీవితానికి సంబంధించినవిగా లోకులు చెప్పుకునే కొన్ని సంఘటనలను కథావస్తువుగా చేసుకుని 17వ శతాబ్దానికి చెందిన యెడపాటి యెఱ్ఱ నార్యుడు రచించిన కావ్యం 'మలహణ చరిత్రము'. ఆధునిక భావకవిత్వ ధోరణికి చెందినవనిపించే పోలికలు, అరుదైన నానుడుల వర్ణన చిత్రాలు ఈ కావ్యంలో మెండుగా ఉన్నాయి.

పేద కుటుంబంలో పుట్టిన మల్హణుడు బహువిద్యావంతుడు, సౌందర్యవంతుడు. కథానాయిక పుష్పగంధి, మదనసేన అనే పేరుగల ఒక వారకాంత కూతురు, బహు సౌందర్యవతి. ఇరువురూ ఒకే ఒజ్జ దగ్గర పాఠాలు నేర్చుకుంటూ పెరిగి పెద్దవాళ్ళవుతారు. వయసు పెరిగే కొలది వారి మధ్య స్నేహం ప్రేమగా మారింది. ఈ ప్రేమ వ్యవహారం పుష్పగంధి తల్లికి నచ్చదు. మల్హణుడి స్థితిగతులను గురించి తెలుసుకుని, పైసాకు పనికిరాని అతనితో ప్రేమ వలన ప్రయోజనం ఉండదని అతడిని ఇంటికి రానివ్వదు. 'ఏ జంటకు ఏ జన్మలో హాని కలిగించామో, ఈ జన్మలో మనకీ విధంగా ఎడబాటును కలిగించాడు విధాత!' అని బాధపడతారు ప్రేమికులిరువురూ. అలా ఉండగా, వారవనితయైన మదనసేన, తన కూతురైన పుష్పగంధి జీవిక కోసం తనలా కష్టపడకూడదన్న కోరికతో, వెదికి ఊరిలోని ధనికుడైన వ్యాపారస్తుని పుత్రరత్నమైన ధనదత్తుడనే యువకునితో కూతురికి పొందు కుదిర్చి, ఒకనాటి రాత్రి ఇద్దరినీ గదిలో వేసి సుఖించమని తాను తప్పుకుంటుంది. అయితే పుష్పగంధి మనసు మల్హణుడి మీద లగ్నమైయున్న కారణంగా గదిలోంచి బయటకు వెళ్ళి, తన దురదృష్టానికి దుఃఖిస్తూ ఉంటుంది. "ఎవరేమనుకున్నా, కూతురిని మదనసేన నాకు సొంతం చేసింది, అది చాలు ఇప్పటికి!" అని సంతోషంలో మునిగిపోయి, పుష్పగంధిని వదిలేసి ఆమె పరిచారికతో గదిలో సరసాలాడుతూ సుఖిస్తూ ఉంటాడు ధనదత్తుడు. హేయమైన ఆ సందర్భాన్ని ఈ క్రింది పద్యంలో వ్యాఖ్యానిస్తూ, ధనదత్తుడిని ఉద్దేశించి 'శిథిలాత్ముడు' అనే మాటను ప్రయోగించాడు యెడపాటి యెఱ్ఱ నార్యుడు:



> **ప్రసిద్ధుడైన ఒక పూర్వ శివభక్తుడి జీవితంలో సంఘటనలను వస్తువుగా తీసుకుని, కథాగమనంలో సందర్భానికి సరిపోయే విధంగా ఆధునిక భావాలను, అరుదైన తెలుగు జాతీయాలను ఆలంబనగా చేసి, యెడపాటి యెఱ్ఱ నార్యుడు రచించిన 'మలహణ చరిత్రము' పద్యకావ్యం నేటి తరానికి తెలియని ఎన్నో అర్థవంతమైన నానుడులను కాలంలో కనుమరుగైపోకుండా కాపాడిన కావ్యాలలో ఒకటి!**

కం. వ్యథఁ దల్పుగడియ పెట్టియు
శిథిలాత్ముఁడు దాసితోడఁ జెనకుచునుండెన్
క్షుధనొందినట్టి పిల్లికి
విధిమూడిన యెల్క లేదె వెదకిన నైనన్.


(మలహణ చరిత్రము, తృతీయాశ్వాసం)

"ఆకలితో అలమటిస్తున్న పిల్లికి, సరిగ్గా వెతకాలే గాని ఇంత ప్రపంచంలో విధి వక్రించి చావు దగ్గరపడిన ఒక్క బక్కచిక్కిన ఎలుక దొరకకుండా పోతుందా?" అని పై పద్యంలోని చివరి రెండు పాదాల భావం! హీనత్వానికి హద్దులను మాటలతో చెప్పడం కష్టం. వ్యాపారధర్మం అన్ని వైపులనుండి అనుక్షణమూ శాసిస్తూ ఉండే ఈ లోకవ్యవహారంలో, ఒక బలవంతుడి ఆకలి తీరడానికి ఒక బలహీనుడి నిస్సహాయత ఆహారంగా మారడం అన్న రాక్షస ధర్మం ఏ ఆర్భాటమూ లేకుండా నిర్వర్తించబడుతూ ఉంటుందన్న ఆధునిక కవి భావం ఈ చరణాలలోని మాటలలో గట్టిగానే చెప్పబడి కనపడుతుంది.

ప్రసిద్ధుడైన ఒక పూర్వ శివభక్తుడి జీవితంలో సంఘటనలను వస్తువుగా తీసుకుని, కథాగమనంలో సందర్భానికి సరిపోయే విధంగా ఆధునిక భావాలను, అరుదైన తెలుగు జాతీయాలను ఆలంబనగా చేసి, యెడపాటి యెఱ్ఱ నార్యుడు రచించిన 'మలహణ చరిత్రము' పద్యకావ్యం నేటి తరానికి తెలియని ఎన్నో అర్థవంతమైన నానుడులను కాలంలో కనుమరుగైపోకుండా కాపాడిన కావ్యాలలో ఒకటి!

భట్టు వెంకటరావు

జీవితం ఎక్కడ పడిపోయిందో తెలియనే లేదు



జాతరలో, మేళాలో
బాంసురీలు అమ్ముకుంటూ తిరిగాను

దారిపొడుగునా
బెలూన్లు అమ్ముకుంటూ నడిచాను

ఆకలికి ఎక్కడా ఆగలేదు
దాహానికి ఎవరినీ అడగలేదు

చీకటి పడేవేళ రోడ్ల మీద
దీపాలు అమ్ముతూ కూర్చున్నాను

అలసిపోయి చేతిలో చూసుకుంటే,
జీవితం ఎక్కడ పడిపోయిందో
శబ్దమే వినిపించ లేదు

ఎప్పుడు పడిపోయిందో
ఎట్లా జారిపోయిందో
నాకు తెలియనే లేదు

ఆశారాజు
asharaju.poet@gmail.com

నేడు బల్దియాలో ప్రజావాణి

వరంగల్ కార్పొరేషన్, జూన్ 30: నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం బల్దియాలో ఉదయం 11 గంటల నుంచి జరుగనుంది. వరంగల్ నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం ప్రజావాణి (గ్రీవెన్ సెల్) కార్యక్రమం నిర్వహించనున్నట్టు నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి ప్రజలు వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.



పదవి దక్కేనా?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

నామినేటెడ్ పదవులపై ఉత్కంఠకు తెరపడింది. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజే ప్రభుత్వం నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తూ ప్రకటన జారీ చేసింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో ప్రభుత్వ ప్రకటన అమల్లోకి రాలేదు. దీంతో తమ పదవులు ఉన్నట్టా.. ఊడినట్టా? అనే టెన్షన్‌లో పదవులు పొందిన నేతలు, వారి అనుచరులు ఉన్నారు. గతంలో ప్రకటించిన నామినేటెడ్ పదవులు యథావిధిగా కొనసాగేలా ఉండడంతో ఇక ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో సీట త్యాగం చేసిన నేతలతో పాటు కీలక నేతలకు నామినేటెడ్ పదవులను కట్టబెట్టేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. దీంతో రాష్ట్రస్థాయి పదవులతో పాటు జిల్లాస్థాయి పదవులకు కూడా ఆశావహులు పోటీ పడుతుండటంతో కాంగ్రెస్‌లో నామినేటెడ్ కోలాహలం నెలకొంది.

ఆ ఆరు పదవులపై..

నామినేటెడ్ పదవులపై నెలకొన్న ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఇప్పటికే ప్రకటించిన జాబితాలో ఉన్నవారి పదవులు వారికేనని ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరిన తరువాత తొలిసారిగా మార్చి 16వ తేదీ రాత్రి 37మందితో నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. పదేళ్ల తరువాత అధికారంలోకి రావటంతో చాలా మంది సీనియర్ కాంగ్రెస్ నేతలు, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన నేతలు, ప్రొటోకాల్ కోసం పదవుల కోసం అనేక మంది ఎదురుచూశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అరుగురికి రాష్ట్రస్థాయి పదవులతో పాటు కీలకమైన కూడా చైర్మన్ పదవులను ప్రకటించింది. దీంతో వీరి అనుచరుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. అయితే అదే రోజు లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన రావడంతో అధికారికంగా ప్రకటన వెలువడలేదు. ఇదిలా వుండగా, లోక్‌సభ ఎన్నికల్లో అనేక మంది ఎంపీ టికెట్ ఆశించారు. అయితే కాంగ్రెస్ అధిష్ఠానం చాలామందికి నామినేటెడ్ పదవులను ఆశ చూపి టికెట్ పోటీ నుంచి తప్పించింది. ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల అనంతరం తమ పదవులు తమకే దక్కుతాయా..? మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వేరేవారికి వస్తాయా? అనే ఉత్కంఠ గతంలో నామినేటెడ్ పదవులు పొందిన నేతల్లో నెలకొంది. ఈ క్రమంలో గతంలో ప్రకటించిన నామినేటెడ్ జాబితాలో ఉన్నవారికే పదవులని ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటంతో ఉత్కంఠకు తెరపడింది. దీంతో మంచి ముహూర్తం చూసుకుని ప్రమాణ స్వీకారం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పదవుల కోసం ఒత్తిళ్లు

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, లోక్‌సభ ఎన్నికల్లో టికెట్ త్యాగం చేసిన నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో దొమ్మాటి సాంబయ్యకు ఎంపీ టికెట్ దాదాపు ఖరారైందనే వార్తలు వినిపించినప్పటికీ చివరి నిమిషంలో చేజారింది. దీంతో సాంబయ్యకు కీలకమైన రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి లభిస్తుందనే చర్చ జరుగుతోంది. అలాగే డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ సైతం టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. ఆయనకు కూడా నామినేటెడ్‌లో కీలకమైన పదవిని ఇవ్వాలని పలువురు ఎమ్మెల్యేలు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. వీరితో మరో ఇద్దరు, ముగ్గురు నేతలు కూడా ఎంపీ టికెట్‌ను త్యాగం చేసి అభ్యర్థి గెలుపు కోసం

మిగతా 6వ పేజీలో..

- కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల కోలాహలం
- ఇప్పటికే ప్రకటించిన వారికి పదవులు పదిలం
- ఉమ్మడి జిల్లా నుంచి ఆరుగురికి 'కార్పొరేషన్' పదవులు
- సర్కారు సానుకూలతతో ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు
- టికెట్ త్యాగం చేసిన, ఇతర కీలక నేతలకు అవకాశం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా స్థాయి పదవులకు డిమాండ్

ఆరు నామినేటెడ్ పదవులు వీరికే..

అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల టికెట్ ఆశించి భంగపడిన ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కూడా) చైర్మన్ పదవి దక్కింది. వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా పదవి దక్కింది. రియాజ్‌కు రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్యనాయక్‌కు గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే ములుగు మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి లభించింది.



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

అభివృద్ధి పథంలో అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు

- చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు
- ఘనంగా బ్యాంకు 28వ వార్షికోత్సవం

పోచమ్మమైదాన్, జూన్ 30: వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తెలిపారు. వరంగల్ దేశాయిపేట రోడ్డులోని కేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు 28వ మహాజన సభ ఘనంగా నిర్వహించారు. బ్యాంకు పాలకమండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకు ఎన్నడూలేని విధంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో పురోగతి సమీక్షించిన తరువాత బ్యాంకు పటిష్టమైన స్థితిలో ఉందని తెలిపారు. ఖాతాదారుల కోసం మరిన్ని మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. త్వరలో నాలుగు నూతనబ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకు నేందుకు అనుమతి లభించిందన్నారు. బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

అదేవిధంగా బ్యాంకు నేతృత్వంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, భవిష్యత్తులో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. బ్యాంకు అభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గం శ్రేణులు తోట జగన్నాథం, తోట సంపత్‌కుమార్, మహ్మద్ గౌసుద్దీన్, బొమ్మినేని పాపిరెడ్డి, పొన్నా హరినాథ్, ఎం.సత్యనారాయణ, డీసీవో సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో రూ.3కోట్ల ప్రజాధనం వృథా

- పెద్దల వైద్యంపై ఉన్న ప్రేమ.. పేదల వైద్యంపై లేదు..
- ఎమ్మెల్యేలు జిల్లాకు ఒక్క రూపాయి తేలేదు..
- మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, ధర్మారెడ్డి, సుదర్శన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

బాలసముద్రం, జూన్ 30: సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పర్యటనతో రూ.3కోట్ల ప్రజాధనం వృథా అయిందని మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మాజీ చైర్మన్‌లు నాగుర్ల వెంకటేశ్వర్లు, మర్రి యాదవరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నగర పర్యటనలో సాధించిందేమీ లేదన్నారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులను పరిశీలించి బీఆర్‌ఎస్‌ను బదనామ్ చేయడానికే వచ్చినట్లు ఉందన్నారు. ఆయన పర్యటన కొండను తవ్వి ఎలుకను పట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాల ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు వరంగల్‌లో 2,100 పడకలతో 24 అంతస్తులతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి కేసీఆర్ రూ.600కోట్లు మంజూరు చేశారని వినయ్‌భాస్కర్ తెలిపారు. ఈ ఆస్పత్రి నిర్మాణాన్ని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నాలుగైదు నిమిషాలలో పరిశీలించి అక్కడ కాంట్రాక్టర్లను బెదిరించారని ఆరోపించారు. అయితే పక్కనే ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో కరెంట్‌కోతలు, పరికరాలు పనిచేయక రోగులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోకుండా ప్రైవేట్ ఆస్పత్రిని ప్రారంభించి వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. దీనిని బట్టి ప్రభుత్వానికి విద్య, వైద్యంపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమ వుతోందని అన్నారు. నగరంలో వరదలను నివారించడానికి బీఆర్‌ఎస్ పాలనలో రూ.100 కోట్లతో పనులు చేసినట్లు తెలిపారు. 2023లో శాశ్వత డీపీఆర్ తయారు చేసి కేసీఆర్‌కు అందిస్తే రూ.250కోట్లు మంజూరు చేశారని తెలిపారు.

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం 13 వందల ఎకరాలు భూసేకరణ చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం టెక్స్‌టైల్ పార్కు సమీపంలోని గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు మంజూరు చేయాలని, రైతుల పిల్లలకు మొదటి ప్రాధాన్యతగా ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే చింతలపల్లి ఫోర్‌లైన్ రోడ్డును వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం పనితీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే విశ్వాసం తగ్గిందన్నారు. 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డిని వ్యతిరేకిస్తున్నారని, 26 మంది ఎమ్మెల్యేలే రేవంత్‌రెడ్డిని బలపరుస్తున్నట్లు ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాటలనే అధికారిక మాటలుగా తీసుకోవాలని కేబినెట్‌లో సీఎం చెప్పడంపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క లాంటి మంత్రుల మాటలకు విలువలేదని తెలుస్తోందని తెలిపారు. శనివారం సీఎం పర్యటనతో రూ.3కోట్ల ప్రజాధనం వృథా అయిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై, జిల్లా సమగ్రాభివృద్ధిపై సమీక్షా సమావేశం జరగలేదని విమర్శించారు. జిల్లా ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండకుండా గాలికి తిరుగుతున్నారని విమర్శించారు. సీఎం పర్యటన వల్ల విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. అక్రమ అరెస్టులు ఇక సాగవని బీఆర్‌ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరబోయిన ప్రశాంత్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నందికొండ గణపతిరెడ్డి, సుదాటి వెంకటేశ్వర్లు, గురిజపెల్లి ప్రకాష్‌రావు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ గడువు పొడిగింపు

- ఎంపీ కావ్య విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి
- మనోహర్‌లాల్ ఖట్టర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎంపీ కావ్య కృతజ్ఞతలు

హనుమకొండ సిటీ, జూన్ 30: వరంగల్ స్మార్ట్‌సిటీ మిషన్ గడువు పొడిగించాలన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తిపై కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు 2025 మార్చి 31 వరకు గడువును పొడిగిస్తూ కేంద్ర హౌసింగ్, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో డాక్టర్ కడియం కావ్య కృషి ఫలించింది. ఈ నెల 24న ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి ఎంపీ డాక్టరు కడియం కావ్య.. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఢిల్లీలో కలిశారు. వరంగల్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనులు కొన్ని ముగింపు దశకు చేరుకోవడం, మరికొన్ని పనులు కొనసాగడం, పెండింగ్ పనులు ఉండడాన్ని కడియం కావ్య కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలో గడువు పొడిగించడం ద్వారా వరంగల్ మహానగర అభివృద్ధికి మేలు చేసిన వారు అవుతారంటూ కేంద్ర మంత్రిని ఎంపీ కడియం కావ్య అభ్యర్థించారు. అలాగే 24న కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి వినతిపత్రం ఇచ్చారు.

అంతేకాకుండా మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను పలుమార్లు ఈ విషయమై సంప్రదించారు. స్మార్ట్‌సిటీ గడువు పొడిగింపుపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ఈ పరిణామం వరంగల్ మహానగరాభివృద్ధి ఎంతో ఉపయుక్తం కానుంది. కాగా, స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు గడువు పొడిగించడంపై ఎంపీ డాక్టరు కడియం కావ్య కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియచేశారు.

మరింత చేరువలో 'మీ సేవ'!

- మహిళా శక్తి పథకం కింద అందుబాటులోకి సేవలు
- మహిళా సంఘాలకు బాధ్యతలు.. ఇంటర్ చదివిన వారికి అప్పగింత

8

సోలార్‌తో ఆదా..

● సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ● గృహావసరాల మినహా మిగులు ఉత్పత్తికి డిస్కం డబ్బులు చెల్లింపు

● 20 ఏళ్ల వరకు బిల్లుల భారం తప్పించుకోవచ్చు ● సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు ఒప్పందాలకు డిస్కం దూరం..?

హనుమకొండ టౌన్, జూన్ 30 : విద్యుత్ ఆదాతో పాటు నెలవారీ కరెంట్ బిల్లులను తగ్గించుకునేందుకు వినియోగదారులు సోలార్ వైపు అడుగులు వేస్తున్నారు. థర్మల్ పవర్‌స్టేషన్స్‌లో తయారయ్యే విద్యుత్ డిమాండ్‌ను తగ్గించడంతో పాటు కాలుష్యాన్ని అరికట్టి గ్రీన్ ఎనర్జీని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ స్కీంలో భాగంగా సోలార్‌పై సబ్సిడీని అందిస్తోంది. ఈ క్రమంలో చాలామంది వినియోగదారులు సోలార్‌ను ఏర్పాటు చేసుకొని జీరో బిల్లులు పొందడమే కాకుండా వారి సోలార్ ప్యానల్స్ నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు ఎన్పీడీసీఎల్ నుంచి డబ్బులు పొందుతున్నారు. సూర్యఘర్ స్కీంలో భాగంగా దేశవ్యాప్తంగా కోటి కనెక్షన్‌లు చేరుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా ఆ లక్ష్యాన్ని దాటినట్లుగా డిస్కం అధికారులతోపాటు సోలార్ అథరైజ్డ్ వెండర్స్ వెల్లడిస్తున్నారు. గృహావసరాలకు సూర్యఘర్ ద్వారా కేంద్రప్రభుత్వం రాయితీలు ఇచ్చినట్లు, సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటుకు డిస్కంలు ముందుకొచ్చి ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను కొనుగోలు చేస్తామని ఒప్పందాలు చేసుకుంటే రానున్న రోజుల్లో విద్యుత్ కొరత లేకుండా చూడొచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సోలార్ కనెక్షన్ పొందడం ఎలా..?

గతంలో రెడ్-కో నోడల్ ఏజెన్సీ ద్వారా సోలార్ కనెక్షన్‌లకు వినియోగదారులు దరఖాస్తులు చేసుకోగా ఏజెన్సీ వారే అన్నీ చూసుకొని కనెక్షన్ ఇప్పించేవారు. ప్రస్తుతం నేషనల్ పోర్టల్ ద్వారా వినియోగదారుడు ఆధార్, విద్యుత్‌బిల్లు, అడ్రస్‌తో దరఖాస్తు చేసుకుంటే ఎలక్ట్రిసిటీ అధికారులు వినియోగదారుడి అడ్రస్‌ను సందర్శించి ఎంత లోడ్ ఉంది? ఎన్ని కిలోవాట్స్‌కు అనుమతులు ఇవ్వాలనేది పరిశీలించి ఫిజిబిలిటీ సర్టిఫికెట్ ఇస్తే దాని ద్వారా అథరైజ్డ్ సోలార్ వెండర్ వచ్చి సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్ బిగించి కనెక్షన్ ఇచ్చి సోలార్ మీటర్ ఏర్పాటు చేస్తారు. గతంలో ఎలక్ట్రిసిటీ అధికారులు ఫిజిబిలిటి సర్టిఫికెట్ ఇస్తేనే వెండర్స్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి అనుమతి ఉండేది. కాగా, కేంద్రంలోని మినిస్ట్రీ ఆఫ్ న్యూ రెన్యూబుల్ ఎనర్జీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ఈఆర్‌సీ 10 కిలోవాట్స్ లోపు ఎలాంటి ఫిజిబిలిటీ అవసరం



లేదని డిస్కంలకు ఉత్తర్వులు జారీచేశారని ఎన్పీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో 17.4 మెగావాట్స్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటివరకు 1,497 సోలార్ కనెక్షన్స్ ఉండగా, 17.4 మెగావాట్స్‌ను సోలార్ ద్వారా వినియోగదారులు వాడుతున్నారు. సూర్యఘర్‌లో భాగంగా 22 కనెక్షన్స్ కొత్తగా గృహావసరాలకు అనుమతులు పొంది సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. గ్రీన్ ఎనర్జీలో భాగంగా పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ (పీపీఏ) ద్వారా ఎన్పీడీసీఎల్ పరిధిలో సోలార్ ద్వారా ఉత్పత్తి అవుతున్న 1,013 మెగావాట్స్ విద్యుత్‌ను ఎన్పీడీసీఎల్ కొనుగోలు చేస్తుండగా, రెన్యూబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లికేషన్ (ఆర్‌పిపిఓ) స్కీంలో భాగంగా ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులు 2 మెగావాట్స్ విద్యుత్‌ను సోలార్ ద్వారా ఉత్పత్తి చేసుకొని వారి కంపెనీలకు సరఫరా చేసుకుంటున్నారని ఎన్పీడీసీఎల్ వర్గాలు చెప్తున్నాయి. 3కిలో వాట్స్ ప్రతి రోజు 12 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుండగా చాలా మంది వినియోగదారులు పొదుపుగా విద్యుత్‌ను వినియోగిస్తూ ఎన్పీడీసీఎల్ నుంచి డబ్బును పొందుతున్నారు. సోలార్ (నెట్) మీటర్‌లో ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్ రెండు రీడింగ్‌లను తీసి సోలార్ ఉత్పత్తికి కంటే వినియోగదారుడు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తే వినియోగదారుడు బిల్లు చెల్లించడం, తక్కువ వినియోగిస్తే విద్యుత్‌శాఖ 6 నెలలకు ఒకసారి విగులు ఉత్పత్తిపై ఒక్క యూనిట్‌కు 4.99 పైసల చొప్పున చెక్‌రూపంలో డబ్బులు చెల్లించడం జరుగుతుంది. కాగా ఒక్కసారి ప్యానల్‌కు పెట్టిన పెట్టుబడి మూడేళ్లలో తీరిపోతుందని మిగితా 20 సంవత్సరాలు ఉచితంగా జీరో బిల్లుపై విద్యుత్‌ను వినియోగించుకోవచ్చని అథరైజ్డ్ వెండర్స్ అంటున్నారు.

సబ్సిడీపై సోలార్ పలకలు

కేంద్ర ప్రభుత్వం థర్మల్ పవర్ ప్లాంట్స్ నుంచి వచ్చే పోల్యూషన్‌ను అరికట్టడంతో పాటు వినియోగదారులు విద్యుత్‌ను ఆదా చేయడం తద్వారా బిల్లులను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో సోలార్ విద్యుత్‌ను పోత్సాహించేవిధంగా పీఎం సూర్యఘర్ స్కీం ద్వారా 78,000 వరకు రాయితీని ప్రకటించింది. ఒక కిలోవాట్‌కు 30,000 చొప్పున 3 కిలో వాట్స్ అంతకంటే ఎక్కువ వాట్స్ వరకు 78,000 రాయితీని కేంద్ర ప్రభుత్వం అందజేస్తుంది. సుమారుగా నెలకు 3000 నుంచి 4,000 బిల్లు వచ్చే వినియోగదారులకు సోలార్ విద్యుత్ బాగా పనిచేస్తుందని, ఒకసారి సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసుకున్నట్లయితే 25 సంవత్సరాలకు వరకు పనిచేస్తుందని 3 కిలో వాట్స్ పై పెట్టిన పెట్టుబడి 3 నుంచి 4 సంవత్సరాల్లో తీరిపోగా మిగితా 20 ఏళ్లు ఉచితంగా కరెంట్‌ను పొందొచ్చని అథరైజ్డ్ సోలార్ వెండర్స్ పేర్కొంటున్నారు. ప్యానెల్స్‌ను 15 రోజులకొకసారి శుభ్రం చేసుకుంటూ, సూర్యుని వేడి పలకలపై పడేట్లు ఉత్తరం నుంచి దక్షిణం వైపు ఏటవాలుగా ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ ఉత్పత్తి తగ్గకుండ రోజుకు ఒక్క కిలోవాట్‌కు 4యూనిట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వెండర్స్ సూచనలు చేస్తున్నారు.

సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు ఒప్పందాలకు డిస్కం దూరం..?

విద్యుత్ కొరతను తీర్చడంతో పాటు గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఖాళీ ప్రదేశాల్లో రైతులు లేదా వ్యాపారులు సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకొని డిస్కంలకు విద్యుత్ విక్రయించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలంటే ముందుగా ప్లాంట్‌ల నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తామని డిస్కం ఒప్పందం చేసుకోవాలి దానికి డిస్కం ముందుకురావడం కానీ, ప్రయత్నాలు చేయడం కానీ ఏమి చేస్తలేదని విమర్శలు వస్తున్నాయి. ఆ దిశగా ముందుకేళ్తే విద్యుత్ కొరతను తీరడంతో పాటు రైతులకు, వ్యాపారులకు ఆదాయ వనరులు కల్పించడం, గ్రీన్ ఎనర్జీని ప్రొత్సాహించినవాళ్లవుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్ర గాయాలు

ఐనవోలు, జూన్ 30: రోడ్డు పక్కన ఉన్న బీటెక్ ద్యార్థినిని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో విద్యార్థి కాలు కోల్పోయిన సంఘటన పున్నేలు క్రాస్ రోడ్డు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన మామిండ్ల అభిలా ష్. పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసి హైదరాబాద్‌లో ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ పొందాడు. ఆదివారం ఉద యం 10గంటలకు సొంత పనిపై బైక్‌పై పున్నేలు క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో విశాఖపట్నం నుంచి రాజస్థాన్‌కు కర్రలోడుతో వెళ్తున్న లారీ అతివేగంతో వెళ్తూ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న అభిలాష్ బైక్‌ను ఢీకొట్టి ఈడ్చుకెళ్లింది. ఈ ప్రమాదంలో అభిలాష్ ఎడమకాలు తొంటి వరకు నుజ్జునుజ్జు కాగా, పలుచోట్ల తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన ఆస్పత్రికి తరలించి అక్కడి ను ంచి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి కాలును తొలగించేందుకు సిద్ధపడ్డారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంతోనే ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.



లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో నుజ్జు నుజ్జుగా మారిన అభిలాష్ కాలు

జూలై 1 నుంచి ఎస్డీఎల్‌సీఈ సైకాలజీ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూన్ 21: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్సీ సైకాలజీ ఫైనల్ ఇయర్-2023 వార్షిక పరీక్షలు జూలై 1 నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 1, 3, 5, 8 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. వర్సిటీ క్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాలలో పరీక్షల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. జూలై 9 నుంచి 14 వరకు ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 మొదటి సెషన్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని గ్రూపుల వారిగా కేటయించిన సమయంలో పరీక్షలకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

ఎంపీపీ తిరుపతిరెడ్డిపై మరో కేసు

శాయంపేట, జూన్ 30: ఎంపీపీ మెతుకు తిరుతిరెడ్డిపై మరో చీటింగ్ కేసు నమోదైంది. పాస్‌బుక్‌లో భూమి వివరాలు ఎక్కిస్తానని ఓ వ్యక్తి వద్ద డబ్బులు వసూలు చేసి మోసం చేసిన ఘటనలో ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ ప్రమోద్‌కుమార్ కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన చిలుకల సమ్మయ్యకు నేరేడుపల్లి రెవెన్యూ పరిధిలో 4.32 గుంటల భూమిలో 2.12 గుంటల భూమి పాస్ బుక్‌లో ఎంట్రీ ఉంది. మిగతా భూమి ఎంట్రీ కాలేదని తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి తనకు రూ.50 వేలు ఇస్తే మిగతా భూమి పాస్‌బుక్‌లో ఎక్కిస్తానని నమ్మబలికాడు. ఈ క్రమంలో సమ్మయ్య అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి వేణు అనే వ్యక్తి ద్వారా ఎంపీపీకి రూ.50 వేలు ఇచ్చాడు. మూడు సంవత్సరాలు గడిచినా బుక్‌లో భూమి వివరాలు ఎక్కించలేదు. తన డబ్బులు తిరిగి ఇవ్వాలని సమ్మయ్య ఎంపీపీని ఎన్నిసార్లు అడిగినా కాలం గడుపుతూ వస్తున్నాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి వేణులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇటీవల మండలంలోని ఓ వ్యక్తికి దళిత బంధు కోసం ఎంపీపీ రూ.లక్ష వసూలు చేశారనే ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేయగా రిమాండ్ విధించారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న ఎంపీపీపై మరో కేసు నమోదు కావడం మండలంలో చర్చనీయాంశమైంది.

నామినేటెడ్ పదవి దక్కేనా?

(5వ పేజీ తరువాయి)

పని చేశారు. వీరికి కూడా నామినేటెడ్‌లో న్యాయం చేస్తారనే ఆశతో ఉన్నారు. ఇక పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సిరెడ్డి నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే ఎంపీ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి అధిష్ఠానం సూచనలతో కావ్యకు మద్దతుగా నిలిచిన స్టేషన్‌ఘనపూర్‌కు చెందిన శనిగపురం ఇందిరకు, జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి నామినేటెడ్ పోస్టులు ఖాయంగా ప్రచారం జరుగుతోంది. అలాగే మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, నమిండ్ల శ్రీనివాస్, కె.రవళిరెడ్డికి కూడా కీలకమైన పోస్టు దక్కుతుందని ప్రచారం ఉంది. అలాగే భూపాలపల్లి జిల్లాకు చెందిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్ అలియాస్ ఐతూ పరకాల టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించారు. అయితే పార్టీ అదేశాల మేరకు తప్పుకుని భూపాలపల్లి, పరకాల, ములుగు అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశారు. అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించింది. అయితే అశోక్‌కు కీలకమైన నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని మంత్రి సీతక్కతోపాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. అలాగే పరకాలకు చెందిన సీనియర్ నేత, సీఎంకు అత్యంత సన్నిహితుడిగా పేరున్న మార్క విజయ్‌కుమార్‌కు సైతం నామినేటెడ్ పదవి దక్కుతుందనే చర్చ సాగుతోంది. అలాగే మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవుల కోసం మీసాల ప్రకాష్, నల్లగొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్ తదితర నేతలు ఆశతో ఉన్నారు. అలాగే మరో మంత్రి సీతక్క ప్రాతినిధ్యం వహిస్తున్న ములుగు నుంచి కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితర నేతలకు నామినేటెడ్ పదవులు వస్తాయనే చర్చ జరుగుతోంది. నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాల నుంచి పదవులు ఆశిస్తున్నవారి సంఖ్య డజనుకు పైగా ఉంది. రానున్న రెండు, మూడు నెలల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాస్థాయి పోస్టులను కూడా భర్తీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, ఎంపీపీ పదవులపై ఆశలు లేని నేతలు.. జిల్లా స్థాయి నామినేటెడ్ పదవుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ చైర్మన్ లాంటి పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టిసారిస్తున్నారు. వీటితోపాటు కార్పొరేషన్‌లకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవులు కూడా ఉండటంతో వాటిలో ఏదో ఒకటి రాకపోతుందా? అనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉండి పార్టీని కాపాడుకుంటూ వస్తున్నవారికి నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశాలు వస్తాయనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

అనధికారిక రేషనలైజేషన్‌ను

సత్వరమే నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 30: రాష్ట్రంలో విద్యాశాఖాధికారులు చేపడుతున్న అనధికారిక రేషనలైజేషన్‌ను సత్వరమే నిలిపివేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యసర సమావేశంలో భోగేశ్వర్ మాట్లాడారు. గ్రామానికో పాఠశాలను తెరుస్తామని, ఓ ఒక్క ప్రభుత్వ పాఠశాలను మూసివేయమని ముఖ్యమంత్రి చెబుతుంటే అందుకు విరుద్ధంగా విద్యాశాఖాధికారులు వ్యవహరించడాన్ని ఆయన తప్పుబట్టారు. ముఖ్యమంత్రి మాటలను హామీలకే పరిమితం చేస్తారా? అని అధికారులను ఆయన ప్రశ్నించా రు. ఎస్టీటీ, తత్సమాన బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువ గా ఉందనే సాకుతో ఉన్న పోస్టులను దాచిపెట్టడాన్ని ఆయ న ఖండించారు. సరిపడా ఉపాధ్యాయులు లేకుండా పిల్లలెలా వస్తారని ప్రశ్నించారు. తల్లిదండ్రులకు విశ్వాసం కలిగే విధంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం బలోపే తం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన పదోన్నతుల్లో సైతం విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో అధికారులు ఉన్న ఖాళీలను దాచిపెట్టారని ఆరోపించారు. అధికారులను అడ్డు పెట్టుకొని ప్రభుత్వం దొంగచాటుగా చేపడుతున్న రేషనలైజేషన్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ పోస్టుల అనధికారిక రేషనలైజేషన్‌ను టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. బదిలీల వెబ్ ఆప్షన్లకు మరో రోజు గడువు పొడిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, పి.మనోజ్, ఉపాధ్యక్షుడు జె.స్వామి, కార్యదర్శి బుచ్చాచారి, నాయకులు ఈ.వీరస్వామి, జి.లక్ష్మీపతి, బి.పూర్ణచందర్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో మహిళ

ఆస్పత్రికి తరలించి, విచారణ చేపట్టిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్, జూన్ 30 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివార్లలోని నిర్మానుష ప్రదేశంలో వివాహిత (25) అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఆ వెంటనే ఆమెను జిల్లా ప్రధానఆస్పత్రికి తరలించి చికిత్సనందిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన వివాహితగా ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. గత కొద్దికాలం కిందట భారాభర్తల మధ్య భేదాభిప్రాయాలు రావడంతో ఆమె ఒంటరిగానే జీవిస్తున్నట్లు తెలుస్తోంది. ఆమెను మహబూబాబాద్‌కు ఎవరు తీసుకువచ్చారు.? ఎలా వచ్చింది! ఇల్లందు రోడ్డులోని క్రషర్ మిల్లు సమీపంలోని నిర్మానుష ప్రదేశంలో అపస్మారక స్థితిలో ఎందుకు పడి ఉంది అనేది తెలియాలంటే ఆమె స్పృహలోకి వచ్చిన తర్వాతే వెల్లడిస్తామని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు విలేఖరులకు చెప్పారు.

అటకెక్కిన అల్పాహారం

- పాఠశాలలు ప్రారంభమై 17 రోజులు గడుస్తున్నా ఇంకా ప్రారంభం కాని అల్పాహారం
- ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు లేవంటున్న అధికారులు
- నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లోనే..



వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 30: పాఠశాల విద్యార్థులకు గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన అల్పాహార కార్యక్రమం అటకెక్కింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గత ఏడాది అక్టోబర్‌లో పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందజేసేందుకు ప్రతిష్టాత్మకంగా రూపొందించిన కార్య క్రమం ప్రస్తుతం ప్రభుత్వంలో రూపం లేకుండా పోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేద విద్యార్థులకు, ఉదయాన్నే ఖాళీ కడుపుతో వచ్చే విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే పాఠశాలలు ప్రారంభమై 17రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు మాత్రం పాఠశాలల్లో అల్పాహారం కార్యక్రమం ప్రారంభమే కాలేదు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కాకుండా దశల వారిగా ఎంపికచేసిన పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రమే అల్పాహారాన్ని అందజేశారు. వరంగల్, హనుమకొండ, నర్సంపేట, తదితర పట్టణప్రాంతాల్లోని పాఠశాలల్లో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులే ఏర్పాటు చేశారు. గత విద్యా సంవత్సరానికి సంబంధించిన డిసెంబర్ నుంచి మార్చి వరకు అల్పాహారం బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమం ప్రారంభం చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదని, ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు.

ఖాళీ కడుపుతోనే..

అల్పాహార కార్యక్రమం పేద పిల్లలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు వెళ్లే తల్లిదండ్రుల పిల్లలకు ఉపయుక్తంగా ఉండేది. ఇప్పుడు పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమం నిలిపివేయడంతో అలాంటి విద్యార్థులు ఖాళీ కడుపులతోనే మధ్యాహ్నం వరకు చదువుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుతుండటం వారికి అల్పాహారం అత్యవసరం అనే అభిప్రాయాలు వ్యక్తం అందుతున్నాయి.

అల్పాహారం.. బలవర్ధకం..

పాఠశాల విద్యార్థుల పెరుగుదలకు, చురుకుదనానికి అవసరమయ్యే బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందనే అభిప్రాయాలను న్యూట్రిషనలిస్టులు చెబుతున్నారు. నిపుణుల సూచనలతోనే అల్పాహార మెనూను సైతం అధికారులు రూపొందించారు. మిల్లెట్ ఉప్మా, ఇడ్లీ సాంబారు తదితర పౌష్టికాహార పదార్థాలతో మెనూను రూపొందించారు.

నాలుగు నెలల బిల్లులు పెండింగ్‌లోనే..

గత విద్యా సంవత్సరానికి సంబంధించిన నాలుగు నెలల అల్పాహార బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. వరంగల్ జిల్లాలో డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చికి చెందిన రూ.66 లక్షల 32వేల బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇక హనుమకొండ జిల్లాలో సైతం నాలుగు రూ.25 లక్షల 51 వేల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఇలా..

వరంగల్ జిల్లాలో దశల వారిగా మొత్తం 95 పాఠశాలల్లో సుమారు 8 వేల మంది విద్యార్థులకు సీఎం బ్రేక్‌ఫాస్ట్ అమలు చేశారు. ఇందులో 35 పాఠశాలల్లో అక్షయ పాత్ర ఫౌండేషన్ వారు బ్రేక్‌ఫాస్ట్ అందజేయగా, మిగతా 60 పాఠశాలల్లో సంబంధిత పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజన కార్మికులు అందజేశారు. ఇక హనుమకొండ జిల్లాలో మొత్తం 60 పాఠశాలల్లో సుమారు 6,500మంది విద్యార్థులకు అల్పాహారం అందజేశారు. వీటిల్లో 10 పాఠశాలల్లో అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా అందజేయగా, మిగతా 50 పాఠశాలల్లో సంబంధిత మధ్యాహ్న భోజన కార్మికులే అందజేశారు.

అల్పాహారాన్ని అందజేయాలి..

పాఠశాలల్లో అల్పాహార కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని న్యూట్రిషన్ నిపుణులతో పాటు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే మంచి కార్యక్రమ ప్రారంభంపై ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు అందజేస్తాం..

అల్పాహారం ప్రారంభంపై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలుగాని, మార్గదర్శకాలు గాని రాలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని రెండు జిల్లాల విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దశలవారిగా పాఠశాలల్లో అల్పాహారం అందజేశాము. ప్రభుత్వం అల్పాహారంపై ఏవైనా ఉత్తర్వులు జారీ చేస్తే వాటికి అనుగుణంగా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

పనిచేయని హెచ్‌డీఎస్‌లు

- నిధులలో కోత
- రూ 1.70 లక్షల నుంచి రూ.80 వేలకు తగ్గింపు
- పీహెచ్‌సీలకు కరవవుతున్న మౌలిక సదుపాయాలు
- రోగులకు అందని మెరుగైన వైద్యం

హనుమకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ)లకు ఇచ్చే నిధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోత పెడుతున్నాయి. మూడేళ్లుగా ఈ నిధుల మొత్తం తగ్గుతూ వస్తోంది. దీంతో పీహెచ్‌సీల నిర్వహణ కష్టంగా మారుతోంది. నిధుల లేమి వల్ల వాటిల్లో మౌలిక సదుపాయాలను కల్పించలేని దయనీయ స్థితి నెలకొని ఉన్నది. పీహెచ్‌సీ భవనాలకు కనీస మరమ్మతులు సైతం చేయలేని దుస్థితి. దీంతో అవి క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటు న్నాయి. భవనంపై కప్పులు ఊడి పడిపోతున్నాయి. పీహెచ్‌సీల్లోని మరుగుదొడ్లు, మూత్రశాలలకు ఏవైనా మరమ్మతులు చేయాల్సి వస్తే వాటిని ఎప్పటిప్పుడు చేయలేకపోతున్నారు. కనీసం చెడిపోయిన ఫ్యాన్లను మరమ్మతులు చేసే దిక్కులేదు. ఇక వైద్య పరికరాల పరిస్థితి మరీ దారుణం. సాంకేతిక లోపాలు ఏర్పడి సరిగా పని చేయలేకపోవడంతో డాక్టర్లు, సిబ్బంది తరుచూ ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

తగ్గుతున్న నిధులు

పీహెచ్‌సీలకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) నిధులుగా ఒక్కోదానికి గతంలో ఏటా 1.50లక్షల నుంచి రూ.1.75లక్షల వరకు వచ్చేవి. స్థానిక ఎంపీపీ అధ్యక్షతన అభివృద్ధి కమిటీ సమావేశమై ఆమోదించిన తీర్మానాల మేరకు ఈ నిధులను అవసరాల ప్రాతిపదికగా ఖర్చు చేసేవారు. కానీ గత రెండు, మూడేళ్లగా హెచ్‌డీసీ నిధుల మొత్తం తగ్గుతూ వస్తోంది. ఈ నిధుల మొత్తాన్ని రూ.1.50 లక్షల నుంచి రూ.1లక్షకు తగ్గించారు. ఆతర్వాత మరింతగా రూ.80వేలకు తగ్గింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 67 పీహెచ్‌సీలు పని చేస్తున్నాయి. హనుమకొండ జిల్లాలో 17, వరంగల్ జిల్లాలో 17, జనగామ జిల్లాలో 16, మహబూబాబాద్ జిల్లాలో 21, ములుగు జిల్లాలో 15, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 13 ఉన్నాయి. వీటికి గతలో ఏటా రూ.1.17 కోట్ల వరకు హెచ్‌డీసీ నిధులు వచ్చేవి. ఇప్పుడు సగానికి సగం తగ్గిపోయి రూ.53లక్షల వరకు వస్తున్నాయి. అవి కూడా సకాలంలో రావడం లేదు. ఈ నిధుల్లో కేంద్రం తన వంతువాటాగా 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా 40 శాతం కలిపి విడుదల చేయాల్సి ఉంటుంది. గత మూడేళ్లగా శానిటేషన్ (అన్‌టైడ్) నిధులూ నిలిచిపోయాయి. ఆస్పత్రులకు ప్రభుత్వం నుంచి సరిపడా నిధులు మంజూరు కాకపోవడంతోనే సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆయా వైద్యాధికారులు, కమిటీ చైర్మన్లు చెబుతున్నారు.

పట్టించుకోని హెచ్‌డీసీలు

ఆస్పత్రులకు వచ్చే రోగులకు స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించడంతోపాటు దవాఖానాను మెరుగ్గా నిర్వహించేందుకు ఉద్దేశించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు (హెచ్‌డీఎస్)లు ఉమ్మడి జిల్లాలో పని చేయడం లేదు. సామాజిక ఆస్పత్రులకు ఎమ్మెల్యేలు, జిల్లా ఆస్పత్రులకు కలెక్టర్లు, జడ్పీ చైర్మన్లు అధ్యక్షులుగా ఉంటారు. ఆస్పత్రుల్లో ఏ పని చేయలేని దుస్థితి నెలకొంది. రాబోయేది వర్షాకాలం. వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంది. ఆస్పత్రులు మాత్రం నామమాత్రంగా మారాయి.


ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సమావేశాలు ఏవీ?

అస్పత్రి అభివృద్ధి కమిటీలు మూడు నెలలకోసారి సమావేశం కావాలి. కానీ ఎక్కడా అలా జరగడం లేదు. ఆస్పత్రుల్లో సరిపడా పడకలు, నీరు, తాగునీరు, ఫ్యాన్లు లేవు. పారిశుధ్యం అధ్వాన్నంగా మారుతోంది. కొన్ని ఆస్పత్రులు పాతభవనాల్లోనే ఇంకా నడుస్తుండడంతో వాటి పెచ్చులు ఊడుతున్నాయి. వర్షం వస్తే పైకప్పు నుంచి నీళ్లుకారి ఆస్పత్రులు జలమయమవుతున్నాయి. రోగులు పడుకునే పడకలపైనే ఉరుస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్యలను విన్నవించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. స్థానిక ఎంపీపీలు ఆస్పత్రులకు చైర్మన్లుగా వ్యవహరిస్తారు. వారి పదవీకాలం సైతం ఈ నెలతో పూర్తవుతోంది. ఆ వెంటనే ప్రాదేశిక ఎన్నికలు జరిగే సూచనలు కనిపించడం లేదు. డిసెంబర్‌లో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అప్పటివరకు పీహెచ్‌సీల హెచ్‌డీసీలకు అధ్యక్షులు లేని పరిస్థితి ఏర్పడనున్నది.

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భార్య మృతి, భర్త పరిస్థితి విషమం


మృతురాలు బానోత్ నీలమ్మ

నెల్లికుదురు, జూన్ 30: అవమానం భరించలేక దంపతులు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేయగా.. భార్య మృతి చెందగా, భర్త పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి శివారు పెద్దతండాలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై క్రాంతికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దతండాకు చెందిన బానోత్ నీలమ్మ (36), అదే తండాకు చెందిన బానోత్ వీరన్న మధ్య వివాహేతర సంబంధం ఉంది. శనివారం రాత్రి వీరన్న తండాలోని నీలమ్మ ఇంటికి వెళ్లి ఆమెను బలత్కారం చేయడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో వీరన్నతో నీలమ్మ భర్త భద్రు గొడవ పడ్డాడు. దీంతో అవమానం భరించలేక నీలమ్మ ఇంట్లో ఉన్న పురుగులమందు తాగగా, వెంటనే భర్త భద్రు సైతం అదే పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. నీలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, భద్రును మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు సోదరుడు బాదావత్ కిషన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నీలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

ఆత్మకూరు, జూన్ 30 : రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలైన సంఘటన ఆదివారం మండలంలోని నీరుకుల్ల క్రాస్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్‌కు చెందిన యువకులు సంపత్, వినయ్‌లు ద్విచక్రవాహనంపై ములుగు జిల్లాలో పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నీరుకుళ్ల క్రాస్ వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కారును ఢీకొనడంతో సంపత్, వినయ్‌లకు గాయాలయ్యాయి. 108లో ఎంజీఎంకు తరలించారు.

ఇసుక లారీ బోల్తా..

మండలంలోని కటాక్షాపూర్ శివారులో ఆదివారం తెల్లవారుజామున ఇసుక లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా నుంచి ఇసుక లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ కటాక్షాపూర్ శివారులో అదుపు తప్పి బోల్తా పడింది.ఈ ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

భూ తగాదాలలో

ఎస్‌ఐ జోక్యం

- వ్యక్తిని చితకబాదిన వైనం.. అతడిపైనే కేసు
- శాయంపేట పీఎస్‌లో ఘటన


వివరాలు వెల్లడిస్తున్న బాదితుడు లక్కర్సు రమేష్

శాయంపేట, జూన్ 30: అన్నదమ్ముల మధ్య ఉన్న భూ తగాదాల విషయంలో ఎస్‌ఐ ఒకరిని ఇష్టం వచ్చినట్లు తిడుతూ చితకబాదగా బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో సొమ్మసిల్లి పడి పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు బాధితుడిపైనే కేసు నమోదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మాందారి పేట గ్రామానికి చెందిన లక్కర్సు రమేష్‌కు, తన తమ్ముడైన మొగిలి మధ్య కొన్నేళ్లుగా భూ తగాదాలు ఉన్నాయి. ఇటీవల మొగిలి.. తన అన్న రమేష్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో రమేష్ కూడా తమ్ముడిపై ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ ప్రమోద్‌కుమార్ భూమిని పరిశీలించి వెళ్లారు. అనంతరం ఈ నెల 26న ఎస్‌ఐ రమేష్‌ను పోలీసుస్టేషన్‌కు పిలిచాడు. రమేష్ రాగా, ఎస్‌ఐ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడి చేశాడు. దీంతో రమేష్ సొమ్మసిల్లిపడిపోయాడు. ఈ క్రమంలో కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ రమేష్‌ను ఎస్‌ఐ ముద్దుకేసి గంట వరకు అలానే ఉంచారు. తర్వాత బయటకు వచ్చిన రమేష్ స్థానికంగా చికిత్స చేయించుకున్నాడు. అయితే ఏళ్లుగా తనకు అనారోగ్యం ఉందని, అకారణంగా ఎస్‌ఐ ప్రమోద్ కుమార్ తనపై దాడి చేశాడని బాధితుడు కన్నీటిపర్యం తమయ్యా రు. కాగా, ఈ ఘటనపై ఎస్‌ఐ ప్రమోద్‌ను వివరణ కోరగా.. మొగిలి ఫిర్యాదుతో రమేష్‌ను స్టేషన్‌కు పిలిచామని తెలిపారు. బెదిరించానే తప్ప కొట్టలేదన్నారు. ఇదిలా వుండగా, లక్కర్సు రమేష్ తన తమ్ముడైన మొగిలి భూమిలోకి అక్రమంగా ప్రవేశించి దున్నాడని కేసు నమోదైంది. ఈ మేరకు ఈ నెల 17న మొగిలి ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

బడి బస్సులపై తనిఖీలేవి?

● ఫిట్‌నెస్ లేకున్నా రోడ్లపై ప్రయాణం ● విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ● దృష్టి సారించని ఉన్నతాధికారులు


డోర్ లేకుండా పిల్లలతో వెళుతున్న బస్సు

వరంగల్ క్రైం, జూన్ 30 : నిబంధనలు విస్మరించి రోడ్లపైన ప్రైవేటు పాఠశాలల, కళాశాలల బస్సులు తిరుగుతున్నాయి. ప్రైవేటు పాఠశాలల బస్సులు రవాణాశాఖ నిబంధనలు ఏమాత్రం పాటించిన దాఖలాలు కనిపించడం లేదు. హనుమకొండ జిల్లాలో ప్రైవేటు పాఠశాలల బస్సులు 1200 వరకు ఉన్నాయి. ఈ బస్సులు యేటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 15తో గత సంవత్సరం ఫిట్‌నెస్ ముగియగా 2024-25 గాను ప్రతీ బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకున్నాకే రోడ్లపైకి రావాలి. పదమూడు రోజుల్లో 70శాతం బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తీసుకున్నట్లు సమాచారం. మిగతా బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే పిల్లలను పాఠశాలలకు తరలిస్తున్నారు. ఫిట్‌నెస్ ఇచ్చే ఆర్టీఏ అధికారులు బస్సుల కండీషన్ చూడకు ండానే సర్టిఫికెట్స్ జారీ చేస్తున్నారనే విమర్శలున్నాయి. అందినకాడికి దండుకుంటున్న కిందిస్థాయి అధికారులు.. బస్సులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.

నిబంధనలు విస్మరించి..

ప్రస్తుతం రోడ్లపై తిరుగుతున్న బస్సులను పరిశీలిస్తే ఆర్టీఏ అధికారుల చేతి వాటం స్పష్టంగా తెలుస్తోంది. బస్సులను పరిశీలించకుండానే వారిచ్చే ముడుపులు దండుకుని సర్టిఫికెట్ ఇస్తున్నట్లు కనిపిస్తోంది. నిబంధనల మేరకు బస్సు డ్రైవర్ 50 యేళ్ల వయస్సు దాటరాదు. బస్సులకు ఎమర్జెన్సీ డోర్ ఉండాలి, ప్రతీ బస్సుకు ఎంట్రెన్స్‌లో డోర్ తప్పనిసరిగా ఉండాలి, మెడికల్ కిట్, ఫైర్ సేఫ్టీ కిట్, హ్యాండ్‌బ్రేక్, డ్రైవర్ వివరాలు తప్పనిసరిగా ఉండాలి. ప్రతీ బస్సు సర్వీసు 15 యేళ్ల మించ కూడదు. ఈ నిబంధనలు పాటించే బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ చేయాలి. దీనికి భిన్నంగా శాఖ అధికారుల తీరుంటుంది. బస్సులను పరిశీలించకుండానే సర్టిఫికెట్స్ ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి.

పిల్లల ప్రాణాలతో చెలగాటం

పాఠశాలల యాజమాన్యాలు, శాఖ అధికారులు పిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారనే విమర్శలున్నాయి. నగరంలో తిరుగుతున్న బస్సులకు కనీసం ఎంట్రెన్స్‌లో డోర్ సైతం ఉండటం లేదు. డోర్ సమీపంలోని సీట్లో కూర్చునే పిల్లలు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నప్పటికీ పట్టించుకోకపోవడం విశేషం. బ్రేక్ వేస్తే పిల్లలు కింద పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. లోపల నిబంధనలు దేవుడెరుగు.. కనీసం డోర్‌లు ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. వాస్తవంగా పాఠశాలల ప్రారంభంలో బస్సులు తనిఖీలు చేయాలి. నిబంధనలు పాటించని బస్సులు సీజ్ చేయడం, జరిమానాలు వేయడం జరగాలి. నగరంలో బస్సులు తనిఖీలు చేసిన దాఖలు కనిపించదు. మొత్తంగా ప్రస్తుతం నగరంలో ఉన్న చాలా బస్సుల్లో ఎలాంటి సౌకర్యాలు లేకుండానే రోడ్లపైన తిరుగుతున్నాయి. ప్రమాదాలు జరిగాక హడావుడిపడడం కంటే ప్రమాదాలు జరుగకముందే ముందు జాగ్రత్తగా తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. నిబంధనలపై డ్రైవర్లకు, అవగాహన తరగతులు నిర్వహించామని తెలిపారు. నిబంధనలు విస్మరించి రోడ్లపైకి వస్తున్న బస్సులను సీజ్ చేస్తామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ తమ హక్కులు కాపాడుకోవాలి

- జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్


కేయూలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్, రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్, జూన్ 30: ప్రతి ఒక్కరూ తమ హక్కుల కాపాడుకోవాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సూచించారు. ఆదివారం కేయూ సెనెట్‌హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ స్టూడెంట్స్ మహాసేన నేతృత్వంలో సదస్సు జరిగింది. 'ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు- చట్టాలు' అనే అంశంపై జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ మాట్లాడారు. జాతీయ ఎస్సీ కమిషన్‌కు విస్తృతమైన అధికారులున్నాయని చెప్పారు. దళిత వర్గాలు తమ హక్కుల కాపాడటంలో తాము ముందుంటామని హామీ ఇచ్చారు. శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. క్యారెక్టర్ బిల్డింగ్‌తోనే ఏదైనా సాధ్యం అవుతుందని చెప్పారు. వరంగల్ నగరానికి గొప్పచరిత్ర ఉందన్నారు. ప్రొఫెసర్ బొబ్బిలి, డాక్టర్ పెండ్యాల వరవరరావు, బియ్యాల జనార్ధన్‌రావులాంటి అనేక మంది ఉద్యమనేతలను అందించిందని కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా హక్కులను కాపాడుకోవాలని పేర్కొన్నారు. వ్యవస్థను తప్పు పట్టవద్దని.. వ్యవస్థలో భాగమైన మనల్ని ప్రశ్నించుకోవాలని కోరారు. తల్లిదండ్రులు, గురువులు పెద్దలపై గౌరవం పెంచుకోవాలని అన్నారు. కేయూ నిధుల కొరత తీర్చేందుకు తన వంతుగా సహాయం చేస్తానని ప్రకటించారు. వర్సిటీలోని భూకబ్జాలపై విద్యార్థులు పోరాడాలని కోరారు. చట్టానికి లోబడి పనిచేయాలని, జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డాక్టర్ టి.రాజమణి, డాక్టర్ టి.జయరాం, ఆరెపల్లి రాజేందర్‌లు మాట్లాడారు. మంచి సదస్సును ఏర్పాటు చేసిన విద్యార్థులను అభినందించారు. నిట్ ప్రొఫెసర్ కోలా ఆనంద్‌కిశోర్, కేయూ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, గాదేపాక అనిల్, గజ్జి దయాకర్, కేతవత్ కుమార్ పాల్గొన్నారు.

కేయూను సందర్శించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు

కాకతీయ యూనివర్సిటీని ఆదివారం జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ సందర్శించారు. కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ కేయూ పరిపాలన భవనం ఎదుట సాదరంగా ఆహ్వానం పలికి పుష్పగుచ్ఛం అందచేశారు. అంతకుముందు కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వర్సిటీలో తాజా పరిస్థితులపై చర్చించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.రాజమణి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ప్రణయ్‌కుమార్ పాల్గొన్నారు.

న్యూరో సేవలు నిల్!

● సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో దక్కని వైద్య సేవలు ● గతంలో నిత్యం సర్జరీలు.. రెండు నెలలుగా జీరో సర్జరీలు


వరంగల్ మెడికల్, జూన్ 30: ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎంతోపాటు కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సేవలు మిథ్యగా మారిపోయాయి. పేద రోగులకు న్యూరో సర్జరీ సేవలు అందని ద్రాక్షగానే ఉంటున్నాయి. ఉన్నతాధికారుల ఉదాసీనత పేద రోగులకు శాపంగా మారుతోంది. ఇక అత్యవసర కేసులు అయితే ఆగం కావాల్సిన పరిస్థితి నెలకొంది.

మూతపడ్డ థియేటర్

కాకతీయ వైద్య కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రెండు నెలలుగా న్యూరో సర్జరీ విభాగం థియేటర్ మూతపడి ఉంది. ఆపరేషన్లు చేసేవారు లేక.. న్యూరో సర్జరీ రోగులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం హెచ్‌వోడీ చేసిన సర్జరీలన్నీ విఫలం అవుతున్నాయని రోగులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం 39 రోగులు న్యూరో సర్జరీ కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో న్యూరో సర్జరీలు ప్రతీ నెల 50 వరకు జరిగేవని గణాంకాల ద్వారా తెలుస్తోంది. నడుము, మెదడు సంబంధించిన సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. అప్పటి డాక్టర్ అసోసియేట్ పదోన్నతిపై బదిలీ కావడంతో సర్జరీలన్నీ కుంటుపడ్డాయని అంటున్నారు.

పోస్టులు పెంచాలి..

న్యూరో సర్జరీ విభాగంలో ప్రస్తుతం ఒక హెచ్‌ఓడీతోపాటు అసిస్టెంట్ ప్రొఫెసర్ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఒక్క ఎస్సార్‌తోపాటు కొందరు పీజీలు ఓపీ సేవలు అందిస్తున్నారు. 200 మంది ఓపీ రోగులు సేవల కోసం ఆస్పత్రి వచ్చేస్తున్నారు. రోగుల సంఖ్య అనుగుణంగా న్యూరో వైద్యుల సంఖ్యల పెంచాలని రోగులు డిమాండ్ చేస్తున్నారు.



కేఎంసీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలోని న్యూరో సర్జరీ విభాగం

అవసరం లేని చోట వైద్యులు

మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, మంచిర్యాల లాంటి జిల్లా ఆస్పత్రుల్లో న్యూరో సర్జరీ వైద్యులు కొనసాగుతున్నారు. అయితే ఇక్కడ ఆపరేషన్ థియేటర్లు, సర్జరీ పరికరాలు లేకున్నప్పటికీ న్యూరో సర్జరీ వైద్యులు కొనసాగుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవసరం ఉన్న చోట న్యూరో సర్జరీ వైద్యులను నియమించాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో సీడ్ బాల్స్‌ను విసురుతున్న కెనరా బ్యాంక్ ఆఫీసర్లు

ఘనంగా సీడ్ బాల్స్ ఫెస్ట్

వడ్డెపల్లి, జూన్ 30: హనుమకొండ ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ రీజియన్ ఆధ్వర్యంలో ఆదివారం సీడ్ బాల్స్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్ ప్రాంతంలో 5 వేల మొక్కలను నాటడంతో పాటు సీడ్ బాల్స్‌ను విసిరారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ హనుమకొండ రీజియన్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లింగారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేలోత్ రవి, విక్రమ్‌రాజ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో బల్దియా కమిషనర్ దంపతులు



వేయిస్తంభాల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ దంపతులు

హనుమకొండ కల్చరల్, జూన్ 30: చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే దంపతులు ఆదివారం సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ కమిషనర్ దంపతులను సాదరంగా స్వాగతించి తొలుత ఉత్తిష్ట గణపతిని దర్శింపజేశారు. అనంతరం రుద్రేశ్వరుడి సన్నిధిలో అర్చన నిర్వహింపజేశారు. ఆలయ నాట్యమండపంలో స్వామివారి శేషవస్త్రాలు అందజేసి వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఆలయ ముందు భాగంలోని కుడా గార్డెన్ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి కాంట్రాక్టర్‌కు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గోధుమల ప్రేమ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

కాజీపేట, జూన్ 30: కాజీపేట 47వ డివిజన్‌కు చెందిన మన్విత, కృపావర్షిని అనే పేద విద్యార్థులకు ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పరంగా పేద విద్యార్థులకు సహకారం అందిస్తానన్నారు ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, నాయకులు సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, బర్ల రాజ్ కుమార్, దొంగల కుమార్, భూషపాక శ్రీనివాస్, జేరుపోతుల వెంకటేశ్, మాతంగి స్వామి, పోగుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలే..



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ఈవీ శ్రీనివాస్‌రావు

సుబేదారి, జూన్ 30: రక్తదాతలు ప్రాణదాతలతో సమానమని, తలసేమియా పిల్లల కోసం రక్తదానం చేయడానికి ప్రతీ ఒక్కరు ముందుకు రావాలని రెడ్‌క్రాస్ సొసైటీ పాలక మండలి స్టేట్ మెంబర్ ఈవీ శ్రీనివాస్‌రావు అన్నారు. హనుమకొండ ఎన్జీవోస్‌కాలనీ రోడ్డులోని ఇందిరానగర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల కోసం ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానంతో తలసేమియా బాధితులకు పునర్జన్మ ఇవ్వొచ్చని అన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా పాలక మండలి సభ్యులు బిల్ల రమణారెడ్డి, డాక్టర్ మొహ్మద్ తహీర్ మసూద్, కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు జనార్ధన్‌రెడ్డి, తేళ్ల కిశోర్, తేళ్ల సుగుణ పాల్గొన్నారు.

ఇక పల్లెల్లో ‘మీ సేవ’!

మహిళా శక్తి పథకం కింద అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు

మహిళా సంఘాలకు బాధ్యతలు.. ఇంటర్ చదివిన వారికి అప్పగింత

మొదటి విడతగా జిల్లాలో 31 గ్రామాలకు మంజూరు



హనుమకొండ కలెక్టరేట్, జూన్30: రాష్ట్రంలోని ప్రతీ గ్రామంలో మీ సేవ కేంద్రాలు ఉండాలని ప్రభుత్వం సంకల్పించింది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా నిలదొక్కుకునే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా హనుమకొండ జిల్లాల్లో మొదటి విడతగా ప్రభుత్వాదేశానుసారం జనాభా ప్రాతిపదికన 31 మీసేవ కేంద్రాలను నేషనల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (ఎన్ఐసీ) వారు ఎంపిక చేశారు. గతంలో ఉన్న 5మీసేవ సెంటర్లను కలుపుకుని జిల్లాలో 36 మీ సేవ కేంద్రాలు కానున్నాయి. మీ సేవ కేంద్రాలు మంజూరైన గ్రామాల్లో కేంద్రాల ఏర్పాటుకు ముందుకువచ్చే సంఘాలను ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. వచ్చే నెల ఆగస్టు 15వ తేదీ నాటికి వీటిని ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో మీ సేవ కేంద్రం ఏర్పాటుకు రూ.2.50లక్షల రుణాన్ని శ్రీనిధి ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేయనున్నట్లు సమాచారం.

పల్లె ప్రజలకు అందుబాటులో..

గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు లేకపోవడంతో గ్రామాల్లోని ప్రజలు ధృవీకరణ పత్రాలు, ఆధార్ సేవలు, ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవడానికి పట్టణాలు, నగరాలకు వెళ్లాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా గ్రామాల్లో మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. గ్రామ గ్రామాన మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తే పేద ప్రజలు పట్టణాలకు పోయే అవసరం ఉండదు. ఈ మీ సేవ కేంద్రాలు మంజూరైన గ్రామాల్లో ఉన్న గ్రామ పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాల, రైతు వేదిక, అంగన్‌వాడీ కేంద్ర భవనాలు, ప్రభుత్వ భవనాలలో ఏర్పాటు చేయనున్నారు.

ఇంటర్ చదివిన వారికి..

మీ సేవ కేంద్రం మంజూరైన గ్రామంలో కేంద్రం ఏర్పాటుకు ముందుకు వచ్చిన మహిళా సంఘంలోని ఇంటర్ చదివిన సభ్యురాలికి ఆపరేటర్ బాధ్యత ఇవ్వనున్నారు. కేంద్రం నిర్వహణ, సేవలపై మీ సేవ సంస్థ ద్వారా నెల రోజుల పాటు శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా మహిళా సంఘాలతో మీ సేవ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంటుంది. ఈ మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుముల మేరకు పారదర్శకమైన సేవలందించనున్నారు. మీ సేవ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా కేంద్రాలను పరిశీలిస్తారు.

మొదటి విడతగా 31

మొదటి విడతగా జిల్లాలోని 31 గ్రామాలకు మీ సేవ కేంద్రాలు మంజూరు చేశారు. గతంలో జిల్లాలోని భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో, ఎల్కతుర్తి మండలంలోని పెంచికలపేట, హసన్‌పర్తి మండలంలోని అనంతసాగర్, సీతంపేట, వేలేరు మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. పాతవి 5 కేంద్రాలతో కలిపి మొత్తంగా 36 మీ సేవ కేంద్రాలు మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల సభ్యులు నడపనున్నారు. ఆత్మకూరు మండలంలోని కటాక్షపూర్, మల్కపేట, పెద్దాపూర్ గ్రామాల్లో మీ సేవ కేంద్రాలు మంజూరయ్యాయి. దామెర మండలంలోని పులుకుర్తి గ్రామంలో, భీమదేవరపల్లి మండలంలోని గట్ల నర్సింగాపురం, మల్లారం, మాణిక్యాపూర్, వంగర గ్రామాల్లో, ధర్మసాగర్ మండలంలోని దేవునూరు, మల్లక్కపల్లి, ముప్పారం, సోమదేవరపల్లి గ్రామాల్లో, ఎల్కతుర్తి మండలంలోని గోపాల్‌పూర్, కేశవాపూర్, సూరారం గ్రామాల్లో, హసన్‌పర్తి మండలంలోని మడిపల్లి, మల్లారెడ్డిపల్లి, నాగారం గ్రామాల్లో, ఐనవోలు మండలంలోని కక్కిరాలపల్లి, పున్నేలు, వెంకటాపూర్ గ్రామాల్లో, కమలాపూర్ మండలంలోని భీంపల్లి, గూడూరు, వంగపల్లి గ్రామాల్లో, నడికూడ మండలంలోని చర్లపల్లి, నర్సక్కపల్లి గ్రామాల్లో, పరకాల మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో, శాయంపేట మండలంలోని గట్లకానిపర్తి, కాట్రపల్లి గ్రామాల్లో, వేలేరు మండలంలోని మల్లికుదుర్ల, పీచర గ్రామాల్లో మహిళా శక్తి కింద మీసేవ కేంద్రాలు మంజూరయ్యాయి.

మహిళా సంఘాలు వినియోగించుకోవాలి



మహిళా శక్తి పథకం కింద మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం మహిళా సంఘాలకు మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మొదట విడతగా జిల్లాలో 31 గ్రామాలను ఎంపిక చేసింది. పాతవి 5 కలుపుకుని జిల్లాలో 36 మీ సేవ కేంద్రాలు మంజూరయ్యాయి. వీటిని ఆగస్టు 15వరకు ప్రారంభిస్తాం. మహిళా సంఘంలోని సభ్యులకు ఇది మంచి అవకాశం.

- కె.నాగపద్మజ, డీఆర్‌డీవో, హనుమకొండ

మార్కెట్‌లో విచ్చలవిడిగా కల్తీ కందిపప్పు విక్రయం

అరికట్టేందుకు టెస్ట్ చెక్‌లు

వినియోగదారుల మండలి సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సీసీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి

హనుమకొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో ప్రస్తుతం పెద్ద ఎత్తున కల్తీ కందిపప్పు, కారంపొడి అమ్మకం అవుతున్నందువల్ల దీనిని అరికట్టేందుకు సర్వేలు, టెస్ట్‌చెక్‌లను, ఆహారకల్తీపై చైతన్య సదస్సులను నిర్వహించాలని ఆదివారం హనుమకొండలోని వినియోగదారుల మండలి కార్యాలయంలో జరిగిన రాష్ట్ర వినియోగదారుల మండలి కార్యవర్గ సమావేశంలో తీర్మానించారు. సమావేశానికి జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కందిపప్పు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో కొందరు వ్యాపారులు అందులో చౌకగా దొరికే బత్రి, బటానీని కలుపుతున్నారని తెలిపారు. అలాగే తాలు వి ంరపపొడికి సింథటిక్ కలర్లు కలుపుతున్నారన్నారు. వీటిని వినియోగించిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఈ దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా ఆహార కల్తీపై అవగాహన కార్యక్రమాలు, టెస్ట్ చెక్కులను నిర్వహించాలని కోరుతూ ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో హైకోర్టు న్యాయవాది ఎం.యశ్వంత్ కుమార్, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్, జిల్లా కార్యదర్శులు రావుల రంజిత్ కుమార్, ఎర్ర అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల దోపిడీపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు

హనుమకొండ టౌన్, జూన్30: విద్యను వ్యాపారంగా ఎంచుకొని విచ్చలవిడిగా అందినకాడికి దండుకుంటున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై దోపిడీపై విద్యార్థులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ (ఏఐకేఎఫ్) జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు పిలుపునిచ్చారు ఆదివారం హనుమకొండ లష్కర్‌బజార్‌లో భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర అధ్యక్షుడు వంగూరు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మోర్తాల చందర్‌రావు మాట్లాడుతూ.. విద్యాసంస్థలు వివిధ ఫీజుల పేరిట అడ్డూఅదుపు లేకుండా దోచుకుంటున్నాయని ఆవేదనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలకు పూనుకోవాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. గురుకులాల్లో సీట్ల సంఖ్య పెంచాలన్నారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలోత్ రాజేశ్ నాయక్, రంగస్వామి, సహాయ కార్యదర్శి చంద గణేశ్, రాష్ట్ర కమిటీ సభ్యులు సంజయ్, నగేశ్, వెంకట్ వీరబాబు, చంద్రకాంత్, రాకేశ్, వివిధ జిల్లాల నాయకులు మంగేశ్, రాజేశ్, వంశీ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి హేయమైన చర్య



ర్యాలీ నిర్వహిస్తున్న స్టూడెంట్ ఇస్లామిక్ నాయకులు

హనుమకొండ చౌరస్తా, జూన్30: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ దేశం జరుపుతున్న ఘోర అమానవీయ దాడులకు నిరసనగా స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఓ) వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి హనుమకొండలోని జక్రియా ఫంక్షన్‌హాల్ వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జక్రియా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐవో రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హఫీజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమకు తలదాచుకోవడానికి ఆశ్రయమిచ్చిన పాలస్తీనాపై ఇజ్రాయిల్ దేశం దాడులు చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. పాలస్తీనాలోని వృద్ధులు, పిల్లలు, మహిళలపై దాడులు చేయడంతో మృత్యువాతపడుతున్నారన్నారు. ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల పట్ల ప్రపంచ దేశాలు నోరు మెదపకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐవో వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఫహీముద్దీన్, జమాతే ఇస్లామిక్ తెలంగాణ అధ్యక్షుడు ముబాషిర్ జేఫర్, వరంగల్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ హన్నన్, గర్ల్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ తెలంగాణ అధ్యక్షురాలు మసీరా ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.

దోమలు, ఈగలతో రోగాలు

నగరంలో ఖాళీ ప్లాట్లలో వృద్ధి

ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం



ఖాళీ ప్లాట్లల్లో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, గడ్డి

కాళోజీ జంక్షన్, జూన్ 30: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో నగరంలోని రోడ్ల వెంట, ఇళ్ల ముందు గడ్డి పెరిగి అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఇళ్ల ముందు పరిసర ప్రాంత పరిశుభ్రతపై ప్రజలకు బల్దియా అధికారులకు పట్టింపు లేకుండా పోయింది. గడ్డి ఏపుగా పెరగడంతో ఆ గడ్డిపై ఇళ్లల్లోని చెత్త చెదారం వేయడంతో దుర్గంధం నెలకొని ఈగలు, దోమలు వృద్ధి చెందడానికి అనుకూలంగా ఉంటోంది. నగరంవాసులు ఇళ్ల ముందు, చుట్టుపక్కల పెరుగుతున్న గడ్డి మొక్కల తొలగింపుపై శ్రద్ధ పెట్టడం లేదు. బల్దియాకు తాము పన్నులు కడుతున్నామని రోడ్ల వెంట పరిశుభ్రంగా ఉంచే బాధ్యత అధికారులపైనే ఉంటుందని ఇళ్ల యజమానులు భావిస్తున్నారు. ఇంకా ఇళ్ల మధ్యలో అక్కడక్కడ ఇళ్లు నిర్మించకుండా ఖాళీగా ఉన్న ప్లాట్లల్లో విపరీతంగా గడ్డి, కలుపుమొక్కలు ఏపుగా పెరిగి అందరూ చెత్త చెదారం వేయడంతో దుర్గంధం వస్తోంది. ఖాళీ ప్లాట్లల్లో మొక్కలను తొలగించేందుకు ఆ ప్లాట్ల యజమానులకు నోటీసులు ఇవ్వాల్సిన కార్పొరేషన్ అధికారులు.. ఉదాసీనంగా వ్యవహరించడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొంటోంది. స్మార్ట్ సిటీగా పేరుగాంచిన నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

‘రైతుబంధు’ దుర్వినియోగం

ఆత్మకూరు, జూన్ 30: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ రైతు బంధు పథకాన్ని దుర్వినియోగం చేశారని డీసీవో నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రవీందర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిలుగా డీసీవో నాగేశ్వరరావు, నోడల్ అధికారి విజయ్‌భాస్కర్ రెడ్డి హాజరై రైతు బంధు పథకంపై రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గుట్టలకు, హైవేలకు రైతుబంధు వేసి రాష్ట్రాన్ని అప్పుల్లో నెట్టారని అన్నారు. సామాన్యులకు ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం 5-10 ఎకరాల లోపు చిన్న, సన్నకారు రైతు లకు ఇవ్వాలని సూచించారు.

రజకజాతి అభివృద్ధికి కృషి చేద్దాం..

ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

న్యూశాయంపేట, జూన్ 30: అన్నిరంగాల్లో వెనుకబడిన రజకజాతి అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య అన్నారు. న్యూశాయంపేట జంక్షన్‌లోని చాకలి ఐలమ్మ భవన్‌లో ఆదివారం రజక ఎంప్లాయీస్ వెల్ఫేర్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా జనరల్ బాడీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా బస్వరాజు సారయ్య హాజరై మాట్లాడారు. అనంతరం ఆర్ఈడబ్ల్యూఎస్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా కొమురవెల్లి, ప్రధాన కార్యదర్శిగా సమ్మయ్య, కోశాధికారిగా సోమయ్య, గౌరవ అధ్యక్షుడిగా సదానందం, కార్యనిర్వహణ కార్యదర్శిగా శోభన్ కార్యవర్గం ఎన్నికైంది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్30: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిదిలోని విద్యారణ్యపురి, కనకయ్య హోటల్, సాయి గణేశ్ కాలనీ, కేయూ పీఎస్, సీఆర్‌పీఎఫ్ క్యాంపు, హెచ్‌పీ గ్యాస్ గోదాం, పలివేల్పుల ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని నంది హిల్స్, జూపార్కు ఏరియా, హంటర్ హిల్స్, అర్క పాఠశాల ఏరియా, శ్రీరామ కాలనీ ఏరియా, విద్యుత్ నగర్, సహకార నగర్, పోస్టల్‌కాలనీ, డీఈవో ఆఫీస్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న కాలనీ వాసులు

మడికొండ, జూన్ 30 : మడికొండ అయోధ్యపురం రోడ్డు టీఎన్‌జీవోస్ కాలనీలో గత ప్రభుత్వ హయంలో ప్రారంభమైన అభివృద్ధి పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. కాలనీ వాసులు ఈ విషయాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఎమ్మెల్యే కాంట్రాక్టర్‌తో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఆదివారం కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేయడంతోపాటు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాలనీ అధ్యక్షుడు లింగాల సూరిబాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పాతికేళ్ల మధుర జ్ఞాపకం..



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1998-99 పూర్వ విద్యార్థులు

భీమారం, జూన్ 30: హసన్‌పర్తి మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో 1998-99 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలిసి గురువులు, స్నేహితులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రస్తుతం ఈ లోకంలో లేని గురువులకు, విద్యార్థులకు మౌన నివాళి పాటించారు. అనంతరం పాఠశాలలో చదువుకునే రోజుల్లో చేసిన అల్లరి, చిలిపి పనులను గుర్తు చేసుకుంటూ కష్టాలు, సమస్యలను మరిచిపోయారు. 25 ఏళ్ల వెనక్కి వెళ్లి పాఠశాల స్థాయిలో చేసిన విధంగా ఆడి పాడుతూ, సంబరాల్లో మునిగితేలారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి గురువుల ఆశీర్వాదం తీసుకున్నారు.

కెనాల్ మొరం తరలింపు



ధర్మసాగర్ మండల కేంద్రంలోని దక్షణ కాలువ మట్టిని తరలిస్తున్న దృశ్యం

ధర్మసాగర్, జూన్ 30: దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్ట్ కాలువ నుంచి మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని దక్షిణ కాలువ డీవన్ ఎలుకుర్తి, ధర్మసాగర్ శివారు నుంచి నిరంతరంగా మొరాన్ని తరలిస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం అందించినప్పటికీ ఎవరూ నోరు మెదపకపోవడం గమనార్హం. ప్రభుత్వ పరంగా కొన్నేళ్లనుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా అధికారుల అండతోనే మొరం రవాణా జరుగుతోందని మండలంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయం పై సంబంధిత అధికారులను వివరణ కోరగా పొంతన లేని సమాధానం చేబుతున్నారు.

లిటిల్ మాస్టర్ డైవర్

నీరంటే పిచ్చి... స్కూబా డైవింగ్ అంటే ఆసక్తి. అవే కైనా ఖరేకి ప్రపంచంలోనే అత్యంత పిన్నవయస్కురాలైన మాస్టర్ స్కూబా డైవర్‌గా గుర్తింపు తెచ్చిపెట్టాయి. సాహసాలకు వయసుతో పని లేదంటున్న ఈ పన్నెండేళ్ళ బెంగళూరు అమ్మాయి కథేమిటంటే...



"నీటి అడుగున నాకు ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి. చెప్పడానికి అనేక విశేషాలున్నాయి. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలీదు. వాతావరణం భయానకంగా ఉంటుంది, ఒక్కోసారి ఏదీ కనిపించదు. మనతో కలిసి డైవ్ చేసినవారు కనిపించకుండా పోవచ్చు. వాళ్ళకోసం వెతుకుతూ ఉండాలి. కొన్నిసార్లు చేపలు దాడి చేస్తాయి. "ఇంత రిస్క్ తీసుకొని, ఈ చిన్న వయసులో ఎందుకీ సాహసాలు?" అని ఎందరో అడుగుతూ ఉంటారు. "ఎందుకంటే... నీళ్ళంటే నాకు పిచ్చి. డైవింగ్ అంటే ఎనలేని ఆసక్తి. ఇక రిస్క్ అంటారా... రోడ్డు మీద నడిచి వెళ్తున్నప్పుడు కూడా ప్రమాదం జరగొచ్చు. అందరూ అన్ని వేళలా జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి" అని చెబుతుంది కైనా ఖరే. ఇటీవలే అండమాన్-నికోబార్‌లో 'మాస్టర్ స్కూబా డైవర్ సర్టిఫికేషన్ అందుకొని, అధికారికంగా 'మాస్టర్ డైవర్'గా గుర్తింపు పొందిన ఈ పన్నెండేళ్ళ అమ్మాయి స్వస్థలం బెంగళూరు. రెండేళ్ళ వయసులోనే కైనాకు ఆమె తల్లితండ్రులు స్విమ్మింగ్‌ను పరిచయం చేశారు. కైనాను అందరూ 'వాటర్ బేబీ' అని పిలిచేవారు. మా అపార్ట్‌మెంట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతను ఆమెకు పరిచయం చేశాం. అందులో మంచి ప్రావీణ్యం సంపాదించింది. రెండేళ్ళ కిందట... తనకు పదేళ్ళ వయసులో... మా కుటుంబం అండమాన్-నికోబార్ దీవుల పర్యటనకు వెళ్ళినప్పుడు... స్కూబా డైవింగ్ పరిచయం అయింది. అప్పటి నుంచీ ఆమెకు అదే లోకంగా మారిపోయింది" అని చెప్పారు కైనా తల్లి అన్షుమ. స్విమ్మింగ్ పూల్‌లో కాకుండా... సముద్రం జలాల్లో డైవ్ చెయ్యడం కాస్త భయంగానూ, సరదాగానూ అనిపించింది. స్కూబా డైవింగ్‌లో మరింత నైపుణ్యం కోసం ఇండోనేసియాలోని బాలిలో 'ఓపెన్ వాటర్ కోర్స్' చేశాను. అలాగే థాయిలాండ్‌లో 'అడ్వాన్స్‌డ్ ఓపెన్ వాటర్ కోర్స్ పూర్తి చేసి, సర్టిఫికెట్ అందుకున్నాను" అని చెబుతున్న కైనా అండర్‌వాటర్ ఫొటోగ్రఫీ, స్పెషలైజ్డ్ నిట్రోక్స్ డైవింగ్, రెస్క్యూ డైవర్ ట్రైనింగ్... ఇలా అనేక అంశాల్లో శిక్షణ పొందింది. "ఇవేవీ సాధారణమైన అంశాలు కావు. కేవలం రెండేళ్ళలోనే వాటన్నిటిలో కైనా నిష్ణాతురాలై... అనుభవజ్ఞులైన స్కూబా డైవర్లను ఆశ్చర్యపరచింది. స్కూబా డైవింగ్‌లో కోర్సులు చేస్తానని కైనా చెప్పినప్పుడు... మొదట్లో మేము సంకోచించాం. కానీ ఆమె పట్టుదలను చూసి... ప్రోత్సహించాం" అంటారు అన్షుమ.



సవాళ్ళకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి

స్కూబా డైవింగ్‌కు ఎంతో ధైర్యం, సమయస్ఫూర్తి కావాలి. భద్రతా ప్రోటోకాల్స్ కచ్చితంగా పాటించాలి. దానికి అనుగుణంగా కైమా తల్లితండ్రులు అన్ని జాగ్రత్తలూ తీసుకుంటారు. "నేను అండమాన్-నికోబార్ దీవులతో పాటు బాలి, మాల్దీవులు, థాయిలాండ్... ఇలా ఎన్నో ప్రాంతాల్లో డైవింగ్ చేశాను. ప్రతి ప్రదేశానికీ తనదైన విశిష్టత ఉంది. నీటి అడుగున ఉండే పర్యావరణ వ్యవస్థలన్నా, జీవులన్నా నాకు చాలా ఇష్టం. అన్నిటిన్నా సముద్రపు తాబేళ్ళు నాకు ఫేవరెట్. అవి భారీగా, అద్భుతంగా ఉంటాయి" అని అంటోంది కైనా. స్కూబా డైవింగ్‌లో ఆమె ప్రతిభ... అధికారికంగా 'మాస్టర్ డైవర్ టైటిల్' అందుకొనేలా చేసింది. అసాధారణమైన పరిజ్ఞానం, అంకితభావం, నైపుణ్యం ఉన్నవారికి ఈ టైటిల్ ఇస్తారు. తద్వారా 'ప్రపంచంలో తక్కువ వయసున్న మహిళా మాస్టర్ స్కూబా డైవర్‌'గా గుర్తింపును సైతం కైనా సొంతం చేసుకుంది. "సముద్రంలో ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కోవడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ప్రత్యేకించి అండమాన్-నికోబార్ దీవుల్లో వాతావరణం భయపెడుతుంది. వర్షాలు, తుపాన్లు హఠాత్తుగా ముంచుకొస్తాయి. అలాంటి వాతావరణంలో ఒకసారి ఒక డైవర్ నీళ్ళలోకి దూకి అపస్మారక స్థితికి చేరాడు. నేను అతన్ని బోట్ వరకూ ఈడ్చుకువచ్చాను. ఆ సంఘటన ఇప్పటికీ గుర్తొస్తూ ఉంటుంది" అంటున్న కైనా "మెరైన్ సైన్స్ చదవాలనేది నా కోరిక. ప్రపంచంలో వీలైన ప్రతిచోటా స్కూబా డైవింగ్ చెయ్యాలన్నది నా కల" అని చెబుతోంది.



వరుస సినిమాలు లేవు. కానీ కెమెరా లెన్సులు ఎప్పుడూ ఆమెపై ఎక్కుపెట్టే ఉంటాయి. టీవీ షోలకు గెస్ట్‌గా... హోస్ట్‌గా... అన్నిటికీ మించి ఫిట్‌నెస్ గురూగా... భిన్న పాత్రల్లో ఒదిగిపోయిన బాలీవుడ్ నటి **శిల్పాశెట్టి**. 'నా మది నియంత్రణలో నేను లేను. నా ఆధీనంలో నా మనస్సు ఉంటుంది. ఇదే నా ఆనందమయ జీవనానికి కారణం' అంటున్న శిల్ప... యాభై ఏళ్ల వయసులోనూ తరగని అందం... మైమరిపించే రూపంతో ఆకట్టుకుంటోంది.



శిల్ప సౌందర్యం

"ఎంత పని ఒత్తిడి ఉన్నా, ఎన్ని సమస్యలు చుట్టుముట్టినా, నన్ను మానసికంగా ఇంత దృఢంగా ఉంచుతున్నది భగవద్గీతలోని 'బంధురాత్మనస్తస్య యేనాత్మైవాత్మాన జితః... అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్' శ్లోకం. 'ఎవరైతే తమ మనస్సును జయిస్తారో అది వారికి మంచి మిత్రుడిగా ఉంటుంది. లేదంటే అదే వారికి శత్రువు అవుతుంది' అని దీని అర్థం. నా మనసు నా నియంత్రణలో ఉందని, దాని ఆధీనంలో నేను లేనని గుర్తు చేసుకోవడానికి రోజూ ఈ శ్లోకాన్ని బిగ్గరగా చదువుతా" అంటున్న శిల్ప క్రమం తప్పకుండా యోగా చేస్తుంది. క్లిష్టమైన యోగాసనాలతో కొన్ని వీడియోలు కూడా ఆమె విడుదల చేసింది. 'అలాగే శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి సంబంధం ఉంది. ప్రతి భావోద్వేగం శ్వాసతో ముడిపడి ఉంటుంది. ఒకవేళ మీరు శ్వాస లయను మార్చగలిగితే భావోద్వేగాన్ని కూడా మార్చవచ్చు' అంటుందీ బ్యూటీ.

'యోగా ప్రకారం శ్వాసకు, మానసిక ఆరోగ్యానికి అనివార్యమైన సంబంధం ఉంది. ఎందుకంటే ఒక వ్యక్తి శ్వాస అతడి మానసిక స్థితిని ప్రతిబింబిస్తుంది. శ్వాస మీద నియంత్రణ గలవారు ప్రశాంత చిత్తంతో ఉండగలరు. ప్రాణాయామం లాంటి శ్వాస సంబంధిత ప్రక్రియలు ఒత్తిడిని తగ్గించి, భావోద్వేగాల సమతుల్యతకు దోహదపడతాయి. అదేవిధంగా పలు యోగాసనాల భంగిమలు కూడా శ్వాసతో ముడిపడినవే. గురువుల పర్యవేక్షణలో సాధన చేస్తే ఆనందమయమైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పొందగలుగుతారు'... అనేది శిల్ప మాట. యోగాను దైనందిన జీవితంలో భాగం చేయాలనుకొనేవారు... 'తొలుత సులువైన ఆసనాలతో ప్రారంభించి, క్రమంగా శరీరానికి అవసరమైనవాటిని సాధన చేస్తూ పోవాలి. వ్యాయామాలను ఏదో తప్పనిసరిగా చేస్తున్నట్టు కాకుండా... వాటిని ఆస్వాదిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయి. వీటన్నిటితో పాటు పరిశుభ్రమైన సమతుల ఆహారం, జీవన శైలి కూడా ఎంతో ముఖ్యం. అప్పుడే మన శరీరం సంపూర్ణ ఆరోగ్యం సంతరించుకొంటుంది' అంటోందీ భామ.

వర్కవుట్ ఇలా...

ఇటీవల శిల్పాశెట్టి ఇన్‌స్టాలో ఫిట్‌నెస్‌కు సంబంధించి ఒక రీల్ పోస్టు చేసింది. అందులో సులువైనదీ, ఇంట్లోనే చేసుకోదగినవి, ప్రభావవంతమైనవి, అద్భుతమైన ఫలితాలను ఇచ్చే ప్లాంక్స్ చేసి చూపించింది. వాటిల్లో ఆర్మ్ ప్లాంక్, సైడ్ ఎల్బో ప్లాంక్, ఎల్బో ప్లాంక్ ఉన్నాయి. రోజుకు 15-20 చొప్పున మూడు సెట్లు చేస్తే చేతులు, భుజాలు, నడుము దగ్గర కండరాలు బలపడతాయని, ఇవి కేవలం ఇరవై నిమిషాల్లో ముగించగల వ్యాయామాలని చెప్పింది శిల్ప. అలాగే సేతు బంధాసన, విశుద్ధి చక్ర, అర్ధహలాసన, నవాసనాలను రోజువారీ యోగా సాధనలో చేర్చుకొంటే అద్భుత ఫలితాలు ఉంటాయంటోంది.

- శిల్పాశెట్టి వర్కవుట్స్ యోగా, కార్డియో, వెయిట్స్ కాంబినేషన్‌తో ఉంటాయి. శరీరాన్ని దృఢంగా, అపురూపంగా తీర్చిదిద్దుకోవడానికి ఆమె తన శరీరానికి సరిపడే కొన్ని వ్యాయామాలతో ఫిట్‌నెస్ మెనూ రూపొందించుకుంది.
- రోజూ ఉదయం ముప్ఫై నుంచి నలభై నిమిషాలపాటు యోగా
- తరువాత రన్నింగ్, జాగింగ్, స్విమ్మింగ్, సైక్లింగ్‌తో కూడిన కార్డియో
- బిగువైన, బలమైన కండరాల కోసం వెయిట్‌లిఫ్టింగ్, స్క్వాట్స్, లంగెస్, పుషప్స్

ఇదీ మెనూ...

బిడ్డకు జన్మనిచ్చిన తరువాత కూడా శిల్పాశెట్టి శరీరాకృతిలో ఎలాంటి మార్పు రాలేదు. అందుకు ఆమె పాటించే వ్యాయామ, ఆహార నియమాలే ప్రధాన కారణం. మొదలుపెట్టి వదిలేసేవాళ్లే ఎక్కువగా కనిపిస్తుంటారు. అలాంటివారికి భిన్నం శిల్ప. క్రమశిక్షణకు ఆమె అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఆమె మెనూలో పోషకాలు నిండిన సమతుల ఆహారం ఉంటుంది. జీవక్రియ చురుగ్గా ఉండటానికి ఒకేసారి కాకుండా చిన్న చిన్న విరామాల్లో కొద్ది మొత్తంలో తీసుకొంటుంది. తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆరోగ్యకరమైన కొవ్వు పదార్థాలు మెనూలో ఉంటాయి. ప్రాసెస్‌డ్, జంక్ ఫుడ్, కూల్‌డ్రింక్స్, ఇతర డ్రింక్స్‌కు పూర్తిగా దూరం. శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవడానికి తరచూ మంచినీళ్లు తాగుతుంది.

- ఉదయం 15 ఎంఎల్ అలోవెరా జ్యూస్, పది తులసి ఆకులు, బెల్లం, అల్లం జ్యూస్. తరువాత రెండు గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు.
- ఉదయం 8 గంటలకు బ్రేక్‌ఫాస్ట్‌లో మూడొంతుల నీళ్లు, ఒక వంతు పాలలో ఉడకబెట్టిన ఓట్స్/ మరగబెట్టిన పాలతో ముస్లీ/ వీట్ బ్రెడ్ టోస్ట్‌తో రెండు ఉడకబెట్టిన గుడ్లు, నానబెట్టిన బాదం.
- ఉదయం 9 గంటలకు బ్రౌన్ షుగర్‌తో టీ. గంట తరువాత బొప్పాయి, కర్బూజా, స్ట్రాబెర్రీ, నారింజ, ఐదు టేబుల్ స్పూన్ల యోగర్ట్ కలిపి ఒక బౌల్ నిండా ఫ్రూట్ సలాడ్.
- మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనంలో చికెన్/ గ్రిల్‌డ్ ఫిష్, ఉడకబెట్టిన కాయగూరలు, నెయ్యితో బ్రౌన్ రైస్. లేదంటే ఉడకబెట్టిన బీన్స్ ఒక పచ్చి క్యారెట్, రోస్టెడ్ జీరాతో గ్లాసు ఉప్పు వేసిన మజ్జిగ.
- సాయంత్ర స్నాక్స్‌లో వెరైటీలు మారుతుంటాయి. పది రోస్టెడ్ మఖానా, ఐదు అక్రోట్స్, కిస్మిస్.
- రాత్రి ఏడున్నరకు మిక్స్‌డ్ వెజిటబుల్/ చికెన్ సూప్‌తో పాటు టమాటో, మొలకలు, యాపిల్, చాట్ మసాల కలిపిన పాలకూర.
- డిన్నర్‌లో గ్రిల్‌డ్, ఫ్రైడ్ చికెన్‌తో ఉడకబెట్టిన కూరగాయలు. లేదంటే బీన్స్/ బ్రకోలీతో ఉడకబెట్టిన ఫిష్, ఒక క్యారెట్.

కురుల ఆరోగ్యానికి.. అలోవెరా!

న్యూట్రిన్లు, విటమిన్లు, అమినో ఆమ్లాలుండే అలోవెరా చర్మానికే కాదు జుట్టు ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. ఇంట్లోని పెరటిలో ఉండాల్సిన మొక్క ఇది. ఇంతకీ అలోవెరాతో హెయిర్ ప్యాక్స్ చేసుకోవటమెలా?

- అలోవెరా జెల్‌ను తలకు పట్టించుకుంటే.. జుట్టు రాలటం ఆగిపోతుంది. ముఖ్యంగా తలలో దురదలు తగ్గిపోతాయి.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండు టేబుల్ స్పూన్ల పెరుగు, రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి ఆరిన తర్వాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చుండ్రు తగ్గిపోతుంది. మాడు చల్లగా, ఆరోగ్యంగా ఉంటుంది.
- బౌల్‌లో రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, రెండున్నర స్పూన్ల కొబ్బరినూనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని పట్టించి అరగంట తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే.. హెయిర్ డ్యామేజ్ కావటం ఆగిపోతుంది.
- రెండున్నర టేబుల్ స్పూన్లు అలోవెరా జెల్‌కు.. రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం వేయాలి. మిశ్రమాన్ని బాగా కలిపి జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత శుభ్రంగా కడిగేయాలి. ఇలా పలుసార్లు చేస్తుంటే.. చుండ్రు పోతుంది. జుట్టు మిలమిలా మెరుస్తుంది.
- రెండు టేబుల్ స్పూన్ల మెంతుల్ని రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. హెయిర్ ప్యాక్ కోసం బౌల్‌లో మూడు స్పూన్ల అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి మెంతుల పేస్ట్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టుకు పట్టించి ఇరవై నిముషాల తర్వాత శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే జుట్టు పెరుగుతుంది.
- బౌల్‌లో అరకప్పు అలోవెరా జెల్ తీసుకుని.. ఇందులోకి రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ ఆయిల్, ఒక కోడిగుడ్డు వేసి స్పూన్‌తో మెత్తటి పేస్ట్‌లో చేయాలి. దీన్ని జుట్టుకు పట్టించి ఆరిన తర్వాత కడిగేయాలి. దీని వల్ల జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది.



నవ్య | చిత్రజ్యోతి

ఎవడికోసం తగ్గాలి



వైవిధ్యమైన చిత్రాలు, పాత్రలతో కథానాయకుడిగా ప్రేక్షకుల ముందుకొస్తున్నారు అల్లరి నరేశ్. ఆయన నటిస్తున్న 'బచ్చల మల్లి' చిత్రం గ్లింప్స్‌ను యూనిట్ ఆదివారం విడుదల చేసింది. ఈ వీడియోలో అల్లరి నరేశ్ పాత్రను మేకర్స్ పరిచయం చేశారు. 'ఏయ్ ఎవడికోసం తగ్గాలి, ఎందుకోసం తగ్గాలి' అంటూ ఆవేశంగా ఆయన పలికిన సంభాషణలు, పోరాట ఘట్టాల్లో ప్రదర్శించిన నటన ఆకట్టుకుంది. అమృత అయ్యర్ ఈ చిత్రంలో కథానాయిక. సుబ్బు మంగదేవి దర్శకత్వం వహిస్తున్నారు. రోహిణి, రావు రమేశ్, బలగం జయరాం, వైవా హర్ష కీలకపాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు.

అల్లరి నరేశ్‌తో సితార చిత్రం

అల్లరి నరేశ్ హీరోగా ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆయన పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కొత్త సినిమాను ప్రకటించింది. 'మీరు అతని కంటి నుంచి తప్పించుకోలేరు' అంటూ పోస్టర్‌ను విడుదల చేసి, సినిమాపై ఆసక్తిని పెంచింది. 'ఫ్యామిలీ డ్రామా' చిత్రంతో ప్రశంసలు పొందిన మెహర్‌తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఏఎన్ 63' అనేది వర్కింగ్ టైటిల్. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకాన్ని మేకర్స్ వ్యక్తం చేశారు. ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.

సాహసనారి పాత్రలో...




ఆది సాయికుమార్ నటిస్తున్న చిత్రం 'షణ్ముఖ'. ఈ డివోషనల్ థ్రిల్లర్‌కు షణ్ముగం సాప్పని దర్శకత్వం వహిస్తుండగా, తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేశ్ యాదవ్ నిర్మిస్తున్నారు. ఇందులో కథానాయికగా అవికాగోర్ నటిస్తున్నారు. ఆదివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా చిత్రంలో అవికా పోషించే పాత్ర లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు షణ్ముగం సాప్పని మాట్లాడుతూ "ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. ఇందులో అవికా సాహసోపేతమైన పనులు చేస్తూ, కథానాయకుడి లక్ష్య సాధనకు తోడ్పడే అమ్మాయి పాత్రను పోషిస్తున్నారు. చిత్రీకరణలో ఎక్కడా రాజీ పడకుండా అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందించాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం" అని చెప్పారు. 'ఇదొక విభిన్న తరహా చిత్రం, కథానాయిక పాత్రకు ప్రాధాన్యం ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునే కొత్త తరహా కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం' అని నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



నటి వరలక్ష్మీ శరత్‌కుమార్, వ్యాపారవేత్త నికోలయ్ సచ్‌దేవ్ పెళ్లి వేడుకలు మొదలయ్యాయి. రేపు ముంబైలో వీరి వివాహం జరగనుంది. ముందస్తు పెళ్లి వేడుకలకు సంబంధించిన ఫొటోలను వరలక్ష్మి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో అభిమానులతో షేర్ చేసుకున్నారు.

టీమ్ ఇండియా గెలుపుతో భావోద్వేగానికి లోనయ్యా



క్రికెట్‌లో టీమ్ ఇండియా ఆటను నిరంతం సపోర్ట్ చేసే సినీ తారల్లో బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ ఒకరు. శనివారం జరిగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా గెలవడంతో ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ఆనందాన్ని ఎక్స్‌లో షేర్ చేసుకున్నారు. "ఎన్నో ఏళ్ల తర్వాత ఓ ఐసీసీ ట్రోఫీని ఇండియా ముద్దాడడంతో నా కళ్ల వెంట ఆనందభాష్పాలు రాలుతున్నాయి. ఈ గెలుపు ఎప్పటికీ ప్రత్యేకమే. భారత్‌ను విశ్వవిజేతగా చూడటం మనందరికీ గర్వకారణం. భారత్ మాతా కీ జై..జై హింద్.." అని పేర్కొన్నారు. కాగా, తాను మ్యాచ్ చూస్తే ఇండియా ఓడిపోతుందని అమితాబ్‌ నమ్ముతారు. అందుకే శనివారం జరిగిన ఫైనల్‌ను కూడా చూడలేదని ఆయన చెప్పారు.



మిస్టర్ ఎక్స్ ముగించాడు

ఆర్య, గౌతమ్ కార్తిక్ హీరోలుగా మను ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'మిస్టర్ ఎక్స్'. శరత్‌కుమార్, మంజు వారియర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై ఎస్. లక్ష్మణ్‌కుమార్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. చివరి రోజు చిత్రీకరణకు సంబంధించిన స్టిల్స్‌ను ఆదివారం మేకర్స్ విడుదల చేశారు. అజర్ బైజాన్, జార్జియా, ఉగాండా దేశాల్లో పోరాట ఘట్టాలను తెరకెక్కించామని మేకర్స్ తెలిపారు. ధిబు నినాన్ థామస్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: తన్వీర్ మీర్, ఎడిటింగ్: ప్రసన్న జీకే

కొత్త రోల్ కోసం రంగంలోకి



తనలోని నటికి సవాల్ విసిరే పాత్రల కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు అలియా భట్. గ్లామర్ తారగానే కాదు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతోనూ సత్తా చాటుతున్నారు ఆమె. తాజాగా యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో ఆమె 'రా' ఏజెంట్ పాత్రలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది. దీంతో తన పాత్ర కోసం అలియా సన్నాహాలు మొదలు పెట్టారు. జిమ్‌లో భారీ వర్కౌట్ సెషన్స్‌లో పాల్గొంటున్నారు. ఆదివారం కూడా జిమ్‌లో శ్రమిస్తున్నారు. ఈ చిత్రానికి శార్వరీ వాఘ్ దర్శకుడు. అలియా నటించిన జిగ్రా చిత్రం అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 'లవ్ అండ్ వార్' చిత్రంలో నటిస్తున్నారు.

ఘనంగా 'ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం



'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రదానోత్సవం ఇటీవలే హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. నందమూరి మోహన్ కృష్ణ, నటుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు మురళీమోహన్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. 'బేబీ' చిత్రానికి గాను ఉత్తమ కథానాయకుడిగా ఆనంద్ దేవరకొండ, దర్శకుడిగా సాయిరాజేశ్ పురస్కారాలను స్వీకరించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ పేరిట ఇచ్చే ఈ పురస్కారాలను అందుకున్నందుకు ఆనందంగా ఉంది. ఈసారి ఎన్టీఆర్ ఫిలిం లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు నాకు దక్కినందుకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. మోహన్ కృష్ణ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ అనే మూడక్షరాలు సంచలనానికి మారుపేరు, ఆయన కొడుగ్గా పుట్టడం ఏదో జన్మలో చేసుకున్న పుణ్యంగా భావిస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని ఇంత గొప్పగా నిర్వహిస్తున్న కళావేదిక సంస్థకు నా అభినందనలు' అన్నారు. తెలుగు జాతి కోసమే పుట్టి, తెలుగు జాతి ఆత్మగౌరవం కోసమే బతికిన వ్యక్తి తారక రామారావు గారు అని ముఖ్య అతిథిగా పాల్గొన్న నందమూరి మోహన రూప చెప్పారు.



కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కృత్రిమ మేధపై సియోల్ సమావేశం



మానవజాతి చరిత్రలో నిప్పు ఉపయోగాలు తెలుసుకోవడం, చక్రం కనుగొనడం వంటివి కీలక పరిణామాలు. వీటివల్ల మానవజాతికి జరిగిన మేలే ఎక్కువ. అయితే ఇటీవలికాలంలో యావత్ మానవజాతి భవిష్యత్తును మార్చే సామర్థ్యమున్న 'కృత్రిమ మేధ' రూపు దిద్దుకుంటోంది. భవిష్యత్తులో మానవజాతి మనుగడకే సవాలు విసరగల సామర్థ్యాన్ని 'కృత్రిమ మేధ' అందిపుచ్చుకోగలదనే అంచనాలు సర్వత్రా ఆందోళన కలిగిస్తున్నాయి. అందువల్ల 'కృత్రిమ మేధ'పై మరింత లోతైన పరిశోధనలను, ఆవిష్కరణలను, అనువర్తనాలను కొంతకాలంపాటు నిలిపివేయాలని కోరుతూ గతేడాది యాపిల్ సంస్థ కో-ఫౌండర్ స్టీవ్ వోజ్నియాక్, టెస్లా అండ్ స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ వంటి టెక్నాలజీ నిపుణులు దాదాపు వెయ్యిమందికి పైగా బహిరంగ లేఖపై సంతకాలు చేశారు.

"మానవుడు పూర్తిగా తన ఆధీనంలో ఉంచుకునేలా కట్టడి సాంకేతికతలను అభివృద్ధి పర్చుకున్నాకే కృత్రిమ మేధ వల్ల ఏర్పడే ప్రమాదాలు ఎదుర్కోగలం. కాబట్టి ప్రయోజనకరంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకం కలిగిన తరవాతనే వినియోగంలోకి తీసుకురావాలి. లేకుంటే అది యావత్ మానవ జాతికే ప్రమాదకరంగా పరిణమిస్తుంది' అని ఎలన్ మస్క్, స్టీవ్ వోజ్నియాక్ తదితరులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు.

- అయితే ఈ స్వేచ్ఛా వాణిజ్యయుగంలో, పోటీ ప్రపంచంలో కృత్రిమ మేధ పరిశోధనల సంస్థల నుంచి స్వచ్ఛంద అంగీకారం కరువైంది. ఇక కృత్రిమ మేధ కట్టడికి ఏ దేశాలకు ఆ దేశాలు స్వచ్ఛందంగా నియంత్రణ చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడింది. ఈ కోవలో యురోపియన్ యూనియన్ అలాంటి చట్టాన్ని తొలుత పటిష్ఠంగా ఏర్పరచి అనేక దేశాలకు మార్గదర్శకం అయ్యింది. అయితే కృత్రిమ మేధ వంటి అంతర్జాల సాంకేతికతను అనేక బహుళజాతి సంస్థలు అభివృద్ధి పరుస్తున్నాయి. మార్కెట్ పోటీ, లాభాపేక్ష దృష్ట్యా ఇవి తమ కార్యకలాపాలకు ఒక దేశం అనుకూలంగా లేకుంటే మరో దేశాన్ని ఎంపిక చేసుకుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశాలపరంగా ఆంక్షలు విధించుకున్నా, అంతర్జాలపరంగా అన్ని దేశాలూ అనుసంధానమై ఉన్నా పర్యవసానాలు అందరిపైనా ప్రభావం చూపుతాయి. అందువల్ల దేశాలపరంగా వైయక్తికంగా కృత్రిమ మేధ కట్టడికి చట్టాలు రూపొందించుకోవాలి. ప్రపంచంలోని అన్ని దేశాలూ ఒక కట్టడి వ్యవస్థను ఏర్పర్చుకోవడం, అంతర్జాతీయ చట్టాన్ని తీసుకురావడం వల్ల ప్రయోజనం ఉంటుంది. ఈ దిశగా సమాలోచనలు చేయడానికి ఇటీవల మే 21 నుంచి మే 22 వరకు రెండురోజుల పాటు 'ఏఐ సియోల్ సమ్మిట్' పేరిట బ్రిటన్, దక్షిణ కొరియా సంయుక్త నిర్వహణ భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి వర్చువల్, ప్రాదేశిక సదస్సును దక్షిణ కొరియాలోని 'సియోల్' వేదికగా నిర్వహించారు. తొలిరోజు సియోల్ సమ్మిట్‌లో దేశాధినేతలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మరుసటి రోజు వివిధ దేశాల డిజిటల్ సాంకేతిక శాఖల మంత్రులు, అధికారులు పాల్గొన్న 'ఏఐ గ్లోబల్ ఫోరం' సమావేశం నిర్వహించారు.

- నిజానికి ఈ సియోల్ సమావేశం 2023 నవంబరులో బ్రిటన్‌లోని బ్లెచ్‌లీ పార్క్‌లో జరిగిన తొలి ప్రపంచస్థాయి 'ఏఐ సేఫ్టీ సమ్మిట్'కు కొనసాగింపు. అప్పటి ఈ సమావేశంలో బ్రిటన్, అమెరికా, ఇటలీ దేశాధినేతలతోపాటు ఎలన్‌మస్క్ వంటి టెక్ దిగ్గజాలు, పౌరసమాజ ప్రతినిధులు, పరిశోధకులు, ప్రభుత్వాధికారులు పాల్గొన్నారు. కృత్రిమ మేధ పరమైన సవాళ్లు, భద్రతా చర్యలపై చర్చించారు. భారత్‌తో సహా 28 దేశాలు, యురోపియన్ యూనియన్ 'బ్లెచ్‌లీ ఉడ్ డిక్లరేషన్'పై సంతకాలు చేశాయి. ఈ తీర్మానం ప్రకారం 'బాధ్యతాయుతమైన, భద్రతతో కూడిన కృత్రిమ మేధ' కోసం అంతర్జాతీయ సహకారం పెంపొందించే దిశగా కృషి చేయడానికి అంగీకరించాయి. అంతేకాకుండా ఈ సమావేశాన్ని తరచూ(ఆరు నెలలకు ఒకసారి) నిర్వహించాలని నిర్ణయించారు.

సియోల్ సమావేశం - ముఖ్యాంశాలు

- తొలిరోజు దేశాధినేతల సమావేశంలో కృత్రిమ మేధ ద్వారా ఎదురయ్యే ప్రమాదాలు, దాని ద్వారా సాధించగల అనేక ప్రయోజనాలపై చర్చించారు. అంతేకాక కొందరు కృత్రిమమేధ అభివృద్ధి సంస్థల ప్రతినిధులు పాల్గొని తాము బ్లెచ్‌లీ ఉడ్ తీర్మానానికి అనుగుణంగా తీసుకున్న భద్రత చర్యల గురించి వివరించారు.
- భవిష్యత్తులో ప్రపంచం కొద్దిమంది లేదా కొన్ని సాంకేతిక ప్రోగ్రామ్‌ల చేతిలోకి వెళ్లే ప్రమాదాన్ని అడ్డుకోవడానికి ప్రతి ఒక్కరూ కృత్రిమ మేధకు కాపలాదారుగా వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పేర్కొన్నారు.
- గూగుల్, మెటా, ఓపెన్ ఏఐ వంటి కృత్రిమ మేధ అభివృద్ధి అగ్రశ్రేణి సంస్థలు తమ ఏఐ సిస్టమ్‌లను సురక్షితంగా ఉంచుతామని, ప్రజలకు వీటి గురించిన లాభనష్టాలను తెలియచేయడంలో పారదర్శకంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశాయి. తాము అభివృద్ధి చేసే నూతన విధానాల ద్వారా ఎదురయ్యే సవాళ్లు పరిష్కరించలేనివిగా కనిపించిన పక్షంలో వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా నిలిపివేస్తామని స్వచ్ఛందంగా ఈ సమావేశంలో వాగ్దానం చేశాయి.
- దీనికి కొనసాగింపు సమావేశాన్ని 2025లో ఫ్రాన్స్‌లో 'ఏఐ యాక్షన్ సమ్మిట్' నిర్వహించనున్నారు. దీనిలో భద్రతతోపాటు టాలెంట్(ప్రతిభ), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(మౌలిక సదుపాయాలు), యూజెస్(ఉపయోగాలు), ఇన్వెస్ట్‌మెంట్(పెట్టుబడి), గవర్నెన్స్(పాలన) అనే మరో ఐదింటిని చర్చించాలని నిర్ణయించారు.
- మొత్తానికి సియోల్ సమావేశంలో కృత్రిమ మేధతో ఎదురవనున్న సవాళ్లపైనే చర్చ కేంద్రీకృతం కాకుండా సురక్షితంగా వినియోగించుకోవడానికి సరికొత్త ఆవిష్కరణల ఆవశ్యకతపై కూడా దృష్టి సారించారు.
- అయితే సియోల్ సదస్సు గురించి పెద్దగా ప్రచారం జరగకపోవడం, కొద్ది మంది దేశాధినేతలే ఇందులో పాల్గొనడం, కొత్త దేశాలేవీ పెద్దగా ఆసక్తి చూపకపోవడం, ప్రభావవంతమైన నిర్ణయాలు వెలువడకపోవడం, కృత్రిమ మేధ కట్టడిపరంగా ఎలాంటి కదలిక లేకపోవడం వంటి అంశాలపరంగా ఈ సదస్సు తీవ్ర విమర్శలకు గురవుతోంది.
- ఈ రంగంలో నవకల్పనలకు పోటీపడుతున్న అనేక అగ్రగామి టెక్ సంస్థలు, స్టార్టప్‌లు సౌలభ్యాలతో పాటు అనేక సవాళ్లను విసురుతున్నాయి. ఇప్పటికే గోప్యత, ఎంపిక స్వేచ్ఛ, నైతికతల పరంగా పెను సవాళ్లు ఎదురవుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగావకాశాలను కొల్లగొట్టడమే కాక మానవాళిపై కృత్రిమ మేధ ఆధిపత్యం సాధించగలదని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.
- మానవ ప్రమేయం ఉన్న రంగాల్లోనూ విస్తరిస్తున్న కృత్రిమ మేధను నియంత్రించినప్పుడే మానవాళి గమనం కూడా సురక్షితంగా సాగిపోతుంది.

సియోల్ సమావేశం ఎజెండా

బ్లెచ్‌లీ ఉడ్ సమావేశ ప్రధాన ఎజెండా అయిన కృత్రిమ మేధ 'భద్రత'కు కొనసాగింపుగా, నవకల్పన, సమ్మిళితత్వాలను చేర్చారు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

మహిళా రిజర్వేషన్లు చారిత్రక పరిణామం

మహిళలకు మూడింట ఒక వంతు సీట్లను కల్పిస్తూ రూపొందించిన 106వ రాజ్యాంగ సవరణ చట్టం-2023 అందుబాటులోకి వచ్చింది. ఈ చట్టం రూపొందించడానికి అనేక చర్యలు తీసుకున్నారు. ఇందుకు అనేక నివేదికలు దోహదపడ్డాయి.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాని, రాజ్యాంగ పరిషత్ చర్చలలో గాని మహిళా సభ్యులు మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా ఏనాడూ తీర్మానాలు ప్రవేశపెట్టిన దాఖలాలు లేవు. నిజానికి రిజర్వేషన్లు వారి అభ్యున్నతికి ఆటంకంగా భావించారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కాలంలో సాంఘిక సంక్షేమ శాఖ 1971లో మహిళా స్థితిగతులపై ఒక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ 1974లో 'సమానత్వం వైపు' పేరుతో ఒక నివేదికను సమర్పించింది. మహిళా స్థితిగతులపై అత్యంత సమగ్రమైన సమీక్షను చేసింది. ఈ కమిటీ అన్ని రంగాల్లో మహిళల స్థితిగతులను పరిశీలించింది. అన్ని



స్థాయిల్లో రాజకీయ ప్రాతినిధ్యాన్ని పొందడానికి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళా శాసనసభ్యుల సంఖ్య క్షీణించడం వంటి అంశాలను కమిటీ సమీక్షించింది. అయితే మహిళల స్థితిగతులను ఇంతగా పరిశీలించిన కమిటీ చివరకు రిజర్వేషన్లు సిఫారసు చేయకూడదని నిర్ణయించింది. ఆ మేరకు కమిటీ సభ్యులు ఇద్దరు(లోటికా సర్కార్, వీణా మజుందార్) ఒక అసమ్మతి నోట్‌ను సమర్పించారు. వీరు మహిళల ప్రత్యేక ప్రాతినిధ్యాన్ని, వర్గ ప్రాతినిధ్యాన్ని సమర్థించలేదు. అందుకు వారు వివరణ ఇచ్చారు. "ఒక రాజకీయ వ్యవస్థ కేవలం భావజాలంపై ఆధారపడి ఉండదు. సామాజిక పరిస్థితికి సంబంధించి వాస్తవికతలతో ఉండాలి. సమాజ లక్ష్యాలను సాధించేందుకు కార్యాచరణను సర్దుబాటు చేయాలి. వ్యవస్థలోని యంత్రాంగం సమాజ అవసరాలను గుర్తించలేకపోతే దీర్ఘకాలంలో అంతిమ లక్ష్యం ఓడిపోతుంది". అని వారు పేర్కొన్నారు. ఈ కారణంగానే కమిటీ నిర్ణయం తీసుకునే దశ నుంచే విభేదించాల్సి వచ్చిందని స్పష్టం చేశారు.

> సమాజ్‌వాది పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలు వీరేందర్ భాటియా, శైలేంద్రకుమార్ ఈ బిల్లు ముసాయిదాపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి రాజకీయ పార్టీ తప్పకుండా 20 శాతం సీట్లను మహిళలకు కేటాయించేలా నిబంధనను తీసుకురావాలని సూచించారు.

రాజకీయ సంస్థల్లో మహిళా భాగస్వామ్యంపై అశోక్‌మెహతా కమిటీ మొదలు, ఇతర అనేక కమిటీల విస్తృత, సుదీర్ఘ చర్చకు ఈ కమిటీ పరిశీలనలు కారణమయ్యాయి అనడంలో అతిశయోక్తి లేదు.

నేషనల్ పర్‌స్పెక్టివ్ ప్లాన్(మార్గరేట్ అల్వా కమిటీ)- 1987

ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించే సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని 'జాతీయ దృక్పథ ప్రణాళిక' పేరుతో 1988లో ఒక నివేదికను ఈ కమిటీ సమర్పించింది.

- పంచాయతీల్లో కల్పిస్తున్న మహిళా రిజర్వేషన్లను జాతీయ, రాష్ట్ర స్థాయిలో విస్తరింప జేయాలని కోరుతూ 1995లో ఏడు జాతీయ మహిళా సంఘాలు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. అదే విధంగా కనీసం మూడింట ఒక వంతు స్థానాలు మహిళలకు కేటాయిస్తామని తమ మేనిఫెస్టోలో పెట్టాలని జాతీయ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశాయి. అందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు చేయడానికి కట్టుబడి ఉండాలని బహిరంగంగా కోరాయి. ఈ విజ్ఞాపనలు దేశవ్యాప్తంగా మహిళా రిజర్వేషన్లపై చర్చకు దారి తీసాయి.

గీతాముఖర్జీ కమిటీ(1996)

మొదటి సారి 1996లో 81వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా జరిగిన సంఘటనల నేపథ్యంలో గీతాముఖర్జీ నేతృత్వంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేశారు. ఓబీసీ మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ఈ కమిటీ తన నివేదికలో పేర్కొంది.

న్యాయ మంత్రిత్వశాఖ స్టాండింగ్ కమిటీ

రెండోసారి ప్రవేశపెట్టిన 108వ రాజ్యాంగ సవరణ బిల్లును న్యాయ మంత్రిత్వశాఖకు చెందిన స్టాండింగ్ కమిటీకి పంపించారు. ఈ కమిటీ సభ్యులైన సమాజ్‌వాది పార్టీకి చెందిన ఇద్దరు ఎంపీలు వీరేందర్ భాటియా, శైలేంద్రకుమార్ ఈ బిల్లు ముసాయిదాపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి రాజకీయ పార్టీ తప్పకుండా 20 శాతం సీట్లను మహిళలకు కేటాయించేలా నిబంధనను తీసుకురావాలని సూచించారు. ఇందులో మైనారిటీ, ఓబీసీ మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలన్నారు. ఈ కారణంగానే సమాజ్‌వాది పార్టీ, ఆర్జేడీ, జేడీయూ ఈ బిల్లును వ్యతిరేకించాయి.

- 2004లో యూపీఏ ప్రభుత్వం దీనిని కామన్ మినిమమ్ ప్రోగ్రామ్‌లో చేర్చింది. విధాన సభలు, లోక్‌సభలో మహిళలకు మూడింట ఒక వంతు స్థానాల కోసం చట్టం చేయడానికి యూపీఏ ప్రభుత్వం నాయకత్వం వహిస్తుందని పేర్కొంది.
- 2005లో బిల్లుకు బీజేపీ పూర్తి మద్దతు ఇచ్చింది.

మహిళా స్థితిపై కమిటీ(2013)

2013లో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వశాఖ మహిళా స్థితిగతులపై ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఇది స్థానిక సంస్థలు, రాష్ట్ర శాసనసభలు, పార్లమెంట్, మంత్రుల స్థాయిలో, అన్ని నిర్ణయాధికారాలలో మహిళలకు కనీసం 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసింది.

- 1985లో కర్ణాట ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే నేతృత్వంలోని జనతాదళ్ ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలు, తెగల మహిళలకు ఉప కోటాతో మండల ప్రజా పరిషత్‌లలో 25 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తొలి రాష్ట్రంగా అవతరించింది.
- 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీల్లో మహిళలకు 9 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు.
- 1991లో ఒడిషా పంచాయతీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను అమలు చేశారు.
- 1992లో 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా 33 శాతం మహిళా రిజర్వేషన్లను జాతీయ స్థాయిలో అమలు చేశారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు 33 శాతం ఉప కోటాను చేర్చారు.
- 2006లో మహిళలకు పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థల్లో 50 శాతం స్థానాలను రిజర్వ్ చేసిన మొదటి రాష్ట్రంగా బిహార్ నిలిచింది.
- 2007లో సిక్కిం, ఆ తరవాత ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు వంటి 20 రాష్ట్రాలు పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని ఆమోదించాయి. ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డేటా(15 డిసెంబరు 2023) ప్రకారం భారతదేశంలో 3.1 మిలియన్ల పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులు ఉన్నారు. వీరిలో 1.4 మిలియన్ల మంది మహిళలు.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

దిశలు - దూరాలు

టీజీపీఎస్సీ/ ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్


పార్ట్-1

1. ఉదయం సూర్యుని వైపుగా అనుపమ్ నడకకు (వాకింగ్) బయలుదేరాడు. కొంత సమయం తరవాత ఎడమవైపునకు, తదుపరి మరల ఎడమవైపునకు, ఆ తదుపరి కుడివైపునకు చివరగా మరల ఎడమవైపునకు తిరిగి నడుస్తున్నాడు. అయితే ఇప్పుడు అనుపమ్ ఏ దిశలో నడుస్తున్నాడు?

ఎ) తూర్పు బి) పడమర సి) ఉత్తరం డి) దక్షిణం

సమాధానం: (బి)


వివరణ: ఉదయం సూర్యుని వైపుగా అంటే తూర్పు దిక్కునకు నడకను ప్రారంభించాడని అర్థం.



పై రేఖాచిత్రాన్ని బట్టి చివరగా ఎడమ వైపునకు '←' గుర్తు చూపిస్తున్నది. ఈ చాప్టర్‌లోని మెయిన్ డయాగ్రమ్‌లోని బేసిక్ పాయింట్ పరిశీలిస్తే ఎడమవైపునకు అంటే పడమర అని అర్థం. కాబట్టి ఇప్పుడు అనుపమ్ చివరగా పడమర వైపునకు నడుస్తున్నాడని తెలుస్తోంది.

సమాధానం పడమర.

షార్ట్‌కట్: ఉదయం సూర్యుని వైపుగా అంటే తూర్పు దిక్కునకు నడకను ప్రారంభించాడు.



ఒక కుడి, ఒక ఎడమ క్యాన్సిల్ అవుతుంది. ఇప్పుడు తూర్పు నుంచి 2 ఎడమలు అంటే తూర్పునకు ఎడమ ఉత్తరం, తదుపరి ఉత్తరానికి ఎడమ పడమర. కాబట్టి సమాధానం పడమర.


గమనిక: ఏ దిశ నుంచి అయినా 2 ఎడమలు లేదా 2 కుడి అంటే పాజిటివ్ దిశ అవుతుంది.

2. A పడమరకు 6 కి॥మీ॥ నడిచి తరవాత కుడివైపునకు 3 కి॥మీ॥ నడిచాడు. తరవాత మరల కుడివైపునకు 6 కి॥మీ॥ నడిచిన అతను బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?

ఎ) 9 కి॥మీ॥ బి) 3 కి॥మీ॥
సి) 15 కి॥మీ॥ డి) 6 కి॥మీ॥

సమాధానం: (బి)

వివరణ :-




పై రేఖాచిత్రాన్ని, బట్టి A బయలుదేరిన స్థానం నుంచి 3 కి॥మీ॥ దూరంలో ఉన్నాడని తెలుస్తోంది.

3. తూర్పు వాయువ్యం అయింది వాయువ్యం దక్షిణం అయింది అనుకుంటే పడమర ఏమవుతుంది?

ఎ) ఈశాన్యం బి) ఆగ్నేయం సి) నైరుతి డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: తూర్పు, వాయువ్యం అయింది అంటే తూర్పు నుంచి 3 భాగాలు($3x45=135^0$) గడియారపు అపసవ్యదిశలో తిరిగాయని అర్థం. వాయువ్యం, దక్షిణం అయింది అంటే వాయువ్యం నుంచి దక్షిణానికి అంటే 3 భాగాలు ($3x45=135^0$) అపసవ్యదిశతో తిరిగాయి. అయితే పడమర నుంచి 3 భాగాలు గడియారపు అపసవ్యదిశలో తిరిగితే సమాధానం ఆగ్నేయం అవుతుంది.




4. గడియారంలో సమయం గం॥ 3 గంటలు అయింది. నిమిషాల ముల్లు తూర్పును సూచిస్తున్నది అనుకొంటే గంటలముల్లు ఏ దిక్కును సూచిస్తుంది?

ఎ) తూర్పు బి) పడమర సి) ఉత్తరం డి) దక్షిణం

సమాధానం: (డి)

వివరణ :-



వాస్తవంగా 3 గంటల సమయంలో నిమిషాల ముల్లు ఉత్తరాన్ని సూచిస్తుంది. కాని ప్రశ్నలో తూర్పును సూచిస్తున్నదని ఉన్నది. అంటే గడియారపు సవ్యదిశలో 2 భాగాలు($2x45=90^0$) తిరిగిందని అర్థం. అదే విధంగా 3 గంటల సమయంలో గంటల ముల్లు వాస్తవంగా తూర్పున ఉంటుంది. ఇప్పుడు తూర్పు నుంచి 2 భాగాలు ($2x45=90^0$) గడియారపు సవ్యదిశలో తిరిగితే సమాధానం దక్షిణం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ



ఫైనల్ వీక్షకులు 5.3 కోట్లు

న్యూఢిల్లీ: ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన టీ20 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ డిజిటల్ వీక్షణలోనూ రికార్డులను నెలకొల్పింది. ఓటీటీ ప్లాట్‌ఫామ్ డిస్నీ హాట్‌స్టార్‌లో ఈ పోరును ఏకంగా 5 కోట్ల 30 లక్షల మంది వీక్షించారు. అయితే గతేడాది వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ రికార్డును మాత్రం దాటలేకపోయింది. అప్పుడు 5.9 కోట్ల మంది వీక్షించగా.. అదే ఆల్‌టైమ్ రికార్డుగా కొనసాగుతోంది. ఇక స్టార్‌స్పోర్ట్స్‌లో ఎంతమంది తిలకించారనే లెక్కలు వచ్చే వారం బార్క్ విడుదల చేయనుంది.

చాంపియన్లకు రూ.125 కోట్లు

టీ20 వరల్డ్‌కప్ గెలిచిన భారత క్రికెట్ జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. విజేతకు ఐసీసీ రూ.20.42 కోట్లే అందించగా... బోర్డు మాత్రం తమ స్థాయికి తగ్గట్టుగా ఏకంగా రూ.125 కోట్లు రోహిత్ సేనకు ఇవ్వనుంది. 'టోర్నీ అంతటా భారత జట్టు పట్టుదల, అంకితభావం, క్రీడాస్ఫూర్తి ప్రదర్శించింది. అందుకే విజేతగా నిలిచిన టీమిండియాకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ గెలుపులో భాగమైన ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బందికి అభినందనలు' అని బోర్డు కార్యదర్శి జైషా ఎక్స్‌లో పోస్ట్ చేశాడు.

కల నెరవేరె.. కెరీర్ ముగించె

టీ20లకు రోహిత్, విరాట్, జడేజా అల్విదా



భారత క్రికెట్‌లో ఇలాంటి దృశ్యం మునుపెన్నడూ చూడలేదు.. పేరుకే స్టార్ ఆటగాళ్లనీ, ఏళ్లు గడుస్తున్నా ఒక్క ఐసీసీ టైటిల్ కూడా సాధించలేకపోతున్నారన్న విమర్శల నేపథ్యంలో.. అందకుండా ఊరిస్తున్న వరల్డ్‌కప్‌ను అందుకున్న వేళ వారి భావోద్వేగాలు ఏ స్థాయిలో ఉంటాయి.. అందుకేనేమో.. ఇంతకు మించిన సమయం ఇంకేముంటుందన్న ఆలోచనతో ఒకరు కాదు, ఇద్దరు కాదు టీమిండియా విజయాలకు మూలస్తంభాలుగా నిలిచిన ముగ్గురు స్టార్లు పొట్టి ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పేశారు. తమ చిరకాల స్వప్నం నెరవేరిందన్న అంతులేని సంతృప్తితో.. కప్పును చూస్తూ మైమరుస్తూ.. హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ, కింగ్ విరాట్ కోహ్లీ, 'సర్' రవీంద్ర జడేజా ఒకరి తర్వాత మరొకరుగా యువతరానికి ద్వారాలు తెరిచారు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

సమర్థ నాయకుడు

'టీ20ల నుంచి తప్పుకోవాలని ఎప్పుడూ అనుకోలేదు. కానీ కప్‌ను సాధించాక గుడ్‌బై చెప్పడానికి ఇదే సరైన సమయం అనిపించింది'. ఫైనల్ ముగిశాక కెప్టెన్ రోహిత్ చేసిన కామెంట్ ఇది. ధనాధన్ ఫార్మాట్‌లో అత్యంత విజయవంతమైన సారథిగా హిట్‌మ్యాన్ పేరు తెచ్చుకున్నాడు. అంతే కాదు.. కపిల్‌దేవ్, ఎంఎస్ ధోనీల తర్వాత భారత్‌కు వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్‌గా చిరస్థాయిగా నిలుస్తాడు. విరాట్ నుంచి సారథ్య బాధ్యతలు తీసుకున్నాక, పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకున్నాడు. తనకన్నా గొప్ప ఆటగాడైన విరాట్‌కు సముచిత గౌరవాన్నిస్తూ జట్టులో చక్కటి వాతావరణం ఉండేలా చూసుకున్నాడు. సమర్థవంతంగా జట్టును ముందుండి నడిపించాడు. రోహిత్ సారథ్యంలో భారత్ 61 టీ20 మ్యాచ్‌లు ఆడితే 50 గెలవగా, టీ20 వరల్డ్‌కప్‌లో 13 మ్యాచ్‌ల్లో 11 విజయాలున్నాయి. ఇక ఐపీఎల్ సంగతి అందరికీ తెలిసిందే. ఏకంగా ఐదు టైటిళ్లతో అదరగొట్టాడు. ఈక్రమంలో వ్యక్తిగత రికార్డులను ఏనాడూ పట్టించుకోకపోయినా ఎన్నో ఘనతలు అతని ఖాతాలో చేరాయి. అలాగే సహచరులతో ఎంత సరదాగా ఉన్నా.. మైదానంలో మందలింపుతో తప్పులను సరిదిద్దేందుకు వెనుకాడడు. అయితే ఎంఎస్ ధోనీ మాదిరే ఆటగాళ్ల ఫామ్ కోల్పోయి ఇబ్బందిపడుతున్న దశలో రోహిత్ వారికి అండగా నిలిచాడు. తాజా టీ20 వరల్డ్‌కప్‌లో జట్టు ఆరంభం నుంచి ముగింపు వరకు ఒకే బృందంతో ఆడిన విషయం గమనించవచ్చు. పిచ్‌ను అంచనా వేసి పేసర్ సిరాజ్‌ను మాత్రమే తప్పించారు. విరాట్, దూబేలపై ఎన్ని విమర్శలు వచ్చినా వారిపై నమ్మకాన్ని ఉంచాడు. ఫైనల్లో ఈ ఇద్దరి విలువైన పరుగులే జట్టు విజయంలో కీలకమైన విషయం తెలిసిందే. 2007లో అరంగేట్రం చేసిన రోహిత్ 159 మ్యాచ్‌లు ఆడగా ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు (4231), అత్యధిక సెంచరీలు (5), అత్యధిక సిక్సర్ల (205)తో ఘనంగా వీడ్కోలు పలికాడు.

గేమ్ ఛేంజర్

టీ20 వరల్డ్‌కప్ గెలిచిన ఆనందంలో ఉన్న కోట్లాది మంది అభిమానులకు విరాట్ కోహ్లీ తన రిటైర్మెంట్ వార్తతో కాస్త షాక్‌కు గురిచేశాడు. నిజానికి తను ఈ మెగా టోర్నీలో సభ్యుడిగా ఉంటాడని అనుకోలేదు. 2022 టోర్నీలో జట్టు నిష్క్రమణ తర్వాత యువ ఆటగాళ్లతోనే టీమిండియా ముందుకెళ్లింది. అయితే ఐపీఎల్‌లో విరాట్ తన అద్భుత ఫామ్‌తో సెలెక్టర్లను ఆకట్టుకున్నాడు. కానీ విశ్వకప్‌ల్లో తిరుగులేని రికార్డున్న తను ఈసారి అన్ని మ్యాచ్‌ల్లోనూ విఫలమయ్యాడు. అందుకే ఫైనల్లోనూ అతడి మీద ఎవరూ అంచనాలు పెట్టుకోలేదు. కానీ ఇదే తన చివరి మ్యాచ్ అనే భావనలో కోహ్లీ మొండిగా క్రీజులో నిలబడ్డాడు. అనుకున్నది సాధించి కప్ దక్కడంలో కీలక భూమిక పోషించాడు. వాస్తవానికి తన ఆటతీరుకు పొట్టి ఫార్మాట్ శైలి సరిపోదు. అందుకే పదేపదే అతని స్ట్రయిక్ రేట్ గురించి విమర్శలు ఎక్కుపెడుతుంటారు. కానీ వెటరన్‌గా ఎలా ఆడాలో అతడికి బాగా తెలుసు. 2022 టీ20 ప్రపంచకప్‌లో పాక్‌పై 31/4 స్కోరుతో ఓటమి ఖాయమనుకున్న స్థితిలో అతడి చిరస్మరణీయ ఇన్నింగ్స్‌ను అంత సులువుగా మర్చిపోగలమా? పొట్టి ఫార్మాట్‌లో 2010లో అరంగేట్రం చేసిన విరాట్ 125 మ్యాచ్‌ల్లో ఒక సెంచరీతో 4,188 పరుగులు సాధించాడు. రోహిత్ తర్వాత అతడివే అత్యధిక పరుగులు.

ది ఆల్‌రౌండర్



స్పిన్నర్‌గానే కాదు.. చక్కటి స్ట్రోక్ ప్లేతో బ్యాటింగ్.. మైదానంలో మెరుపులా కదిలే ఫీల్డర్.. ఇలా అన్ని విభాగాల్లో నికార్సయిన ఆల్‌రౌండర్‌గా భారత క్రికెట్‌లో రవీంద్ర జడేజా పేరు తెచ్చుకున్నాడు. 'మనస్ఫూర్తిగా అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలుకుతున్నా. దేశం కోసం నా శక్తిమేరా అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాను. టీ20 వరల్డ్‌కప్ గెలవాలన్న కల నెరవేరింది. ఇతర ఫార్మాట్‌లో మాత్రం కొనసాగుతా' అంటూ కెరీర్‌లో తొలిసారి విశ్వకప్‌ను గెలిచిన సందర్భంలో జడేజా పేర్కొన్నాడు. వెటరన్ స్పిన్ ఆల్‌రౌండర్‌గా జట్టులో చోటు దక్కించుకున్నా జడ్డూ తాజా టోర్నీలో పెద్దగా ప్రభావం చూపలేదు. అయితే జట్టు నమ్మదగ్గ బౌలర్‌గా, టెయిలెండర్లలో ఆదుకునే బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. 2009లో తొలి టీ20 ఆడిన జడ్డూ ఆ తర్వాత జట్టులో నిలకడగా కొనసాగాడు. 74 మ్యాచ్‌ల్లో 515 రన్స్, 54 వికెట్లు, 28 క్యాచ్‌లు అందుకున్నాడు.



నానా మాటలు అన్నారు

ఐపీఎల్‌లో కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలమైన హార్దిక్ పాండ్యా సొంత జట్టు అభిమానుల నుంచే తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. వారందరికీ హార్దిక్ టీ20 వరల్డ్‌కప్‌లో గట్టి సమాధానమే ఇచ్చాడు. 'నా గురించి ఒక్క శాతం కూడా తెలియని వ్యక్తులు నానా మాటలు అన్నారు. కానీ నేను నమ్మకాన్ని కోల్పోలేదు. అలాంటి వారికి నోటితో కాకుండా ఆటతోనే బదులివ్వాలనుకున్నా' అని హార్దిక్ తెలిపాడు.

సఫారీలకు అండగా..

అజేయ ఆటతీరుతో ఫైనల్‌కు వచ్చిన దక్షిణాఫ్రికా ప్రదర్శనపై ఆ జట్టు అభిమానులు ప్రశంసలు కురిపించారు. రన్నరప్‌గా నిలిచినా సఫారీలకు అండగా ఉంటామని మాజీ స్పోర్ట్స్ ప్రెజెంటర్ విమ్లా ఫ్రాంక్ తెలిపింది. ఇక భారత్ చాంపియన్ ఆటతీరుతో ఆకట్టుకుందని మరో వ్యాఖ్యాత అస్లాం ఖోటా కొనియాడాడు.

వందనం.. అభివందనం

ఫోన్లో రోహిత్, కోహ్లీ, ద్రవిడ్‌తో మోదీ సంభాషణ





కప్ గెలిచిన భారత జట్టుపై ప్రశంసల వర్షం కురుస్తోంది. రాజకీయ, సినీ, క్రీడా రంగాలకు చెందిన వారు టీమిండియా ప్రదర్శనను కొనియాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు చేశారు. అయితే, ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం స్వయంగా ఫోన్ చేసి భారత జట్టు సభ్యులతో విజయానందాన్ని పంచుకొన్నారు. రోహిత్ శర్మ కెప్టెన్సీతోపాటు అతడి అద్భుత కెరీర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా ఫైనల్ మ్యాచ్‌లో కోహ్లీ ఆడిన తీరును కొనియాడారు. ఆఖరి ఓవర్ వేసిన హార్దిక్ పాండ్యాను, అద్భుత క్యాచ్ అందుకున్న సూర్యకుమార్‌ను, ఆపద్బాంధవుడిగా జట్టును ఆదుకొన్న బుమ్రాను మోదీ అభినందించారు. టీమిండియాకు ఎనలేని సేవలందించిన కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'భారత జట్టుతో మాట్లాడి వారి స్ఫూర్తిదాయక విజయాన్ని అభినందించా. టోర్నీ అంతటా అద్భుత ప్రదర్శన కనబర్చారు. జట్టులోని ప్రతి ఆటగాడి నిబద్ధత ప్రేరణ కలిగించింద'ని ఎక్స్‌లో మోదీ పోస్టు చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా భారత జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇక.. నేను నిరుద్యోగిని



ఆటగాడిగా అందుకోలేకపోయిన ఐసీసీ కప్‌ను కోచ్‌గా సాధించిన రాహుల్ ద్రవిడ్ పదవీకాలం ఫైనల్ మ్యాచ్‌తో ముగిసింది. ఇక ఈ గెలుపు సంబరాల నుంచి తాను తొందరగా బయటపడి ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నాడు. ఎందుకంటే వచ్చే వారం నుంచి నిరుద్యోగిగా ఉండాల్సిందేనని, ముున్ముందు ఏం చేస్తానో ఇప్పుడే చెప్పలేనంటూ ద్రవిడ్ సరదాగా వ్యాఖ్యానించాడు.

విక్టరీ టేస్ట్..



17 ఏళ్ల తర్వాత టీ20 ప్రపంచకప్‌ను అందుకున్న ఉత్సాహంలో కెప్టెన్ రోహిత్ కెన్సింగ్టన్ ఓవల్ మట్టిని రుచి చూశాడు. తమకు అద్భుత విజయాన్నందించినందుకు కృతజ్ఞతగా ఆ పిచ్‌పై ఉన్న మట్టిని కాస్త నోటిలో వేసుకున్నాడు. ఆ వీడియోను చూసిన నెటిజన్స్ దాన్ని 'విక్టరీ టేస్ట్'గా కామెంట్ చేశారు. టెన్నిస్ స్టార్ జొకోవిచ్ వింబుల్డన్ విజేతగా నిలిచినప్పుడు ఇలాగే అక్కడి గ్రాస్‌ను రుచి చూశాడు.

వరల్డ్‌కప్‌ను మళ్లీ దేశానికి తీసుకువస్తున్నందుకు ధన్యవాదాలు. క్లిష్టపరిస్థితుల్లో ఎంతో ప్రశాంతంగా ఆడారు. మ్యాచ్ చూస్తున్నప్పుడైతే గుండె వేగం అమాంతం పెరిగింది. నా పుట్టినరోజుకు గొప్ప బహుమతి.
- ఎంఎస్ ధోనీ

మనకు నాలుగో స్టార్ లభించింది. భారత జెర్సీకి లభించిన ప్రతీ స్టార్.. భవిష్యత్ తరంలో మరింత స్ఫూర్తిని నింపుతుంది. మిత్రుడు ద్రవిడ్ నేతృత్వంలో కప్‌ను సాధించడం ఎంతో ఆనందంగా ఉంది.
-సచిన్ టెండూల్కర్

భారత్.. ఎట్టకేలకు సాధించింది. విశ్వవిజేతకు అభినందనలు.
- సునీల్ గవాస్కర్

సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ ప్రపంచకప్ సాధించారు. ఇదే జోరులో మరిన్ని విజయాలు అందుకొంటారని భావిస్తున్నా.
- సౌరవ్ గంగూలీ

ఆనందభాష్పాలు ఆగడం లేదు. టీమిండియా తరహాలోనే నా భావోద్వేగాలు కూడా..! భారత్ వరల్డ్ చాంపియన్. నేను చూస్తే ఓడిపోతారేమోనని.. మ్యాచ్‌ను వీక్షించలేదు. భారత్ మాతాకీ జై.
- అమితాబ్ బచ్చన్

ఏం మ్యాచ్..! ఊపిరి బిగబట్టి చూశా. కంగ్రాట్స్ భారత్.. అద్భుత ప్రదర్శనకు పురస్కారం దక్కింది.
- గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్

ఉత్కంఠభరిత ఫైనల్..! భారత్‌కు శుభాకాంక్షలు. సౌతాఫ్రికా కూడా గొప్పగా ఆడింది. వెస్టిండీస్, అమెరికాలో మరిన్ని క్రికెట్ ఈవెంట్లు జరగాలి.
- మైక్రోసాఫ్ట్ చైర్మన్, సీఈవో సత్య నాదెళ్ల

వీళ్ల ఆటను మరువగలమా!

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



క్రికెట్ టీమ్ గేమ్. 11 మంది కలిసికట్టుగా రాణిస్తేనే విజయాలు సిద్ధిస్తాయి. మరీముఖ్యంగా ప్రపంచ స్థాయి టోర్నీలైతే ఆటగాళ్లంతా సత్తా చాటితేనే లక్ష్యాలు చేరువవుతాయి. ఈక్రమంలో స్టార్ క్రికెటర్లపై సహజంగానే ఫ్యాన్స్ దృష్టి నిలుస్తుంది. వారు అద్భుతంగా ఆడితే అభిమానులు ఊగిపోతారు. వేనోళ్లా కీర్తిస్తారు. ఆకాశానికెత్తేస్తారు. కానీ స్టార్ ముద్రలేని క్రికెటర్లు ప్రతి జట్టులోనూ ఉంటారు. టీమ్ సాధించే విజయాల్లో వారి పాత్రా తక్కువేంకాదు. కాకపోతే..వారి పేరు పెద్దగా బయటకు రాదు. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచాన్ని జయించిన టీమిండియాలోనూ అలాంటి ఆటగాళ్లున్నారు.

అర్షదీప్ సింగ్: ఐపీఎల్‌లో అర్షదీప్ సింగ్ విఫలమయ్యాడు. ఫైగా..లీగ్‌లో అతడు 10.03 ఎకానమీతో భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. దాంతో వరల్డ్ కప్‌లో ఏం చేస్తాడులే..అని అనుకున్నారు. కానీ మెగా టోర్నీలో మరో అర్షదీప్ సాక్షాత్కరించాడు. 25 ఏళ్ల ఈ ఎడమ చేతి పేసర్ లీగ్ దశలో చెలరేగాడు. 6.3 ఎకానమీతో ఏడు వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. అమెరికాతో మ్యాచ్‌లో 4/9తో వరల్డ్ కప్‌లో బెస్ట్ బౌలింగ్ నమోదు చేసిన భారత బౌలర్‌గా రికార్డులకెక్కాడు. సూపర్-8లో మరో ఎనిమిది వికెట్లతో అబ్బురపరిచాడు. ఆస్ట్రేలియాతో కీలక పోరులో తొలి ఓవర్‌లోనే వార్నర్ వికెట్ తీసి ప్రత్యర్థిని దెబ్బ కొట్టాడు. ఇక..సౌతాఫ్రికాతో టైటిల్ ఫైట్‌లో అర్షదీప్ బౌలింగ్ మరో స్థాయికి చేరింది. తన రెండో ఓవర్లోనే ఓ సూపర్ బంతితో సఫారీ సారథి మార్‌క్రమ్‌ను పెవిలియన్ చేర్చాడు. ఆపై ప్రమాదకర బ్యాటర్ డికాక్‌ను అవుట్ చేసి జట్టు విజయంలో ఎనలేని పాత్ర పోషించాడు. మొత్తంగా 17 వికెట్లతో టోర్నీ టాపర్‌గా నిలిచాడు.

అక్షర్ పటేల్: అద్భుత ఆల్‌రౌండ్ నైపుణ్యాలు తన సొంతమని ఈ ప్రపంచ కప్‌లో అక్షర్ పటేల్ నిరూపించాడు. ఫైనల్లో 34/3తో జట్టు అత్యంత గడ్డు స్థితిలో ఉన్నప్పుడు 47 పరుగులతో వెలకట్టలేని ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లండ్‌తో సెమీస్‌లో తన స్పిన్ మాయాజాలం (3/23)తో ప్రత్యర్థి టాపార్డర్ వెన్ను విరిచి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. పాకిస్థాన్‌తో స్వల్ప స్కోర్ల మ్యాచ్‌లో పంత్ తర్వాత అక్షర్ (20)దే టాప్ స్కోర్.

శివమ్ దూబే: ఐపీఎల్‌లో ధనాధన్ బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్ల గుండెల్లో గుబులు పుట్టించిన దూబే..వరల్డ్ కప్‌లో ఆ జోరు కొనసాగించకపోవడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నాడు. అయితే ఫైనల్లో 16 బంతుల్లోనే చేసిన 27 పరుగులు జట్టుకు ఎంతో విలువైనవో చెప్పాల్సిన పనిలేదు.

రిషభ్ పంత్: ఘోర రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడి ప్రపంచ కప్‌లాంటి ప్రతిష్ఠాత్మక టోర్నీలో కీపర్‌గా బరిలో దిగడం ఆషామాషీ కాదు. ఇంగ్లండ్‌తో సెమీఫైనల్లో కళ్లుమూసి తెరిచేలోపు మొయిన్ అలీని స్టంపింగ్ చేసిన తీరు పంత్ అమోఘ కీపింగ్ నైపుణ్యాలకు తార్కాణం. పాకిస్థాన్ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్లు చేతులెత్తేసిన వేళ..42 పరుగులతో బాధ్యతాయుత ఇన్నింగ్స్‌తో ఆదుకున్నాడు.

బాలి గోల్ఫ్ విజేత కేయ



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): బాలి అంతర్జాతీయ జూనియర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం అమ్మాయి బి.కేయ కుమార్ కైవసం చేసుకుంది. జాతీయ పోటీల్లో ఢిల్లీకి ప్రాతినిధ్యం వహిస్తున్న కేయ, ప్రస్తుత ర్యాంకింగ్స్‌లో టాప్-15లో ఉంది. కేయ విశాఖకు చెందిన ఐఆర్‌ఎస్ అధికారి బి.శ్రీనివాస్ కుమార్తె.

తిరుమలలో గంభీర్



తిరుమల (ఆంధ్రజ్యోతి): టీమిండియా మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాడు. ఆలయం ముందు గంభీర్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు భారీగా ఎగబడ్డారు. సెక్యూరిటీ సహాయంతో అతను ఆలయం నుంచి తిరిగి వెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రోహిత్‌శర్మ, కోహ్లీ, ద్రవిడ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపాడు. టీ20 గెలవడం కంటే రిటైర్మెంట్‌కు మంచి సందర్భం ఏముంటుందని అన్నాడు.

క్వార్టర్‌ఫైనల్లో జర్మనీ

» యూరో చాంపియన్‌షిప్

డార్ట్‌మండ్ (జర్మనీ): ఆతిథ్య జర్మనీ జట్టు యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకుపోయింది. ఆదివారం జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో జర్మనీ 2-0తో డెన్మార్క్‌ను చిత్తు చేసింది. 53వ నిమిషంలో లుకాస్ హెవెట్జ్ పెనాల్టీ కిక్‌ను గోల్‌గా మలచగా, 68వ నిమిషంలో ముసియాలా రెండో గోల్ అందించాడు. అంతకుముందు మరో మ్యాచ్‌లో స్విట్జర్లాండ్ 2-0తో డిఫెండింగ్ చాంపియన్ ఇటలీకి షాకిచ్చి క్వార్టర్స్‌లో అడుగుపెట్టింది.

చెలరేగిన స్నేహ్ రాణా

8 వికెట్లతో సఫారీల పనిపట్టిన స్పిన్నర్



» దక్షిణాఫ్రికా ఫాలో ఆన్ » లుస్ సెంచరీ

2 టెస్ట్ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన మూడో బౌలర్‌గా స్నేహ్ రాణా (8/77). భారత్‌కే చెందిన నీతూ డేవిడ్ (8/53) టాప్‌లో ఉండగా, ఆస్ట్రేలియా ప్లేయర్ ఆష్లే గార్డ్‌నర్ (8/66) తర్వాత రాణా మూడో స్థానంలో నిలిచింది.

చెన్నై: స్పిన్నర్ స్నేహ్‌రాణా (8/77) ఏకంగా ఎనిమిది వికెట్లతో విజృంభించడంతో భారత్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో దక్షిణాఫ్రికా ఫాలోఆన్‌లో పడింది. ఓవర్‌నైట్ స్కోరు 236/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సౌతాఫ్రికా 266 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు 3 వికెట్లు సాధించిన రాణా, మూడోరోజు ఇంకో 5 వికెట్లతో అదరగొట్టింది. కాప్ (74) వెనుదిరగడంతో.. మరో 17 పరుగుల తేడాతో సౌతాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. దీప్తి శర్మకు 2 వికెట్లు దక్కాయి. తర్వాత ఫాలోఆన్ ఆడుతూ 337 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన సౌతాఫ్రికా జట్టులో టాపార్డర్ బ్యాటర్ సునె లుస్ (109) శతకం సాధించింది. ఆదివారం ఆట చివరికి ఆ జట్టు 232/2 స్కోరు చేసింది. కెప్టెన్ లారా వొల్వార్ట్ (93), మరిజానె కాప్ (15) క్రీజులో ఉన్నారు. భారత స్కోరు 603/6 డిక్లేర్డ్‌కు సఫారీలు 105 రన్స్ దూరంలో ఉన్నారు. ఓపెనర్ అన్నెక్ బాష్ (9)ను దీప్తి ఎల్బీ చేసింది. అయితే, మరో ఓపెనర్ లారా, వన్‌డౌన్ బ్యాటర్ లుస్ రెండో వికెట్‌కు 190 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొన్నారు. సెంచరీ సాధించిన లుస్‌ను హర్మన్‌ప్రీత్ బౌల్డ్ చేసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్: 603/6 డిక్లేర్డ్; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 266 ఆలౌట్ (మరిజానె కాప్ 74, లుస్ 65; రాణా 8/77, దీప్తి 2/47); దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: 85 ఓవర్లలో 232/2 (సునె లుస్ 109, వొల్వార్ట్ 93 బ్యాటింగ్; హర్మన్‌ప్రీత్ 1/24, దీప్తి 1/56).

ఫేవరెట్ అల్కారజ్

మహిళల్లో స్వియటెక్, గాఫ్

నేటి నుంచే వింబుల్డన్

లండన్: గ్రాండ్‌స్లామ్ టెన్నిస్‌కు తలమానికమైన వింబుల్డన్ టోర్నీ సోమవారం ప్రారంభం కానుంది. పురుషుల విభాగంలో డిఫెండింగ్ చాంప్ కార్లోస్ అల్కారజ్, వరల్డ్ నెం.1 జానిక్ సిన్నర్‌తోపాటు 7సార్లు విజేత జొకోవిచ్, స్థానిక స్టార్ ఆండీ మర్రే బరిలోకి దిగుతున్నారు. గాయం కారణంగా ఫ్రెంచ్ ఓపెన్ నాలుగో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగిన జొకోవిచ్‌పై పూర్తి అంచనాలు లేవు. అలాగే టాప్ సీడ్ సిన్నర్, మూడో సీడ్ అల్కారజ్ సెమీఫైనల్లో తలపడే అవకాశాలున్నాయి. జొకో ఫామ్ అంతంతమాత్రంగా ఉండడంతో ఈ పార్శ్వంనుంచి ఊహించని విధంగా మరో ఆటగాడు ఎవరన్నా ఫైనల్ చేరే చాన్సుంది. మహిళల విభాగంలో ప్రపంచ నెంబర్ వన్ స్వియటెక్, నెం.2 కొకొ గాఫ్‌లకు టైటిల్ అవకాశాలు మెండుగా ఉన్నాయి.

మెయిన్ డ్రాలో నగాల్: భారత స్టార్ సుమిత్ నగాల్ పురుషుల సింగిల్స్ మెయిన్ డ్రాలో తలపడనున్నాడు. గుణేశ్వరన్ తర్వాత మెయిన్ డ్రాలో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న తొలి భారత ఆటగాడు నగాల్.


అల్కారజ్


కొకొ గాఫ్



అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ జెఫ్రీస్ వెల్లడి

పెళ్లిళ్ల వ్యాపారం.. ఏటా రూ.10 లక్షల కోట్లు

జోరుజోరుగా వివాహ బిజినెస్.. సగటు వివాహ ఖర్చు రూ.12.5 లక్షలు

న్యూఢిల్లీ: భారత్‌లో ఇప్పుడు పెళ్లిళ్లు కూడా పెద్ద బిజినెస్‌గా మారాయి. ఈ బిజినెస్ ఎంత లేదన్నా ఏటా రూ.10 లక్షల కోట్లు (13,000 కోట్ల డాలర్లు) ఉంటుందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ జెఫ్రీస్ ఒక నివేదికలో తెలిపింది. రిటైల్‌గా చూస్తే ఆహారం, చిల్లర సరుకుల తరువాత దేశంలో ఇదే అతిపెద్ద వ్యాపారమని పేర్కొంది. నిశ్చితార్థం మొదలుకొని, విందులు, వినోదాలు, నగనట్రా, పెళ్లి బట్టల కొనుగోలు, రవాణా కోసం చేసే ఖర్చులను పరిగణనలోకి తీసుకుని జెఫ్రీస్ ఈ నివేదిక రూపొందించింది.

ఏటా కోటి వివాహాలు

మన దేశంలో ఏటా 80 లక్షల నుంచి కోటి పెళ్లిళ్లు జరుగుతున్నాయి. ఒక్కో పెళ్లికి సగటున రూ.12.5 లక్షలు ఖర్చు చేస్తున్నట్టు అంచనా. పిల్లల చదువుల మీద పెట్టే ఖర్చుల కంటే తల్లిదండ్రులు రెండింతలు పిల్లల పెళ్లిళ్ల మీద ఖర్చు చేస్తున్నారు. ఆర్థిక స్థోమత అంతంతమాత్రంగా ఉన్నా పిల్లల పెళ్లిళ్లు మాత్రం ఘనంగా చేసేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారని తెలిపింది. ఇక బడాబాబులైతే దేశంలోని ప్రముఖ ప్రదేశాలు, విదేశాల్లోని ప్రముఖ ప్రదేశాల్లో తమ పిల్లల పెళ్లిళ్లు చేస్తున్నారు.

ఖర్చుల్లో చైనాదే అగ్రస్థానం

అమెరికా, చైనాలతో పోలిస్తే మన దేశంలో ఏటా జరిగే పెళ్లిళ్లే ఎక్కువ. చైనాలో ఏటా 70-80 లక్షల పెళ్లిళ్లు జరుగుతుంటే అమెరికాలో ఏటా జరిగే పెళ్లిళ్లు 20 నుంచి 25 లక్షలు మాత్రమే. మన దేశంలో మాత్రం ఏటా 80 లక్షల నుంచి కోటి జంటలు పెళ్లితో ఒకటవుతున్నాయి. చైనాలో ఏటా 70-80 లక్షల పెళ్లిళ్లు జరిగినా ఖర్చులపరంగా చూస్తే మన కంటే చాలా ముందుంది. అక్కడ పెళ్లిళ్ల కారణంగా జరిగే వార్షిక వ్యాపారం రూ.14.17 లక్షల కోట్ల వరకు ఉంటుందని జెఫ్రీస్ సంస్థ అంచనా.

ఏఐ రెండు వైపులా పదునున్న కత్తి

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం విషయంలో జాగ్రత్తలు తప్పనిసరని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది రెండు వైపులా పదునున్న కత్తి లాంటిదని సేల్స్ ఫోర్స్ ఇండియా సీఈఓ, చైర్‌పర్సన్, ఎస్‌బీఐ మాజీ చైర్మన్ అరుంధతీ భట్టాచార్య అన్నారు. ఏఐతో మానవాళికి అనేక ప్రయోజనాలు ఉన్నా, ఇది దుష్ట శక్తుల చేతుల్లో పడితే దుష్ఫలితాలూ తప్పవని హెచ్చరించారు. మన దేశానికి సంబంధించినంత వరకైతే ఏఐ ఒక 'గేమ్ చేంజర్' అని అరుంధతీ భట్టాచార్య అన్నారు.

ఓలా ఈ-స్కూటర్లలో..

OLA ELECTRIC

ఇక ఓలా బ్యాటరీలు

దేశీయంగా తయారీ.. వచ్చే ఏడాది అందుబాటులోకి



ఓలా ఎలక్ట్రిక్ చైర్మన్ భవిష్ అగర్వాల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఓలా ఎలక్ట్రిక్.. తన ఎలక్ట్రిక్ స్కూటర్ల (ఈవీ)లో తాను సొంతంగా ఉత్పత్తి చేయనున్న లిథియం అయాన్ బ్యాటరీ సెల్స్‌ను వినియోగించనుంది. వచ్చే ఏడాది ఆరంభంలో ఓలా ఎలక్ట్రిక్ పోర్టుఫోలియోలోని అన్ని స్కూటర్లను దేశీయంగా తయారు చేయనున్న బ్యాటరీలతో అందుబాటులోకి తీసుకురానున్నట్లు కంపెనీ చైర్మన్, ఎండీ భవిష్ అగర్వాల్ వెల్లడించారు. కంపెనీ తమిళనాడులోని కృష్ణగిరిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓలా గిగా ఫ్యాక్టరీలో లిథియం అయాన్ బ్యాటరీలను ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. దీంతో ఈవీ బ్యాటరీల దిగుమతుల భారం తగ్గటమే కాకుండా ఉత్పత్తి వ్యయం గణనీయంగా తగ్గనుందని తెలిపారు. ప్రస్తుతం ఈ గిగా ఫ్యాక్టరీలో ప్రయోగాత్మకంగా ఉత్పత్తిని ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. అంతర్జాతీయంగా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీతో లిథియం అయాన్ బ్యాటరీలను తయారు చేస్తున్న కంపెనీలు కొన్ని మాత్రమే ఉన్నాయని, అందులో భారత్ నుంచి ఓలా ఎలక్ట్రిక్ ఒక్కటే ఈ జాబితాలో ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లోని ఎలక్ట్రిక్ వాహన తయారీ కంపెనీలు.. చైనా, తైవాన్, జపాన్, కొరియా దేశాల నుంచి పెద్దఎత్తున బ్యాటరీలను దిగుమతి చేసుకుంటాయన్నారు.

రూ.835 కోట్ల పెట్టుబడి

ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) కింద కేంద్ర ప్రభుత్వం 30 గిగావాట్ల (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యం గల ప్లాంట్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందని, ఇందులో ఓలా ఒక్కటే 20 గిగావాట్ల సామర్థ్యంతో కూడిన ప్రాజెక్ట్‌ను దక్కించుకుందని భవిష్ తెలిపారు. 110 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ గిగా ఫ్యాక్టరీలో తొలుత 5 గిగావాట్ అవర్స్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. ఆ తర్వాత దశలవారీగా ఈ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 100 జీడబ్ల్యూహెచ్‌కు పెంచాలని చూస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లాంట్‌పై ఇప్పటికే రూ.835 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు ఆయన చెప్పారు. కాగా ఇప్పటికే ఈ ప్లాంట్‌లో 1.4 జీడబ్ల్యూహెచ్ సామర్థ్యం గల బ్యాటరీలను ఉత్పత్తి చేస్తున్నట్లు అగర్వాల్ పేర్కొన్నారు. అయితే సాంప్రదాయ 2170 సెల్స్ కంటే మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలతో కూడిన 4680 సెల్స్‌ను కూడా కంపెనీ దేశీయంగా అభివృద్ధి చేసిందని, దీనికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నుంచి సర్టిఫికేషన్ కూడా లభించిందన్నారు. ఈ బ్యాటరీలనే వచ్చే ఏడాది నుంచి తమ ఈవీల్లో వినియోగించాలని చూస్తున్నట్లు చెప్పారు. అలాగే లిథియం అయాన్ కంటే మెరుగైన సాలిడ్ స్టేట్ బ్యాటరీస్‌పై కూడా ప్రయోగాలు జరుపుతున్నట్లు తెలిపారు.

వచ్చే ఏడాది ఓలా ఈవీ మోటార్‌సైకిళ్లు

కృష్ణగిరిలోని కంపెనీ ఫ్యూచర్ ఫ్యాక్టరీలో కంపెనీ నాలుగు ఈవీ మోడల్స్‌ను ఉత్పత్తి చేస్తోందని అగర్వాల్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 10 లక్షల యూనిట్లుగా ఉందన్నారు. అయితే డిమాండ్‌కు అనుగుణంగా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తిని చేపడుతున్నామని, ప్రస్తుతం రోజుకు 2,200 యూనిట్లను ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన వివరించారు. కాగా కంపెనీ ఎలక్ట్రిక్ మోటార్ సైకిల్స్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తోందన్నారు. వచ్చే ఏడాది నాటికల్లా కనీసం మూడు మోటార్ సైకిల్స్‌ను మార్కెట్లోకి తీసుకురావాలని కంపెనీ భావిస్తోంది.

24,850 పైన బుల్లిష్

(జూలై 1-5 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్త్రో గైడ్

నిఫ్టీ గత వారం 24,174-23,350 పాయింట్ల మధ్యన కదలాడి 510 పాయింట్ల లాభంతో 24,011 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,850 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,985, 23,746, 23,600, 23,212 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి : 24,350 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 23,700
నిరోధ స్థాయిలు : 24,225, 24,325, 24,425 (24,110 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 23,800, 23,700, 23,600 (23,900 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



జూలై 1వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	530
చిత్తూరు	573	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	123
వరంగల్	112	గుంటూరు	123
కరీంనగర్	112	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	113
కర్నూలు	112	నెల్లూరు	113
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

లాభాల స్వీకరణకు చాన్స్!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశం ఉంది. సూచీలు ఇప్పటికే గరిష్ఠ స్థాయిలకు చేరరటంతో మదుపరులు లాభాల స్వీకరణకు దిగే అవకాశం ఉంది. శుక్రవారం నాటి సెషన్లో ఇదే కనిపించింది. అయితే బడ్జెట్‌లో కేంద్రం మౌలిక రంగం, పెట్టుబడులు, ప్రభుత్వ రంగ సంస్థలకు మద్దతుగా నిర్ణయాలు తీసుకోవచ్చని భావిస్తే మాత్రం మార్కెట్ మరింత పెరిగే అవకాశం లేకపోలేదు.

స్టాక్ రికమండేషన్స్

ఇండస్ టవర్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా ట్రేడవుతోంది. రూ.360 వద్ద గరిష్ఠ స్థాయిని చేరిన తర్వాత సైడ్‌వేస్ కన్సాలిడేషన్ జరిగింది. తక్కువ వాల్యూమ్ నమోదు కావటాన్ని బట్టి చూస్తే డిమాండ్ ఎక్కువగా ఉందని అర్థం చేసుకోవచ్చు. గత శుక్రవారం ఈ షేరు 2.75 శాతం లాభంతో రూ.375 వద్ద క్లోజైంది. ట్రేడర్లు ఈ కౌంటర్‌లో రూ.360/370 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.425 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.349 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

జేకే టైర్: పెరిగిన రబ్బరు ధరల భారాన్ని వినియోగదారులకు బదలాయిస్తామని కంపెనీ చెప్పటంతో ఈ షేరులో ఒక్కసారిగా కదలిక ఏర్పడింది. రానున్న రోజుల్లో మార్జిన్స్ పెరిగే అవకావం ఉండటంతో ఇన్వెస్టర్ల చూపు ఈ షేరుపై పడింది. ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 26 శాతం మేర క్షీణించింది. తాజాగా ఈ షేరుకు రూ.400 స్థాయిల్లో మంచి బేస్ ఏర్పడింది. గత శుక్రవారం ఈ షేరు 9.13 శాతం లాభంతో 429.75 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.428 స్థాయిల్లో ప్రవేశించి రూ.442/448 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.425 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: గత వారం ఈ షేరు వారం, నెల గరిష్ఠాలను బ్రేక్ చేసింది. జూన్ ఆరంభం నుంచి అప్‌ట్రెండ్‌ను కనబరుస్తూ వస్తోంది. గత శుక్రవారం 1.95 శాతం లాభంతో రూ.1,491 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,460/1,480 స్థాయిల్లో ప్రవేశించి రూ.1,545/1,595 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,445 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హీరో మోటోకార్ప్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరులో స్వల్ప పుల్‌బ్యాక్ వచ్చింది. చివరి వారం వాల్యూమ్ తగ్గటమే కాకుండా ప్రైస్ యాక్షన్ చాలా టైట్‌గా జరుగుతోంది. నిఫ్టీతో పోల్చితే బలంగా ట్రేడవుతుండటం, గరిష్ఠ స్థాయిలను తాకే కొద్దీ పుల్‌బ్యాక్ స్వల్పంగా ఉండటం దీని ప్రత్యేకత. క్రితం సెషన్‌లో ఈ షేరు 1.91 శాతం లాభంతో రూ.5,590 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.5,550/5,560 స్థాయిల్లో ఎంటరై రూ.5,760 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,510 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఐఎఫ్ఎల్: ఈ షేరు విభజన అనంతరం ఈ కౌంటర్‌లో వాల్యూమ్ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం అప్‌ట్రెండ్ దిశగా సాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ మాత్రం కాస్త బలహీనంగా ఉంది. అయితే చివరి మూడు సెషన్లలో 13 శాతం లాభపడటం సానుకూల అంశం. గత శుక్రవారం ఈ షేరు 7.8 శాతం లాభంతో రూ.517.30 వద్ద క్లోజైంది.

మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.510 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.555/590 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.485 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

24,000 పైన నిలదొక్కుకోవాలి



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 23,400 వద్ద రియాక్షన్‌తో ప్రారంభమైనా తక్షణం పునరుజ్జీవం సాధించింది. తదుపరి అన్ని ట్రేడింగ్ దినాల్లోనూ అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ శుక్రవారం ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 24,150 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌కు గురైంది. అయినప్పటికీ వారం మొత్తంలో 510 పాయింట్ల లాభంతో 24,000 సమీపంలో నిలకడగా ముగిసింది. మొత్తం మీద నిఫ్టీ జూన్ నెల మొత్తం బలమైన ర్యాలీలో ట్రేడవుతూ 2,800 పాయింట్ల వరకు లాభపడింది. ఈ కారణంగా ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో టెక్నికల్ కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. గత వారంలో మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ 300 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 80 పాయింట్లు లాభపడ్డాయి. జూన్ నెలలో ఏర్పడిన ర్యాలీ ఏ గ్రూప్ షేర్ల కారణంగానే ఏర్పడిందనేందుకు ఇది సంకేతం. టెక్నికల్‌గా మార్కెట్ ఓవర్‌బాట్ స్థితిలో ప్రవేశిస్తోంది.

బుల్లిష్ స్థాయిలు: 24,000 పాయింట్ల స్థాయిలో మార్కెట్ కన్సాలిడేట్ కావచ్చు. సానుకూలత కోసం ఈ స్థాయిలో బలాన్ని ప్రదర్శించాలి. మరింత అప్‌ట్రెండ్‌లో ట్రేడయి గురువారం ఏర్పడిన గరిష్ఠ స్థాయి, ప్రధాన నిరోధం 24,150 వద్ద బ్రేకౌట్ సాధిస్తే సరికొత్త శిఖరాల దిశగా సాగుతుంది.

బేరిష్ స్థాయిలు: కరెక్షన్‌లో పడినా భద్రత కోసం మైనర్ మద్దతు స్థాయి 23,800 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనత మరింతగా కొనసాగుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 23,650, 23,500.

బ్యాంక్ నిఫ్టీ : ఈ సూచీ గత వారం కనిష్ఠ స్థాయి 51,200 నుంచి ర్యాలీ సాధించి 53,200 వరకు వెళ్లింది. కాని గత శుక్రవారం ఈ స్థాయిలో 470 పాయింట్ల మేరకు రియాక్షన్ సాధించడం అప్రమత్త సంకేతం. అయినా గత వారంతో పోల్చితే 680 పాయింట్ల లాభంతో ముగిసింది. నిరోధ స్థాయిలు 52,700, 53,000. ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 51,700, 51,000.

పాటర్న్: ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం డెయిలీ చార్టులు, మంత్లీ చార్టులు రెండింటిలోనూ ఓవర్‌బాట్ స్థితి కనిపిస్తోంది. స్వల్పకాల ఇన్వెస్టర్లు ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలనేందుకు ఇది సంకేతం. 23,800 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది. అలాగే ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్‌కు కూడా ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,090, 24,150
మద్దతు	23,940, 23,860



ఉట్నూర్‌లో రాథోడ్ రమేష్ అంతిమ యాత్ర

అశ్రునయనాల మధ్య రమేశ్ రాథోడ్ అంత్యక్రియలు

ఉట్నూర్, జూన్ 30: దివంగత మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ అంత్యక్రియలు కుటుంబ సభ్యులు, బంధువులు, నాయకుల అశ్రునయనాల మధ్య ఆదివారం జరిగాయి. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు సమీపంలోని రాథోడ్ రమేశ్ వ్యవసాయ క్షేత్రంలో దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. అంతకు ముందు రమేశ్ రాథోడ్ భౌతిక కాయానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నివాళులర్పించారు. ఆయన వెంట ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఉన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ మునుగోడు ఎన్నికల్లో తన వెంట ఉండి నడిపించిన మహానీయుడు రమేశ్ అని, ఆయన మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. రమేశ్ రాథోడ్ మృతి పట్ల ప్రధాని మోదీతో పాటు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, బీజేపీ శాసనసభ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మిలు రమేశ్ రాథోడ్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.

బీటీపీఎస్‌లో ప్రమాదంతో రూ.25కోట్ల నష్టం

- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డైరెక్టర్ లక్ష్మయ్య
- డిప్యూటీ సీఎం భట్టి ఆరా.. నివేదిక ఇవ్వాలని ఆదేశం



బీటీపీఎస్‌లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

మణుగూరు/హైదరాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్(బీటీపీఎస్)లో శనివారం రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదానికి పిడుగుపాటే కారణమని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్-3 (320, 420/16.5 కేవీ) పూర్తిగా కాలిపోయింది. దీంతో యూనిట్-1 ద్వారా ఉత్పత్తి అయిన 270 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పిడుగుపాటుతో ట్రాన్స్‌ఫార్మర్ బుష్‌లు పేలిపోయి తునాతునకలయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉన్న ఆయిల్‌కు నిప్పంటుకోవడం వల్లే మంటలు ఎగిసిపడినట్లు గుర్తించారు. ఆ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. సుమారుగా రూ.25కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు తెలిపారు. కాగా, ప్లాంట్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య ఆదివారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శనివారం రాత్రి 7.26నిమిషాలకు యూనిట్-1 ట్రిప్ కావడానికి పిడుగుపాటే కారణమన్నారు. పూర్తి స్థాయి పరిశీలన తర్వాతే ఎంత నష్టం జరిగిందన్న అంశాన్ని నిర్దిష్టంగా చెప్పగలమన్నారు. కాగా, బీటీపీఎస్ అగ్ని ప్రమాదంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరా తీశారు. ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని జెన్‌కో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, చీఫ్ ఇంజనీర్లు రత్నాకర్, బిచ్చన్నను ఆదేశించారు.



డీఎస్‌కు నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి



డీఎస్ చితి వద్ద కుటుంబ సభ్యులు

తెలంగాణ ఏర్పాటులో

డీఎస్ పాత్ర కీలకం

నిబద్ధత గల నాయకుడిని కోల్పోయాం.. గాంధీ కుటుంబానికి ఆత్మీయుడిగా గుర్తింపు పొందారు: సీఎం రేవంత్

- జన హృదయ నేతకు అశ్రునయనాలతో అంత్యక్రియలు

నిజామాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కలిగిన నేత డీఎస్ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన సామాన్య కార్యకర్త నుంచి పీసీసీ అధ్యక్షుడి వరకు ఎదిగారని, కష్టపడి పని చేశారని చెప్పారు. ధర్మపురి శ్రీనివాస్ మరణంతో కాంగ్రెస్ పార్టీ ఒక నిబద్ధత గల నాయకుడిని కోల్పోయినట్లుందన్నారు. ఆదివారం ఆయన నిజామాబాద్‌లో డీఎస్ పార్థివదేహానికి నివాళులర్పించారు. ఆయన కుమారులైన సంజయ్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో డీఎస్ పాత్ర ఎనలేనిదన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2004లోనే తెలంగాణ ఏర్పాటు ఆవశ్యకతపై సోనియాగాంధీకి చెప్పారని గుర్తుచేశారు. ఆయన వివరించడం వల్లే సోనియా కరీంనగర్ సభలో తెలంగాణపై మాట్లాడారన్నారు. ఆ తర్వాత రాష్ట్ర కల సాకారమైందని రేవంత్ తెలిపారు. కొన్ని అనివార్య పరిస్థితుల్లో పార్టీకి దూరమైన ఆయన్ను పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎదురైనప్పుడు సోనియాగాంధీ ఆత్మీయంగా పలకరించారన్నారు. పార్టీలో లేకపోయినా డీఎస్ మనవాడని సోనియా చెప్పారని పేర్కొన్నారు. ఆ సమయంలోనే కాంగ్రెస్‌లో మళ్లీ చేరతానని డీఎస్ అన్నారని.. రాజ్యసభ పదవీ కాలం పూర్తవకుండానే పార్టీలో చేరతాననడంతో ఏవైనా పదవులను ఆశిస్తున్నారా? అని అడిగితే.. తనకు పదవుల మీద వ్యామోహం లేదని డీఎస్ చెప్పారని రేవంత్ గుర్తుచేసుకున్నారు. తాను చనిపోయినప్పుడు కాంగ్రెస్ జెండా కప్పాలని ఆయన కోరారన్నారు. ఆయన కోరికను నెరవేర్చి, అధికార లాంఛనాలతో అంత్యక్రియలకు ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. 40 ఏళ్ల పాటు పార్టీకి చేసిన సేవలను గుర్తించి నివాళులర్పించామన్నారు. డీఎస్ మరణ వార్త తెలియగానే పార్టీ అగ్రనేత సోనియా, రాహుల్ తమ సంతాపాన్ని తెలియజేశారని చెప్పారు. డీఎస్ జ్ఞాపకార్థం ప్రభుత్వం తరఫున ఏం చేయాలనే దానిపై కుటుంబ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. డీఎస్ కుటుంబానికి అండగా ఉంటామని రేవంత్ తెలిపారు. సీఎం వెంట మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. డీఎస్ మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సంతాపం వ్యక్తం చేశారు. కాగా, ఉద్యోగులకు డి.శ్రీనివాస్ ఇచ్చిన మద్దతును ఎన్నడూ మరచిపోలేమని ఏపీ ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.

జన హృదయ నేత డి.శ్రీనివాస్‌కు ప్రజలు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. డీఎస్ అంతిమయాత్ర నిజామాబాద్‌లోని ఆయన నివాసం నుంచి బైపాస్ రోడ్డులోని వ్యవసాయ క్షేత్రం వరకు సాగింది. అంతిమయాత్రలో డీఎస్ అభిమానులు, శ్రేయోభిలాషులు,ప్రజలు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. అక్కడ ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన చితికి పెద్ద కుమారుడు సంజయ్ నిప్పంటించారు.

విజయవాడ హైవే నుంచి జీఎంఆర్ ఔట్

- నెలకు రూ.6కోట్ల మేర నష్టమే కారణం
- ఎన్‌హెచ్ఏఐ పరిధిలో మూడు టోల్‌గేట్లు
- తాత్కాలిక ఏజెన్సీలకు బాధ్యతల అప్పగింత

చౌటుప్పల్ రూరల్, జూన్ 30: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) నిర్వహణ బాధ్యతల నుంచి జీఎంఆర్ సంస్థ తప్పుకొంది. ఈ మేరకు యాదాద్రి-భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లు టోల్‌గేట్ల బాధ్యతలను వదులుకుంది. దీంతో.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ టోల్‌గేట్లను స్వాధీనం చేసుకుంది. టోల్ వసూలు బాధ్యతలను తాత్కాలికంగా మూడు ఏజెన్సీలకు అప్పగించింది. పంతంగి టోల్‌గేట్ బాధ్యతలను స్కైల్యాబ్, ఇన్‌ఫ్రా గ్రూపులకు.. చిల్లకల్లు టోల్‌గేట్ బాధ్యతలను కోరల్ ఇన్‌ఫ్రాకు అప్పగించింది. కాగా, అత్యంత రద్దీగా ఉండే రహదారుల్లో ఒకటైన విజయవాడ హైవే విస్తరణకు గతంలో ఉద్యమాలు జరిగాయి. దీంతో.. 2010లో అప్పటి యూపీఏ సర్కారు బిల్డ్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్(బీఓటీ) విధానంలో టెండర్లను ఆహ్వానించగా.. జీఎంఆర్ రూ.1,740కోట్లతో పనులను దక్కించుకుంది. యదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ వరకు 181కి.మీ రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసింది. 2012 నుంచి పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు వద్ద టోల్‌గేట్లు ఏర్పాటయ్యాయి. 12 ఏళ్లుగా ఈ రహదారి బాధ్యతలను నిర్వర్తించిన జీఎంఆర్.. ఇప్పుడు తప్పుకోవడంతో.. తిరిగి ఎన్‌హెచ్ఏఐ తన అధీనంలోకి తీసుకుంది.

నష్టాలే కారణం..

పంతంగి టోల్ మీదుగా రోజుకు 35 వేల దాకా.. వారాంతాలు, సెలవు రోజుల్లో అంత కన్నా ఎక్కువ వాహనాలు వస్తుంటాయి. అయినా.. తమకు ఈ రహదారి నిర్వహణతో నష్టం వాటిల్లుతోందని జీఎంఆర్ ప్రతినిధి ఒకరు తెలిపారు. 2025 జూన్ నెలాఖరు వరకు జీఎంఆర్ సంస్థకు టోల్ వసూలు హక్కులున్నా.. ఏడాది ముందుగానే తప్పుకొంటున్నట్లు తెలిపారు. నెలకు రూ.6కోట్లమేర.. అంటే రోజుకు రూ.20లక్షల చొప్పున నష్టం వస్తుండడంతోనే ఈ టోల్‌గేట్లను వదులుకున్నట్లు వివరించారు. ముందుగానే తప్పుకొంటున్నందుకు నష్టపరిహారం చెల్లించేందుకు జీఎంఆర్ సిద్ధపడడం గమనార్హం.! 2025లోగా ఈ రహదారిని ఆరు లేన్లకు అభివృద్ధి చేయాల్సి ఉన్నా.. దీనిపై జీఎంఆర్ కోర్టు నుంచి స్టే తెచ్చుకుంది.

నిమ్స్ ఆస్పత్రి నుంచి చెంచు మహిళ డిశ్చార్జి

- నేడు చెంచు గూడాలకు మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పని కిరావడంలేదని యజమానులు గదిలో నిర్బంధించి పాశవికంగా హింసించిన ఘటనలో గాయపడిన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లికి చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మ (20) నిమ్స్ ఆస్పత్రిలో కోలుకుని ఆదివారం డిశ్చార్జ్ అయ్యారు. సీనియర్ జర్నలిస్ట్ పాశంయాదగిరి, దయాల జితేందర్ నిమ్స్ ఆస్పత్రిలో ఆమెను పరామర్శించారు. గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని వారి భూములను బలవంతంగా గుంజుకుంటున్నారని పాశం యాదగిరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలకు అన్నీ తెలిసి మౌనంగా ఎందుకు ఉంటున్నారని ప్రశ్నించారు. మంత్రి సీతక్కతో పాటు, నిమ్స్ ఆస్పత్రి, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి బాధితురాలు ధన్యవాదాలు తెలిపారు. ఇదిలా ఉండగా మంత్రి సీతక్కతో పాటు ఆదివాసీ హక్కుల సంఘాల ప్రతినిధులు సోమవారం చెంచు గూడాలను సందర్శించనున్నారు.

డానియల్ ఫెర్నాండజ్ షో రద్దు

హైదరాబాద్ సిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన స్టాండప్ కమెడియన్ డానియల్ ఫెర్నాండజ్ షో రద్దయింది. వరుసల షోల కారణంగా అలసిపోవడంతో, విశ్రాంతి కోసం ఈ షోను రద్దు చేసుకున్నట్లు డానియల్ ఫెర్నాండజ్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఓ షో సమయంలో తాను జైనుల గురించి మాట్లాడిన మాటలు కొందరిని ఇబ్బంది పెట్టాయని, ఇందుకు క్షమించాలని కోరారు. ఓ షోలో డానియల్ చేసిన వ్యాఖ్యలు జైనులను కించేపరిచేలా ఉన్నాయని, హైదరాబాద్‌లో ఆయన షోను అడ్డుకుంటామని పేర్కొంటూ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇటీవల ఓ వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే.

20 కోట్లతో ఉడాయించిన చిట్టీల వ్యాపారి

హయత్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎత్తిన చిట్టీ డబ్బుకు అధిక వడ్డీ ఆశ చూపి ఓ వ్యాపారి వంద మందికి పైగా బాధితుల నుంచి రూ.20కోట్లకు పైగా వసూలు చేసుకుని దుకాణం ఎత్తేశాడు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలుకు చెందిన చిట్టెటి మధుసూధన్‌రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ రాజరాజేశ్వరీకాలనీలో నివాసం ఉంటున్నాడు. ఓకళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ప్రవృత్తిగా చిట్టీల వ్యాపారం చేస్తుంటాడు. ఎత్తిన చిట్టీ డబ్బులకు అధిక వడ్డీ ఇస్తానని ఆశ చూపడంతో అనేక మంది డబ్బులు అతని వద్దనే ఉంచి ప్రతి నెల వడ్డీ తీసుకునే వారు. ఈ క్రమంలో ఉన్నట్టుండి శుక్రవారం ఇల్లు ఖాళీ చేసి కనిపించకుండా పోయాడు. విషయం తెలుసుకున్న బాధితులు శనివారం హయత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. అతనిపై 420సెక్షన్ కింద చీటింగ్ కేసు నమోదైంది.



కేంద్రమంత్రి గోయల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి దుద్దిళ్ల

రేవంత్ నివాసానికి గోయల్

» సీఎం ఆహ్వానంతో వెళ్లిన కేంద్ర మంత్రి

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. అధికారిక కార్యక్రమంపై నగరానికి వచ్చిన కేంద్ర మంత్రిని.. తన నివాసానికి రావాల్సిందిగా ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దీంతో తన ఇంటికి వచ్చిన పీయూష్ గోయల్‌కు రేవంత్ స్వాగతం పలికారు. ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు.

ఎస్‌బీఐ నూతన చైర్మన్ శ్రీనివాసులుకు సీఎం శుభాకాంక్షలు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నూతన చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి ఎంపికపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన శ్రీనివాసులు ప్రతిష్ఠాత్మకమైన ఎస్‌బీఐ చైర్మన్ పదవిని అధిరోహించడం ఒక మహత్తర సందర్భమని వ్యాఖ్యానించారు. శ్రీనివాసులు శెట్టికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎక్స్(ట్విటర్)లో పోస్ట్ పెట్టారు. ఇక, ఎస్‌బీఐ చైర్మన్‌గా చల్లా శ్రీనివాసులు శెట్టి ఎంపిక కావడంతో తెలంగాణ, ఉమ్మడి పాలమూరు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు లభించిందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

'రామచిలుక' పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్

బేగంపేట, హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై వివిధ కథాంశాలతో 'రామచిలుక' పేరిట రచించిన తెలుగు అనువాద కథల సంపుటిని రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఆదివారం రాజ్‌భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించి, రచయిత శ్రీధరన్ పిళ్లైని ప్రశంసించారు. రామచిలుక పుస్తకం రచయిత బహుముఖ ప్రజ్ఞకు, శ్రేష్ఠతకు, నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. గాయం, న్యాయం, చేపచిక్కాలంటే, రామచిలుక, సాయం సంధ్య, ఆత్మఛాయ, స్త్రీనైజం వంటి శీర్షికలతో ఏడు కథల సంపుటితో రాసిన ఈ పుస్తకం పాఠకుల ఆదారణ పొందాలని రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం, గోవా గవర్నర్ కార్యదర్శి యం.ఆర్.యం.రావు, ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, పద్మశ్రీ గ్రహీత కె. శివారెడ్డి, కవి, రచయిత ఎన్. రామచందర్‌రావు, పుస్తకం తెలుగు అనువాదకులు ఎల్.ఆర్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్.. రెండు లక్షల ఉద్యోగాలేవి?

» ఇచ్చిన హామీని మర్చిపోయారా?: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తయినప్పటికీ ఇంతవరకూ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని, ఆ హామీ ఏమైందని ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా రాష్ట్రంలోని నిరుద్యోగులను కలిసి, అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఉద్యోగాల భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పటికే వారు ప్రకటించిన పది తేదీలు గడిచిపోయాయని గుర్తు చేశారు. అంతేకాకుండా జాబ్ క్యాలండర్‌పై కాంగ్రెస్ పార్టీ ప్రతికల్లో పెద్దయెత్తున ప్రకటనలు కూడా చేసిందన్నారు. గతంలో ఆ పార్టీ ఇచ్చిన అడ్వర్టైజ్‌మెంట్‌ను కూడా కేటీఆర్ పోస్టు చేశారు. గతంలో రాహుల్ హైదరాబాద్‌లో నిరుద్యోగ యువతను కలిసి సందర్భంగా చేసిన ట్వీట్‌ను కూడా ఈ సందర్భంగా పోస్టు చేశారు.

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం: హరీశ్‌రావు

అడ్డగుట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యల్ని పరిష్కరించాలని, లేదంటే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నిరుద్యోగులకు న్యాయం చేయాలంటూ వారం రోజుల క్రితం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దీక్ష చేస్తున్న నిరుద్యోగ విద్యార్థి మోతీలాల్ నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షల నిమిత్తంగా గాంధీ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే దీక్ష చేస్తున్న మోతీలాల్ నాయక్‌ను ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల ముందు నిరుద్యోగులను పిలిపించుకుని మాట్లాడిన కోదండరాం ఇప్పుడేమో పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇప్పటికైనా నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

ప్రైవేటు చేతికి విద్యుత్ బిల్లుల వసూలు ప్రక్రియ

» అదానీకి అప్పగించేందుకు సర్కార్ కుట్ర: జగదీశ్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల వసూళ్లను అదానీకి అప్పగించేందుకు కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఆరోపించారు. పాతబస్తీతో మొదలుపెట్టి రాష్ట్రవ్యాప్తంగా బిల్లుల వసూలు బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాతబస్తీలో 45% మాత్రమే విద్యుత్ బిల్లులు వసూలవుతున్నాయని, అందుకే ప్రైవేటు వ్యక్తులకు వసూలు బాధ్యత అప్పగిస్తున్నామని ముఖ్యమంత్రి అనడం ఆ ప్రాంత ప్రజలను అవమానించడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ కనుసన్నల్లోనే ముఖ్యమంత్రి పని చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ బిల్లుల వసూళ్లపై ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని జగదీశ్ రెడ్డి డిమాండ్ చేశారు.

రేవంత్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు లేదు

» అందుకే మా ఎమ్మెల్యేలపై దృష్టి: పెద్ది, వినయ్‌భాస్కర్

బాలసముద్రం, జూన్ 30: సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు లేదని, అందుకే తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం హనుమకొండలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 38 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను వ్యతిరేకిస్తున్నారన్నారు. కేవలం 26 మంది ఎమ్మెల్యేలే రేవంత్‌రెడ్డిని బలపరుస్తున్నారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి శనివారం వరంగల్ నగర పర్యటన వల్ల రూ.3కోట్ల ప్రజాధనం వృథా అయ్యిందని ఆరోపించారు. నాలుగైదు నిమిషాల్లోనే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలించి కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా వ్యవహరించారని, కాంట్రాక్టర్లను బెదిరించారని ఆయన విమర్శించారు.

సైద్ధాంతిక నిబద్ధతకే 'సారథ్యం' ఇవ్వండి

» బీజేపీ అధినాయకత్వానికి సీనియర్ నేతల వినతి

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పార్టీ సిద్ధాంతం పట్ల నిబద్ధత కలిగిన నాయకుడికే సారథ్య బాధ్యతలు కట్టబెట్టాలని కొంత మంది బీజేపీ సీనియర్ నాయకులు అధినాయకత్వాన్ని కోరారు. కొత్త అధ్యక్షుడి నియామకాన్ని ఏకపక్షంగా చేయకుండా అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. శనివారం, కొంతమంది సీనియర్ నాయకులు నగరంలోని ఒక హోటల్‌లో సమావేశమయ్యారు. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన పార్టీ నేతలు.. రాష్ట్ర పార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం, ఎంపీ ఎన్నికల ఫలితాలు, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఎంపీ ఎన్నికల్లో పార్టీ సాధించిన ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అంకితభావంతో పనిచేసిన వారికే అధ్యక్షుడిగా అవకాశం ఇవ్వాలని క్యాడర్ అభిప్రాయపడుతోందని ఒక సీనియర్ నేత 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

స్మార్ట్ సిటీ మిషన్ గడువు పొడిగింపు

» పనుల పూర్తికి మార్చి 31 దాకా చాన్స్

» సీఎం విజ్ఞప్తికి కేంద్రం సానుకూల స్పందన

» మ్యాచింగ్ గ్రాంట్ నిధులిచ్చి రాష్ట్రం అభివృద్ధికి సహకరించాలి: బండి సంజయ్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో అమలవుతున్న స్మార్ట్ సిటీ మిషన్ గడువును కేంద్ర ప్రభుత్వం 2025 మార్చి 31 వరకు పొడిగించింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి ఓ లేఖ రాసింది. నిజానికి, స్మార్ట్ సిటీ మిషన్ గడువు ఆదివారంతోనే ముగిసింది. ఇటీవల ఢిల్లీలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద రాష్ట్రంలో చేపట్టిన పనులు పూర్తికాకపోవడంతో వచ్చే ఏడాది జూన్ వరకు గడువును పెంచాలని కోరారు. సీఎం విజ్ఞప్తి పట్ల సానుకూలంగా స్పందించిన కేంద్రం.. మిషన్ గడువును వచ్చే ఏడాది మార్చి 31వరకు పెంచుతున్నట్టు శనివారమే రాష్ట్రానికి లేఖ రాసింది. అదే విధంగా స్మార్ట్ సిటీ మిషన్‌కు ఎంపికైన ఇతర రాష్ట్రాలకు కూడా గడువు పొడిగింపుపై లేఖలు పంపింది. అయితే, కొత్త పనులు మంజూరు చేయమని, ఇప్పటికే ఆమోదించి చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేసింది. పనులకు సంబంధించిన నిధులను ఈ ఏడాది సెప్టెంబరులో విడుదల చేస్తామని పేర్కొంది. రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్ నగరాలు స్మార్ట్ సిటీ మిషన్ కింద ఎంపికయ్యాయి. వరంగల్‌లో మొత్తం 101 పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 45 పనులు పూర్తయ్యాయి. ఇంకా రూ.518కోట్లతో మరో 66 పనులు కొనసాగుతున్నాయి. కరీంనగర్‌లో మొత్తం 47 పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 25పనులు పూర్తవ్వగా, రూ.287కోట్లతో మరో 22 పనులు కొనసాగుతున్నాయి.

వరంగల్, కరీంనగర్ అభివృద్ధి: సంజయ్

స్మార్ట్ సిటీ మిషన్ గడువును కేంద్రం దేశ వ్యాప్తంగా పొడిగించడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కరీంనగర్, వరంగల్ నగరాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. స్మార్ట్ సిటీ నిధులను విడుదల చేయాలని గతంలో తాను మూడు సార్లు ప్రభుత్వానికి లేఖలు రాశానని గుర్తు చేశారు. కరోనా వల్ల రెండేళ్ల పనులు ఆగిపోవడంతో స్మార్ట్ సిటీ మిషన్ గడువును పొడిగించాలని కోరామని చెప్పారు. స్మార్ట్ సిటీ నిధులు దారి మళ్లకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా కింద మ్యాచింగ్ గ్రాంట్ నిధులను సకాలంలో విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం స్మార్ట్ సిటీ మిషన్ నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. గత పాలకులు కమీషన్లకు ఆశపడడంవల్లే పనులు జాప్యమయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు కూడా కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. స్మార్ట్ సిటీ నిధుల వినియోగంలో జరిగిన అవకతవకలు, కమీషన్ల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

బదిలీకి లెక్క

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధ్యాయులను ఇవ్వనున్నారు. మరికొన్ని పాఠశాలల్లో పోస్టుల కంటే ఎక్కువ మంది టీచర్లను కేటాయించే అవకాశం కూడా ఉంది. పాఠశాల విద్యా బోధనలో నాణ్యతా ప్రమాణాలు పెంచేందుకు, ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్యా బోధనను అందించేందుకే ఈ విధంగా ఉపాధ్యాయ బదిలీలు చేపడుతున్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట తక్కువ మంది ఉపాధ్యాయులు, తక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉండడంతో విద్యా ప్రమాణాలు నానాటికీ పడిపోతున్నాయి. కొన్ని చోట్ల అసలు విద్యార్థులే లేని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ నేపథ్యంలో.. విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో హేతుబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు గతంలో ఉన్న మార్గదర్శకాలను కొంత సవరించింది.



పాఠశాలలు, విద్యార్థులు, టీచర్ల సంఖ్య ఇలా

విద్యార్థుల సంఖ్య	పాఠశాలలు	మొత్తం విద్యార్థులు	పనిచేసే టీచర్లు
1>10	844	5,985	1275
11>40	633	18,655	1,654
41>60	311	15,937	1,129

మెరుగైన విద్యా బోధన కోసమే..

ఇప్పటివరకు ఉన్న విధానం ప్రకారం.. 0-19 మంది వరకు విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఒక టీచర్, 20 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకైతే ఇద్దరు, 61 నుంచి 90 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు టీచర్లు ఉండేలా గత ప్రభుత్వం 2015 జూన్ 27న జీవో నెంబరు 17, తర్వాత 2021 ఆగస్టు 21న జీవో నెంబరు 25ను జారీ చేసింది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానంలో కొన్ని మార్పులు చేసింది. విద్యార్థుల సంఖ్య, వారికి మెరుగైన విద్యా బోధన అందించే విషయాలను దృష్టిలో పెట్టుకొని ఆయా పాఠశాలలకు టీచర్ పోస్టులను కేటాయించాలని సర్కారు నిర్ణయించింది. దీని ప్రకారం.. 1 నుంచి 10 మంది విద్యార్థులున్న పాఠశాలకు ఒక టీచర్‌ను, 11 నుంచి 40 మంది వరకు విద్యార్థులున్న పాఠశాలకైతే ఇద్దరు టీచర్లను కేటాయించాలని నిర్ణయించారు. ఇక 41 నుంచి 60 మంది విద్యార్థులున్న పాఠశాలకు ముగ్గురు టీచర్లను కేటాయించాలని, 61కిపైన విద్యార్థులున్న పాఠశాలకైతే.. ఆ స్కూల్‌కు మంజూరైన అన్ని పోస్టులనూ భర్తీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకే వెబ్ ఆప్షన్లు ఇచ్చారు. ఒక్క విద్యార్థి కూడా లేని (జీరో అడ్మిషన్ల) పాఠశాలలకు ఉపాధ్యాయులను కూడా కేటాయించడం లేదు. ఈ మేరకు బదిలీ ఆప్షన్ కూడా ఇవ్వకూడదని నిర్ణయించారు. రాష్ట్రంలో ఈ ఏడాది జీరో అడ్మిషన్ల స్కూళ్ల సంఖ్య 1,739గా గుర్తించారు. వీటిలో ఇప్పటికీ 1,609 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్నవారు తప్పనిసరిగా బదిలీ అవుతారు. ఎనిమిదేళ్లు పూర్తికాని వారు మాత్రం ఆ పాఠశాలల్లోనే ఉంటారు. బదిలీల ప్రక్రియ పూర్తయి సోమవారం ఉదయం పోస్టుల కేటాయింపు తర్వాత విద్యార్థులు లేని పాఠశాలల్లో ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నారనేది స్పష్టత రానుంది.

పాఠశాలలో ఒకరిద్దరు విద్యార్థులు చేరినా ఓకే..

విద్యార్థులు లేని పాఠశాలల్లో ఒకరిద్దరు విద్యార్థులు చేరినా ఉపాధ్యాయులను కేటాయిస్తారు. ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్న ఇతర పాఠశాలకు బదిలీ కావాలని కోరుకుంటే ప్రభుత్వం వెంటనే ట్రాన్స్‌ఫర్ చేస్తుంది. అంతేకాకుండా.. పాఠశాలలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల కన్నా రాబోయే రోజుల్లో ఎక్కువ మంది చేరితే .. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్తగా ఉపాధ్యాయులను కేటాయించనున్నారు. ఈ విధానం ద్వారా ఉపాధ్యాయుల కొరత సమస్య కూడా తలెత్తదని, ఎక్కువ మంది విద్యార్థులున్న స్కూళ్లకు ఆ మేరకు టీచర్లను కేటాయించే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. శిక్షణ పొంది, నైపుణ్యం, అపార అనుభవం ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుల బోధన విద్యార్థులకు అందేలా చూడాలన్నదే ప్రభుత్వం లక్ష్యంగా ఉంది. ఈ మేరకే విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తిని హేతుబద్ధీకరించాలని నిర్ణయించింది. విద్యార్థులు లేనిచోట ఉపాధ్యాయుల సామర్థ్యం వృథా కావద్దనే ఉద్దేశంతోనే బదిలీల్లో విద్యార్థులు లేని పాఠశాలలను వెబ్ ఆప్షన్‌లో బ్లాక్ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. మిగిలిన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఖాళీలను ఆన్‌లైన్‌లో చూపారు. ఇప్పటికే ఉపాధ్యాయులు (రంగారెడ్డి జిల్లా మినహా) వెబ్ ఆప్షన్లు ఇవ్వడం దాదాపు పూర్తయింది. ఆదివారం రాత్రి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ముగుస్తుంది. వాటిని పరిశీలించిన తర్వాత సోమవారం ఉదయం ఉపాధ్యాయులు పెట్టుకున్న దరఖాస్తుల ఆధారంగా ఆయా పాఠశాలలకు వారిని బదిలీ చేసి ఆ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతారు. సోమవారం ఉదయం నుంచి రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలల్లో ఖాళీలకు అనుగుణంగా బదిలీల ప్రక్రియను ప్రారంభించి మూడు రోజుల్లో దానిని పూర్తి చేస్తారు.

ఉపాధ్యాయ సంఘాల అభ్యంతరాలు..

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పలు ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిర్ణయం కారణంగా.. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెబ్ ఆప్షన్లలో చూపించకుండా కొన్ని పోస్టులనే చూపిస్తున్నారని, దీంతో ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందని పేర్కొంటున్నాయి. ఉపాధ్యాయల సంఘాల స్టీరింగ్ కమిటీ కన్వీనర్ చావా రవి, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సోమయ్య, లింగారెడ్డి, ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ షౌకత్ అలీ, పిట్ల రాజయ్య ఈ విషయంపై స్పందించారు. బదిలీల్లో అన్ని ఖాళీలను చూపించి, బదిలీల అనంతరం సర్దుబాటు చేయాలని వారు కోరారు. విద్యార్థుల సంఖ్య పేరిట వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటిత రేషనలైజేషన్ చేస్తున్నారని ఆరోపించారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కోర్టు కేసులను బూచిగా చూపి వేల సంఖ్యలో ఉండే ఎస్‌జీటీలకు ఆప్షన్ గడువును ఒక్క రోజే ఇచ్చి హడావుడిగా బదిలీలను ముగించాలని చూడటం సమంజసం కాదన్నారు. సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించకుండా, ఖాళీలను పూర్తి స్థాయిలో చూపించకుండా జరిపే బదిలీల ద్వారా న్యాయం జరగదన్నారు.

కేసీఆర్‌తో కుమ్మక్కై జగదీశ్‌రెడ్డి అక్రమాలు..

» విద్యుత్తులో భారీ అవినీతి: వీరేశం

» నేడు విద్యార్థి, యువజన సంఘాల రాజ్‌భవన్ ముట్టడి

కట్టంగూరు/హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి కుమ్మక్కై విద్యుత్తు రంగంలో భారీ అవినీతికి పాల్పడ్డారని కాంగ్రెస్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆరోపించారు. విద్యుత్తు కొనుగోళ్లలో అవినీతి జరగలేదని చెబుతున్న జగదీశ్ రెడ్డి.. దమ్ముంటే తన నిజాయితీ నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. ఆదివారం నల్లగొండ జిల్లా కట్టంగూరులో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి విద్యుత్తు కొనుగోళ్ల కోసం రూ.10 వేల కోట్ల అప్పు చేశారన్నారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోళ్లలో ఎలాంటి అవినీతి జరగలేదని, జ్యుడీషియల్ కమిషన్ వేయాలని అసెంబ్లీ సాక్షిగా కోరిన జగదీశ్‌రెడ్డి.. ప్రభుత్వం కమిషన్ వేయగానే విచారణకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నారని ఆయన విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగుల ఆత్మహత్యలకు కారణమైన మాజీ మంత్రి హరీశ్ రావు.. ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు నిరుద్యోగులను పరామర్శిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్‌గౌడ్ ప్రశ్నించారు. ఆనాడు ఉద్యోగాల డిగితే హమాలీ పనులు చేసుకోవాలంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని, నిరుద్యోగం అనే పదం పలికే నైతికత కూడా వారికి లేదని ఓ ప్రకటనలో మండిపడ్డారు. కాగా, నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, ఎన్టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాజ్‌భవన్‌ను ముట్టడించనున్నట్లు విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కమిటీ ప్రకటించింది. ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ తదితర విద్యార్థి సంఘాల నేతలు ఇందులో పాల్గొననున్నట్లు తెలిపింది.

కొత్త ఒరవడితో ముందుకు..: చిన్నారెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్న ప్రణాళికా సంఘం.. కొత్త ఒరవడితో ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతోందని ఆ సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. ఖైరతాబాద్‌లోని అర్థగణాంక శాఖ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆ శాఖ డైరెక్టర్ దయానంద్ పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌కు తేడా లేదు

» కాంగ్రెస్ ఎమ్మెల్యేలకే సర్కారు నిధులు

» పక్షపాతం వల్లే బీఆర్ఎస్‌కు ఓటమి

» కేంద్రమూ అలాగే చేస్తే తెలంగాణ పరిస్థితి ఏంటి..?: బండి సంజయ్



హుస్నాబాద్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

భగత్‌నగర్(కరీంనగర్)/హుస్నాబాద్ రూరల్, జూన్ 30: పార్టీ ఫిరాయింపుల్లో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు తేడా లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. ఆదివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులు, నిధుల కేటాయింపు, సింగరేణి ప్రైవేటీకరణపై దుష్ప్రచారం వంటి అంశాల్లో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందన్నారు. నియోజకవర్గాల అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మాత్రమే సర్కారు నిధులిస్తోందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇలానే పక్షపాతం చూపితే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కూడా అలా చేస్తే తెలంగాణ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రులు కేంద్రాన్ని కలిస్తే సర్కారు పూర్తిగా సహకరిస్తోందన్నారు. తెలంగాణలో జనసేనతో పొత్తుపై పవన్ కల్యాణ్ తన ప్రతిపాదనను బీజేపీ ముందుంచారని, దీనిపై పార్టీ అధినాయకత్వం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. భారత్ టీ-20 వరల్డ్ కప్ గెలవడం పట్ల సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. కాగా, దళారీ వ్యవస్థకు మోదీ సర్కార్ వ్యతిరేకమని, కమీషన్లు తీసుకుంటే ఖబర్దార్ అని సంజయ్ హెచ్చరించారు. కరీంనగర్‌లో పీఎం విశ్వకర్మ యోజన కోసం దరఖాస్తు చేసుకున్న మహిళలు ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. కొంతమంది దళారులు పథకం కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు.

'కార్పొరేట్ల' చేతిలో ప్రభుత్వాలు..

కార్పొరేట్ సంస్థలు ఇచ్చే డబ్బుతో నేడు ప్రభుత్వాలు నడిచే దుస్థితి ఏర్పడిందని సంజయ్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ఆదివారం శిశు మందిర్ విద్యాసంస్థ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడారు. కార్పొరేట్ విద్యాసంస్థల వల్ల చిన్న విద్యాసంస్థలు చిన్నాభిన్నం అయ్యాయన్నారు. కార్పొరేట్ సంస్థలతో సంస్కృతి, సంప్రదాయాలు మంటగలిసిపోతున్నాయని పేర్కొన్నారు. తాను శిశు మందిరంలోనే చదివానని సంజయ్ తెలిపారు.

స్థానిక సంస్థలపై కమలం గురి!

క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని ఎంపీలు, ఎమ్మెల్యేలకు జాతీయ నాయకత్వం పిలుపు

» అధికారంలోకి రావాలంటే క్షేత్రస్థాయిలో బలోపేతం కావాల్సిందేనని భావన

» పట్టు సాధించేందుకు అంతర్గత కసరత్తు

» అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై స్థానిక సంస్థల వారీగా బీజేపీ సమీక్ష

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 2028లో అధికారంలోకి రావాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ.. అది నెరవేరాలంటే స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యాన్ని గణనీయంగా పెంచుకోవాలని భావిస్తోంది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పార్టీని విస్తృత పరచాలని రాష్ట్ర నేతలకు జాతీయ నాయకత్వం సూచిస్తోంది. చట్టసభల్లో క్రమంగా బలం పెంచుకుంటున్న నేపథ్యంలో పంచాయతీలు, మండలాలు, జిల్లా పరిషత్‌లలో కూడా పాగా వేయాలని భావిస్తోంది. పార్లమెంటు ఎన్నికల్లో 8 సీట్లు సాధించడంతో పాటు ఓటుబ్యాంకును 35 శాతానికి పెంచుకున్న దృష్ట్యా.. ఈ ఊపును ముమ్ముందు కూడా కొనసాగించాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా అంతర్గత కసరత్తు చేపట్టింది. ఆరునెలల వ్యవధిలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలను స్థానిక సంస్థల వారీగా సమీక్షిస్తోంది. ఆయా సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా పట్టు సాధించేలా క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని ఎంపీలు, ఎమ్మెల్యేలకు బీజేపీ జాతీ య నాయకత్వం పిలుపునిచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో తడబడుతోందని, బీఆర్ఎస్ విశ్వసనీయత కోల్పోయినట్లు పార్లమెంటు ఎన్నికల ఫలితాలతో తేలిపోయిందని పేర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో గ్రామీణ స్థాయి నుంచి బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగేందుకు ఎక్కడికక్కడ కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించింది. స్థానిక సంస్థల్లో బలం పెంచుకోవడంలో భాగంగా జాతీయ నాయకత్వం అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహిస్తోందని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పంచాయతీలు, మునిసిపాలిటీల్లో బీజేపీకి ఎన్ని ఓట్లు వచ్చాయి? కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఎన్ని వచ్చాయి? పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఎన్ని చోట్ల మెజారిటీ వచ్చింది? రెండు ఎన్నికల్లో బీజేపీ ఎక్కడ బలం ప్రదర్శించింది? ఎక్కడ బలహీనంగా ఉంది? వంటి వివరాలతో సమీక్ష చేపట్టిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సమీక్ష అనంతరం క్యాడర్‌కు దిశానిర్దేశం చేయనున్నారు.

మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లపై ప్రత్యేక దృష్టి..


మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పట్టు సాధించడంపైనా బీజేపీ నాయకత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. "జీహెచ్ఎంసీ, వరంగల్, నిజామాబాద్ నగరపాలక సంస్థలతో పాటు పలు మునిసిపాలిటీల్లో పార్టీకి పెరిగిన ప్రాతినిధ్యం ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో దోహదపడింది. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఏకంగా 48 స్థానాలు గెలుచుకోవడంతో రాష్ట్రంలోని మిగతా మునిసిపాలిటీల్లోని క్యాడర్‌లో కొత్త జోష్ వచ్చింది. ఆ ఎన్నికలు జరిగిన ఏడాది వ్యవధిలో వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగగా.. మేం 10 డివిజన్‌లలో విజయం సాధించడం ఇందుకు నిదర్శనం" అని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

ప్రైవేటు భాగస్వామ్యంతో సుస్థిర ప్రగతి

» నిర్మాణాత్మక చర్చలతోనే దేశ భవిత

» కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

» తాజ్‌కృష్ణలో వ్యాపారవేత్తల సదస్సు



వ్యాపారవేత్తల సదస్సులో పాల్గొన్న కేంద్రమంత్రులు గోయల్, కిషన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు భాగస్వామ్యం, సాంకేతిక పురోగతి ద్వారా సుస్థిరమైన ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగాల కల్పన, ఎగుమతులు పెంచడం, ప్రపంచంతో మన దేశం పోటీపడటానికి ప్రైవేటు పెట్టుబడులు, వినూత్న ఆలోచనలు కీలకమైనవని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం ప్రైవేటు రంగానికి అండగా ఉందని చెప్పారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో వ్యాపారవేత్తల ఆత్మీయ సదస్సు ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. "ప్రభుత్వానికి, పారిశ్రామికవేత్తలకు మధ్య నిర్మాణాత్మకమైన చర్చకు ఈ వేదిక చాలా కీలకమైంది. ఇలాంటి చర్చల ద్వారానే దేశ భవిష్యత్తుకు బాటలు పడతాయి. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపే క్రమంలో.. మనకు ఎదురయ్యే సవాళ్ల గురించి కార్పొరేట్ కంపెనీలతో చర్చించేందుకు, వినూత్న ఆలోచనలు పంచుకోవడానికి ఇది మంచి వేదిక. పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణలు, సాంకేతికతకు హైదరాబాద్ కేంద్ర బిందువుగా ఉంది. దేశాన్ని ఆత్మనిర్భర్ భారత్‌గా, విశ్వగురువుగా తీర్చిదిద్దడానికి మన స్టార్టప్‌లు అద్భుతమైన పురోభివృద్ధిని సాధించాయి" అని కిషన్‌రెడ్డి అన్నారు.

కొత్తచట్టాలతో ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం

» సుప్రీంకోర్టులో పిటిషన్ వేస్తా: బి.వినోద్

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భారత న్యాయ వ్యవస్థను కేంద్రం నిర్వీర్యం చేస్తోందని.. ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి రానున్న కొత్తచట్టాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించేలా ఉన్నాయని మాజీ ఎంపీ బి. వినోద్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్, ఇండియన్ పీనల్ కోడ్, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ చట్టాలను రద్దు చేసి వాటిస్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాలను అమల్లోకి తెస్తోందన్నారు. స్వాతంత్ర్యం నాటి నుంచి ఉన్న ఈ చట్టాల్లో మార్పు తెచ్చిన నేపథ్యంలో వాటి వల్ల మంచి జరగకపోగా.. ప్రాథమిక హక్కులకు భంగం కలిగించేలా ఉన్నాయని ఆరోపించారు.కొత్త చట్టాల వల్ల బాధితుడికి అన్యాయం జరగనుందని, ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయకుండానే ప్రాథమిక (ప్రిలిమినరీ) విచారణ చేసే విధంగా కొత్త చట్టం తెచ్చారన్నారు కొత్త చట్టాలపై కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

తెలంగాణ భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలి

» టీటీడీకి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి



తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గతంలో తిరుమలకు వచ్చిన తెలంగాణ భక్తులు దర్శనం విషయంలో ఇబ్బందులు పడ్డారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు కూడా తెలుగు భక్తులేనని, తమ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై దర్శనాలు కల్పించే పద్ధతిని తిరిగి అమలుచేయాలని ఏపీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి, ఈవో, రాబోయే ఛైర్మన్‌ను కోరుతున్నానన్నారు. రాష్ట్రాలు వేరయినప్పటికీ తెలుగువారందరం ఒక్కటేనన్నారు. విదేశాల్లో ఉన్న భక్తులను ఆహ్వానిస్తున్నప్పుడు పక్కనే ఉన్న తెలంగాణ భక్తులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నానన్నారు.

సింగరేణి సీఎండీ బలరామ్‌కు ట్రీ మ్యాన్ అవార్డు

హైదరాబాద్/కొత్తగూడెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రాంతంలో 18 వేలకు పైగా మొక్కలు నాటించి, 6 జిల్లాల్లో 35 చిట్టడవులను పెంచడంలో కీలకంగా వ్యవహరించినందుకుగాను సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ట్రీ మాన్ ఆఫ్ తెలంగాణ అవార్డును అందుకున్నారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించిన గ్రీన్ మ్యాపుల్ ఫౌండేషన్-2024 అవార్డుల ప్రదానోత్సవంలో ఆ సంస్థ ఎండీ అశుతోష్ వర్మ, ఎన్టీపీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ఉన్నతాధికారులు బలరామ్‌కు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా బలరామ్ మాట్లాడారు. ఈ ఏడాది వన మహోత్సవంలో మరో 2 వేల మొక్కలు నాటాలని వ్యక్తిగత లక్ష్యాన్ని పెట్టుకున్నానని తెలిపారు.

బీఆర్ఎస్ శ్రేణులు సీపీఐలోకి వచ్చేలా కృషి

» రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతాం: కూనంనేని

ఖమ్మం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో మరికొన్ని నియోజకవర్గాల్లోనూ సీపీఐని బలోపేతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ పార్టీగా ఎదుగుతామని పేర్కొన్నారు. ఖమ్మంలో మూడురోజుల పాటు జరిగిన సీపీఐ రాష్ట్రసమితి సమావేశాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘోర ఓటమి దృష్ట్యా రాబోయే కాలంలో ఆ పార్టీ కోలుకోలేదని ఈ నేపథ్యంలో గులాబీ శ్రేణులను సీపీఐలోకి వచ్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. బొగ్గుగనుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్పొరేటర్ల బాహాబాహీ

» బండ్లగూడ 'వన మహోత్సవం'లో మేయర్ వర్సెస్ మాజీ మేయర్

రాజేంద్రనగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వన మహోత్సవం కార్యక్రమంలో బండ్లగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ (కాంగ్రెస్), మాజీ మేయర్ (బీఆర్ఎస్) వర్గీయులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సమక్షంలోనే గొడవపడి కొట్టుకు న్నారు. రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. బండ్లగూడ ఆరో వార్డులోని సన్ సిటీలో ఆదివారం వనమహోత్సవం కార్యక్రమానికి కమిషనర్ బి.శరత్‌చంద్ర ఆహ్వానం మేరకు వెళ్లామని మేయర్ లతా ప్రేమ్ కుమార్ గౌడ్ తెలిపారు. ఎమ్మెల్యేతో కలిసి మొక్కలు నాటుతుండగా ఆ కార్యక్రమానికి, తమకు ఎలాంటి సంబంధం లేదంటూ మాజీ మేయర్ మహేందర్ గౌడ్ అనుచరులు అడ్డుగా నిలబడ్డారన్నారు. తమ పార్టీకి చెందిన కార్పొరేటర్లు వారిని వారించినా వినలేదన్నారు. అవిశ్వాసం తీర్మానంలో ఓడిపోయామన్న అక్కసుతో మహేందర్ గౌడ్, ఆయన అనుచరులు తమ పార్టీ కార్పొరేటర్లు శ్రీనాథ్ రెడ్డి, చంద్రశేఖర్‌పై దాడి చేసి గాయపరిచారని చెప్పారు. మహేందర్ గౌడ్ అనుచరులు, హరీశ్ గౌడ్, శివ గౌడ్ తనను కులం పేరుతో దూషించడమే కాకుండా చొక్కా పట్టుకుని లాగి దాడి చేశారని చంద్రశేఖర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. హరితహారంలో పాల్గొన్న తనపైనా అకారణంగా దాడి చేశారని బీఆర్ఎస్ నాయకుడు హరీశ్ గౌడ్ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని ఏసీపీ తుల శ్రీనివాస్ తెలిపారు.



రాజేంద్ర నగర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గుమిగూడిన బండ్లగూడ కార్పొరేటర్లు, నాయకులు

ఆర్టీసీలో ఇక నగదురహిత ప్రయాణం

త్వరలో అన్ని బస్సుల్లో 'ఐటిమ్స్' .. మహిళల ఉచిత ప్రయాణం కోసం స్మార్ట్ కార్డుల జారీ

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సెక్కుతున్నారా? ఇక జేబులో డబ్బుల్లేకపోయినా పర్వాలేదు. చిల్లర సమస్య అసలే ఉండదు. ఎందుకంటే నగదురహిత (క్యాష్‌లెస్) ప్రయాణానికి టీజీఎస్ఆర్టీసీ జూలై లేదా ఆగస్టు నుంచి అవకాశం కల్పించనుంది. ఇప్పటికే హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, బండ్లగూడ డిపో బస్సులతో పాటు బెంగుళూరు, తిరుపతి తదితర దూర ప్రాంత సర్వీసుల్లో నగదురహిత లావాదేవీల కోసం ఐటిమ్స్ (ఇంటిలిజెంట్ టికెట్ ఇష్యూ మిషన్) వినియోగిస్తోంది. ఈ రూట్లలో మూడు నెలల క్రితం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఐటిమ్స్ విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బస్సుల్లో వినియోగించేందుకు అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ఆర్టీసీ బస్సుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు కేంద్ర రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ మంజూరు చేసిన రూ.10.97 కోట్లతో టీజీఎస్‌ఆర్టీసీ 13 వేల ఐటిమ్స్ సమకూర్చుకుంది. ప్రయాణికుల వద్ద నగదు లేకపోయినా క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు, నెట్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, మొబైల్ యూపీఐ ద్వారా డబ్బు చెల్లించి టికెట్ తీసుకోవచ్చు. కండక్టర్లు ఐటిమ్స్ వినియోగించి 'ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్ (ఎఎఫ్‌సీఎస్)'తో టికెట్ జారీ చేస్తారు. ఐటిమ్స్‌తో ఆర్టీసీ బస్సుల్లో చిల్లర డబ్బుల సమస్యకు కూడా పరిష్కారం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా సిటీ బస్సుల్లో చిల్లర సమస్య ప్రయాణికులు, కండక్టర్ల మధ్య గొడవలకు కారణమవుతోంది. మొదటి ట్రిప్పుల్లో ప్రయాణికులు టికెట్‌కు సరిపడ చిల్లర లేక పెద్దనోట్లు ఇస్తుండడంతో కండక్టర్లు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొంతమంది ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదులు చేయడం, వారు కండక్టర్లను మందలించడం జరుగుతోంది. కండక్టర్లు లేకుండా నడిచే బస్సుల్లో డ్రైవర్లే టికెట్లు ఇస్తుంటారు. ఐటిమ్స్‌తో వారి పని సులువు అవుతుంది. ఇక మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణం కోసం ఆర్టీసీ త్వరలో స్మార్ట్ కార్డులు జారీ చేయనుంది. వాటితో ఐటిమ్స్‌లో జీరో టికెట్ జారీ చేస్తారు. రాయితీ బస్ పాస్‌లు సైతం స్మార్ట్ కార్డులు, మొబైల్ బస్ పాస్‌లుగా మారనున్నాయి. జూలైలో కానీ ఆగస్టు మొదటి వారం నుంచి 9,100 బస్సుల్లో ఐటిమ్స్‌ను వినియోగంలోకి తీసుకురావచ్చని ఆర్టీసీ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, ఇప్పటికే ముంబై, బిహార్, అసోం, జబల్‌పూర్ తదితర ప్రాంతాల్లోని బస్సుల్లో ఐటిమ్స్‌తో నగదురహిత విధానం విజయవంతంగా అమలవుతోంది. టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు ఆయా ప్రాంతాల్లో అధ్యయనం చేసి, రూపొందించిన నివేదిక ఆధారంగా రాష్ట్రంలో అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డిజిటల్ పేమెంట్‌తో అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.



వైద్య పరీక్షల రిపోర్టులన్నీ ఆన్‌లైన్‌లో!



రోగుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు.. రిపోర్టులన్నీ టీ డయాగ్నస్టిక్ ద్వారానే

2 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టు.. తర్వాత దశలవారీగా రాష్ట్రమంతటా అమలు

హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రోగులకు రేవంత్ సర్కారు శుభవార్త చెప్పింది. సర్కారీ దవాఖానల్లో చేయించుకునే పరీక్షల రిపోర్టులన్నీ ఇకపై ఆన్‌లైన్‌లో అందించాలని నిర్ణయించింది. వైద్య పరీక్షల రిపోర్టుల సమాచారాన్ని రోగి సెల్‌ఫోన్‌కే పంపనుంది. ప్రస్తుతం ఖమ్మం, సిరిసిల్ల జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేయనున్నారు. అనంతరం దశలవారీగా రాష్ట్రమంతటా అమలు చేస్తారు. ఇప్పటిదాకా కేవలం తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రాల్లో చేయించుకునే పరీక్షలకే ఆన్‌లైన్ రిపోర్టులు వస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకునే రోగులు అక్కడికెళ్లి రిపోర్టులను తీసుకోవాల్సి వచ్చేది. కొన్నిసార్లు సకాలంలో రిపోర్టులు ఇచ్చేవారు కాదు.

ఒకే గొడుగు కిందకు..

ప్రస్తుతం సర్కారీ ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా ల్యాబ్‌లు ఉన్నాయి. జిల్లా ఆస్పత్రుల ప్రాంగణాల్లో తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లు కూడా ఉన్నాయి. ఇవి రాష్ట్రవ్యాప్తంగా 36 ఉన్నాయి. వీటిలో కొన్నింట్లో 57 రకాల పరీక్షలు చేస్తుండగా, మరికొన్నింట్లో 134 టెస్టులు చేస్తున్నారు. ఇక అత్యవసర సందర్భాల్లో చేసే టెస్టులు వేరేగా ఉంటున్నాయి. జిల్లా ఆస్పత్రులు ఐసీటీసీ, ఐడీఎస్పీ, టీబీల్యాబ్‌లతో పాటు బ్లడ్ బ్యాంకులు ఉంటాయి. ఈ ల్యాబ్‌ల్లో వేర్వేరుగా సిబ్బంది ఉన్నారు. ఆ విభాగాలకు సంబంధించిన రోగులకు టెస్టులు చేస్తున్నారు. దీంతో సిబ్బంది కొన్నిసార్లు ఖాళీగా ఉంటున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ల్యాబ్‌లన్నింటినీ ఒకే గొడుగు కిందకు అంటే టీ డయాగ్నస్టిక్ హబ్ కిందకు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనివల్ల ఆ ల్యాబ్‌ల్లో ఉండే సిబ్బంది అందరి సేవలను ఒకేచోట వాడుకునే వెసులుబాటు కలుగుతుంది. అలాగే సర్కారీ ఆస్పత్రుల్లో ఎటువంటి టెస్టులు చేయించుకున్నా మెసేజ్ రూపంలో ఆన్‌లైన్ రిపోర్టులు ఇవ్వనున్నారు. ఇప్పటివరకు కేవలం డయాగ్నస్టిక్ హబ్‌లో చేయించుకున్న పరీక్షలకే ఆన్‌లైన్ రిపోర్టులిస్తున్నారు. ఇకపై అన్ని రకాల రిపోర్టులు ఆన్‌లైన్ ద్వారా పంపుతారు. పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మం, సిరిసిల్ల జిల్లాల్లో దీన్ని అమలు చేయనున్నారు. అనంతరం దశలవారీగా రాష్ట్రమంతటా అమలు చేస్తామని వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అలాగే హైదరాబాద్‌లో వైద్యవిద్య సంచాలకుల పరిధిలో ఉన్న గాంధీ, ఉస్మానియా, నీలోఫర్ లాంటి పెద్దాస్పత్రుల్లో ఓపీ రోగులు చేయించుకునే పరీక్షలకు ఆన్‌లైన్ రిపోర్టు రావడం లేదు. ఇదే పరిస్థితి వరంగల్ ఎంజీఎంలోనూ ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ కూడా టీ డయ్నాగస్టిక్ సాఫ్ట్‌వేర్ వినియోగించి, రోగుల పరీక్షల రిపోర్టులను ఆన్‌లైన్ ద్వారా అందించాలని డీఎంఈ డాక్టర్ వాణి ప్రభుత్వానికి లేఖ రాశారు. దాంతో వైద్య ఆరోగ్యశాఖ ఆ దిశగా కసరత్తు చేస్తోంది.



డయాగ్నస్టిక్ హబ్‌తో 1.1 కోట్ల మందికి లబ్ధి

టీ డయాగ్నస్టిక్స్‌ను 2018లో ప్రారంభించారు. నాణ్యమైన డయాగ్నస్టిక్ సేవలను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చారు. రక్త, మూత్ర, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఈసీజీ లాంటి పరీక్షలన్నీ ఉచితంగా చేస్తున్నారు. ప్రతినెలా సగటున 11.39 లక్షల టెస్టులు చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలోనే 92 శాతం రిపోర్టులను ఆన్‌లైన్ ద్వారా రోగుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో పంపుతున్నారు. వీటిని ఏర్పాటు చేసినప్పటి నుంచి ఇప్పటివరకు సర్కారు మొత్తం రూ.360 కోట్లు ఖర్చు పెట్టింది. మొత్తం 1.1 కోట్ల మంది లబ్ధి పొందారు. ఇవే టెస్టులను ప్రైవేటులో చేయించుకుంటే వాటి విలువ రూ.1018 కోట్లు ఉంటుందని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

ఏపీలో నేడు పింఛన్ల పండగ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం సామాజిక పింఛన్ల పంపిణీలో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబోతోంది. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఒక్కో పెన్షన్‌దారుకు రూ.4 వేలు ఇవ్వనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పెన్షన్ 4 వేలుతో పాటు గత మూడు నెలలకు 3 వేలు (నెలకు 1000) బకాయి కలిపి ఒకేసారి 7 వేలు ఇవ్వనున్నారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే పంపిణీ చేయనున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయనున్నారు. మొత్తం 1,20,097 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులతో పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొదటిరోజే చాలావరకు పెన్షన్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, కళాకారులు, డప్పు కళాకారులు, ట్రాన్స్‌జెండర్లు వంటి వారికి ఇకపై ప్రతినెలా రూ.4 వేలు పెన్షన్ ఇవ్వనున్నారు. దివ్యాంగులకు రూ.3 వేల నుంచి ఒకేసారి రూ.6 వేలకు పెంచారు. తీవ్ర అనారోగ్యంతో ఉండే వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేలకు పెంచారు. ఈ విభాగంలో పెన్షన్ పొందే వారు 24,318 మంది ఉన్నారు. పింఛన్ల పెంపువల్ల ప్రభుత్వంపై నెలకు రూ.819 కోట్లు అదనపు భారం పడనుంది. ఒక్క రోజులో రూ.4408 కోట్లు పంపిణీ చేయనున్నారు. గడచిన మూడు నెలలకు కలిపి పెంచిన మొత్తం ఇవ్వడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.1650 కోట్లు అదనపు భారం పడనుంది. గత ప్రభుత్వంలో పింఛన్ల పంపిణీకి నెలకు రూ.1939 కోట్లు ఖర్చయ్యేది. చంద్రబాబు ప్రభుత్వం ప్రతి ఏటా పింఛన్ల కోసం రూ.34 వేల కోట్లు ఖర్చు చేయనుంది.

కవిత బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

న్యూఢిల్లీ, జూన్ 30: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్లపై సోమవారం (జూలై 1) ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించే అవకాశముంది. అన్ని పక్షాల వాదనల తర్వాత మే 28న కవిత 2 బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ స్వర్ణకాంత శర్మ.. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు తీర్పు ప్రకటించనున్నారు. సీబీఐ అవినీతి కేసుతో పాటు ఈడీ మనీ లాండరింగ్ కేసులో కవిత బెయిల్ దరఖాస్తులను కొట్టివేస్తూ మే 6న ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఆమె సవాల్ చేశారు. ఈ కేసులోని 50మంది నిందితుల్లో కవిత ఒక్కరే మహిళని.. దీన్ని పరిగణనలోకి తీసుకొని బెయిల్ ఇవ్వాలని కవిత తరఫు న్యాయవాది కోర్టును కోరారు. అయితే ఈ వాదనను సీబీఐ, ఈడీ వ్యతిరేకించాయి.



వీఐపీకి గంట, ధర్మదర్శనానికి 3 గంటలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వీఐపీ టికెట్ దర్శనానికి గంట, ధర్మదర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు చెప్పారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. పెద్ద సంఖ్యలో భక్తుల రాకతో ఆలయ తిరువీధులు, క్యూలైన్లు, పరిసర ప్రాంతాలు రద్దీగా కనిపించాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.45,08,650 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. - భువనగిరి అర్బన్

వర్షం.. రైతుల్లో హర్షం!

రాష్ట్రవ్యాప్తంగా కురిసిన వానలు.. పత్తి, కంది తదితర పంటలకు ఊపిరి

» హైదరాబాద్‌లోనూ మోస్తరు వర్షం

» నేడు, రేపు తేలికపాటి వర్షాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. అరకొర వానలతో అవస్థలు పడుతున్న అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతోంది. వర్షాధార పంటలైన పత్తి, జొన్న, మొక్కజొన్న, కంది పంటలు తిరిగి జీవం పోసుకుంటున్నాయి. సాగు పనులు ఊపందుకోనున్నాయి. ఆదివారం ఉమ్మడి రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్‌తో పాటు హైదరాబాద్‌లో వానలు పడ్డాయి. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 7.2, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో 6.9, ఆసిఫాబాద్ జిల్లా జైనూరులో 5.7, వికారాబాద్ జిల్లా తాండూరులో 5.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలుచోట్ల లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. రహదారులపై వరద నీరు నిలిచి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురిసింది. తాండూరు మునిసిపాలిటీ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో రోజంతా ముసురు పట్టడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. పలు జిల్లాల్లో ముసురులోనే రైతు కూలీలు మొక్కజొన్న, పత్తి తదితర పంటల్లో కలుపు తీత పనులు చేపట్టారు. మణుగూరు, ఇల్లెందు, కొత్తగూడెం సింగరేణి ప్రాంతాల్లో భారీ వర్షంతో సింగరేణి ఓపెన్‌కాస్టు గనుల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో సుమారు 50 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. ములకలపల్లి నుంచి అన్నపురెడ్డిపల్లి గ్రామానికి పాములేరువాగుపై డైవర్షన్ రోడ్డు వరద నీటితో కొట్టుకపోవడంతో రెండు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో భారీ వర్షం కారణంగా పాత కలెక్టరేట్ చౌరస్తా, రైల్వేస్టేషన్ చౌరస్తా, రైల్వే కమాన్ తదితర ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తారు స్థాయిలో వర్షాలు కురిశాయి. ఆ జిల్లాలోని కుంటాల, పొచ్చెర, గాయత్రి, కనకాయి జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో జలపాతాల వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలో సోమ, మంగళవారాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీరాలకు ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతంపై ఉన్న ఆవర్తనం తూర్పు ఝార్ఖండ్, దాని పరిసరాల్లో సగటు సముద్రపమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని పేర్కొంది.



ఆదివారం హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షం

మేడిగడ్డకు కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్: మేడిగడ్డ బ్యారేజీకి వరద ఉధృతి కొనసాగుతోంది. మానేరు, గోదావరి నదుల నుంచి వచ్చే నీటితో మేడిగడ్డ బ్యారేజీకి ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఆదివారం 14,050క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... ఫ్రీఫ్లో పద్ధతిన వచ్చిన నీటిని వచ్చినట్లే వదిలేస్తున్నారు. కుంగుబాటుకు గురైన బ్లాక్-7లో తాత్కాలిక మరమ్మతులు పూర్తయ్యాయి. బ్యారేజీకి దిగువన అప్రోచ్‌రోడ్లను పూర్తిగా తొలగించారు. ఎగువన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కాఫర్‌డ్యాం వరద వస్తే కొట్టుకుపోతుందనే ఉద్దేశంతో వదిలేసినట్లు తెలుస్తోంది. పగుళ్లు తేలిన పిల్లర్లకు మరమ్మతులు చేసే అవకాశం లేకపోవడంతో వంతెనపై నుంచి వాటి మధ్యలో సిమెంటు, కాంక్రీటు మిశ్రమాలను నింపుతున్నారు.

పెండింగ్ బిల్లులు వచ్చేనా!

బకాయిలపై తాజా మాజీ సర్పంచుల్లో ఆందోళన.. బీఆర్ఎస్ హయాంలో మౌఖిక ఆదేశాలతో పనులు

» అప్పులు చేసి మరీ పనులు చేసినా నిధులివ్వని సర్కారు

» రూ.వెయ్యి కోట్లకు పైగా బకాయిలు

» ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి ఇవ్వాలని వేడుకోలు

» పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు పెండింగ్



హైదరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): "గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పారని సొంతంగా లక్షల రూపాయలు అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేయించాం. పంచాయతీరాజ్ శాఖ అధికారుల ఆదేశాలతో.. పల్లె ప్రగతి పేరుతో నిర్మాణాలు చేపట్టాం. టార్గెట్లు పెట్టి మరీ.. వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, రైతు వేదికలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులకు మాతోనే డబ్బులు ఖర్చు పెట్టించారు. కానీ, ఏళ్లు గడిచినా వాటికి నిధులు విడుదల కాలేదు. అప్పులకు వడ్డీలు పెరిగిపోయాయి. మా పదవీకాలం పూర్తయి కూడా ఐదు నెలలు అయింది. గత ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదు.. కొత్త ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మా పరిస్థితేంటి?" ఇది రాష్ట్రంలోని తాజా మాజీ సర్పంచుల ఆందోళన. నిజానికి పంచాయతీల్లో పనులు చేయాలంటే నిర్దిష్ట నిబంధనలు పాటించాలి. తొలుత పంచాయతీ అనుమతి పొంది.. పనుల అంచనాలు సిద్ధం చేశాక.. ప్రభుత్వం వాటికి అనుమతులు జారీ చేస్తుంది. ఆ తర్వాత టెండరు ప్రక్రియ ద్వారా పనులు చేపట్టాలి. పనులు పూర్తయ్యాక ఎంబీ రికార్డులు నమోదు చేసి దశలవారీగా బిల్లులు విడుదల చేస్తారు. కానీ, కేవలం మౌఖిక ఆదేశాలతోనే పంచాయతీల్లో పనులు చేయించారు. అయితే ప్రభుత్వం మారిపోయి కొత్త ప్రభుత్వం రావడంతో ఆ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వస్తాయా? మునుగుతామా? అని తాజా మాజీ సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని 12,769 గ్రామ పంచాయతీల్లో పలు సందర్భాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం రూ.3 లక్షల నుంచి రూ.కోటి వరకు బకాయి ఉన్నట్లు వారు చెబుతున్నారు. ఈ లెక్కన రాష్ట్రం మొత్తమ్మీద రూ.1000 కోట్లకు పైగా బిల్లుల బకాయి ఉన్నట్లు పేర్కొంటున్నారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి తమకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతున్నారు. బిల్లుల కోసం గతంలో ఆందోళనలు సైతం చేసిన వీరు.. తాజాగా ఆదివారం గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిసి విన్నవించుకున్నారు.

రూ.3240 కోట్ల బకాయిలు

వాస్తవానికి గ్రామ పంచాయతీలకు చాలాకాలంగా రాష్ట్ర ఆర్థిక సంఘం (ఎస్ఎఫ్‌సీ) నిధులు విడుదల కావడంలేదు. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా అయిదు నెలలుగా రావడంలేదు. కేంద్రం నిధులు ప్రతినెలా దాదాపు రూ.180 కోట్ల నాలుగు నెలలకు సంబంధించి రూ.1,080 కోట్లు రావాల్సి ఉంది. మరోవైపు 18 నెలలకు సంబంధించి ఎస్ఎఫ్‌సీ నిధులు రూ.2,160 కోట్లు రావాల్సి ఉంటుందని అంచనా. ఈ రెండూ కలిసి రూ.3,240 కోట్లు గ్రామపంచాయతీలకు బకాయి ఉన్నట్లు తెలుస్తోంది. ఏ నిధులూ రాకపోవడంతో గ్రామాల అభివృద్ధి అగమ్యగోచరంగా మారింది. సర్పంచులు లేకపోవడంతో గ్రామ పంచాయతీల వారీగా నియమితులైన ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శులు.. నిధుల్లేని కారణంగా గ్రామాల్లో సమస్యలు తీర్చలేకపోతున్నారు. పలు రకాల పన్నుల రాబడి ఉన్న మేజర్ పంచాయతీల పరిస్థితి కొంత మెరుగ్గా ఉన్నా.. ఆదాయ వనరుల్లేని 5,500కు పైగా చిన్న పంచాయతీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఎస్ఎఫ్‌సీ నిధులు కాకపోయినా.. తాత్కాలికంగా పంచాయతీలకు ప్రత్యేక నిధులిస్తే బాగుటుందని ప్రత్యేకాధికారులు కోరుతున్నారు.

మమ్మల్ని ఆదుకోండి

» గవర్నర్‌కు సర్పంచుల సంఘం వినతి

"గత ప్రభుత్వ ఆదేశాల మేరకు అప్పులు చేసి మరీ మా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయించాం. ఏళ్లు గడిచినా చేసిన పనులకు మాకు బిల్లులు రాలేదు. మమ్మల్ని ఆదుకోండి" అంటూ రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రతినిధులు కోరారు. ఆదివారం రాజ్‌భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, ప్రతినిధులు మధుసూదన్ రెడ్డి, సుభాష్, ఆరుట్ల లక్ష్మీప్రసన్నరెడ్డి, గణేశ్, రాజేందర్, సముద్రాల రమేశ్ తదితరులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. "గత ప్రభుత్వ ఆదేశాలతో గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు సొంత డబ్బులను ఖర్చు చేశాం. కొంతమంది అప్పులుచేసి మరీ పనులు పూర్తి చేయించారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక కొందరు సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు" అని వారు గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడిచినా.. బిల్లులపై స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమకు బిల్లులు చెల్లించేలా చొరవ చూపాలని గవర్నర్‌ను అభ్యర్థించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.